ప్రతిపక్షం

www.prathipaksham.in

ఆదివారం 23.11.2025 | Published from: Hyderabad | సంపుటి: 18 సంచిక: 243 పేజీలు:12 వెల రూ. 5/-

@prathipaksham | prathipaksham tv telugu

తొలి రోజు ఓపికగా ఆడిన సౌతాఫ్రికా 12



తెలంగాణ ప్రజల ఆకాంక్షల కోసం 'జయ జయ హే తెలంగాణ' పాటను ప్రభుత్వం గుర్తించిందని సీఎం అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన రావాలని అందెశ్రీ, గద్దర్ అన్నలాంటి వాళ్లు కోరుకున్నారన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వారి కుటుంబాలకు అండగా నిలవాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరం తొమ్మిది మంది ఉద్యమ కారులను గుర్తించామని, అంతేకాకుండా రాబోయే రోజులలో ఫ్యూచర్ సిటీలో వారి కుటుంబానికి ఇళ్లను నిర్మించి అండగా నిలుస్తామని అన్నారు. ఎన్నో పోరాటాలు చేసిన చరిత్ర తెలంగాణ ఉద్యమ కారులదని సీఎం కొనియాడారు.

పెన్నుల మీద మట్టిగప్పుతారా!

అవి గన్నులై మొలకెత్తుతాయి!!

గడీల పాలనను కూల్చుతాయి

- నిరూపించిన ధీరుడు అందెశ్రీ
- అతడు ఒక కోహినూర్ వజ్రం
- తెలంగాణ ఉద్యమానికి దిక్సూచి
- నాకెంతగానో ఆత్మీయుడు, ఆప్తుడు
- గద్దర్, గోరటి వెంకన్న పోరు యోధులు
- తెలంగాణ పోరాటాల చరిత చాలా గొప్పది
- రాచరికానికి, ఆధిపత్యానికి ఎదురునిలిచింది
- ఫ్యూచర్ సిటీలో అందెశ్రీ కుటుంబానికి ఇల్లు
- అందెశ్రీ సంస్మరణ సభలో సీఎం రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 22: 'పెన్నులపైన మన్నుగప్పితే గన్నులై మొలకెత్తుతాయని, గడీలను కూల్చుతాయని' అందెశ్రీ నిరూపించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రాంతం ఎంత ప్రేమ చూపిస్తుందో, అంతే పోరాటాన్ని కూడా చేస్తుందని చెప్పారు. తెలంగాణ ప్రజలు, కవులు, కళాకారులూ ఎన్నో పోరాటాలు చేసారని, గతంలో నిజాం సర్కారును సైతం ఎదురొడ్డి పోరాడిన చరిత్ర తెలంగాణకు ఉందని పేర్కొన్నారు. రవీంద్ర భారతిలో శనివారం జరిగిన అందెశ్రీ సంస్మరణ సభలో సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. 'గద్దర్, గోరేటి వెంకన్న వంటి ఉద్యమకారులు తెలంగాణ మలి దశ ఉద్యమాన్ని రూపకల్పన చేశారు. బడికి వెళ్ళని అందెశ్రీ రాసిన 'జయ జయ హే తెలంగాణ' గీతం రాసిన చరిత్ర తెలంగాణకు ఉంది' అని రేవంత్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు జయ జయ హే తెలంగాణ పాటకు గౌరవం దక్కాలని కోరుకున్నారన్నారు. ఆ ఉద్యమంలో ప్రతి నాలుక మీద, ప్రతి వేదిక మీద జయ జయ జయహే తెలంగాణ పాట నిలిచించిందని,

..:: మిగతా 2లో

37 మంది మావోయిస్టుల లొంగుబాటు

కొనసాగుతున్న సరెండర్ ప్రక్రియ

అందులో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు

- ఛత్తీస్ గఢ్ నుంచి వచ్చినవారే అధికం
- ఆజాద్, రమేశ్, సోమ్‌దాదా అలియాస్ ఎర్ర
- అందరికీ పునరావాస ప్యాకేజీ అందజేస్తాం
- మిగతావాళ్లు కూడా త్వరగా లొంగిపోవాలి
- ఐదుగురు కేంద్ర కమిటీ సభ్యులు అజ్ఞాతంలోనే
- లొంగిపోయినవారికి ఎలాంటి వేధింపులు ఉండవు
- మీడియాతో తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి

ప్రతిపక్షంస్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 22 : మావోయిస్టులు అజ్ఞాతం వీడి జనజీవన స్రవంతిలో కలిసిపోతున్నారు. 37 మంది మావోయిస్టులు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ముందు శనివారం లొంగిపోయారు. వారిని మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. వారిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొయ్యల సాంబయ్య అలియాస్ ఆజాద్, రాష్ట్ర కమిటీ సభ్యుడు నారాయణ అలియాస్ రమేశ్, మరో రాష్ట్ర కమిటీ సభ్యుడు సోమ్‌దాదా అలియాస్ ఎర్ర ఉన్నారని డీజీపీ వెల్లడించారు. మిగతావారిలో ముగ్గురు డివిజనల్ కమిటీ సభ్యులు, తొమ్మిది మంది ఏరియా కమిటీ సభ్యులున్నారని వెల్లడించారు. వారు రెండు ఏకే 47లు, 4 ఎస్ఎల్ఆర్‌లు, 303 తుపాకులు, 343 తూటాలు

..:: మిగతా 2లో

ఢిల్లీ పేలుళ్ల వెనుక పాకిస్తాన్ కుట్ర

దేశ రాజధాని ఢిల్లీ ఎర్రకోట పేలుడు ఘటన విచారణ తర్వాత ఇది ఆత్మాహుతి దాడి అని అధికారులు నిర్ధారించారు. దీంతో భారత్ ఈ కుట్ర వెనుక ఎవరు ఉన్నారనే కూపీ లాగుతోంది. ఈ క్రమంలో పాకిస్తాన్ హస్తం బయటపడింది.

11



భారత్ లో మిలినీయం సిటీగా గుర్గావ్

భారత్ లో గుర్గాం మిలీనియం సిటీగా, కార్పొరేట్ క్యాపిటల్‌గా మారింది. సైబర్ సిటీ, ఉద్యోగ్ విహార్‌లో 500+ ఫార్చ్యూన్ 500 కంపెనీలు, ఐటీ ఫర్ములు, స్టార్టప్‌లు ఫ్లిప్‌కార్ట్, పేటీఎం వంటివి ఉన్నాయి.

11

గ్లోబల్ సమ్మిట్ కు భారీ ఏర్పాట్లు

- అంతర్జాతీయ స్థాయిలో ఉత్సవం
- ఫ్యూచర్ సిటీలో సువిశాల వేదిక
- 2047 డాక్యుమెంట్ కు తుది మెరుగులు
- 25 నుంచి ముఖ్యమంత్రి సమీక్షలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 22: నగరంలో డిసెంబర్ 8, 9 తేదీలలో నిర్వహించే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ను అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్ సిటీ ఏరియాలో నిర్వహించే రెండు రోజుల వేడుకలను రెండేండ్ల విజయోత్సవాలుగా జరపాలని సూచించారు. గ్లోబల్ సమ్మిట్

..:: మిగతా 2లో

మహిళలకే 'బస్సు స్టీరింగ్'

- 600 బస్సుల కొనుగోలుకు సిద్ధం
- ప్రతి మహిళా సంఘానికో బస్సు కేటాపింపు
- ప్రతి బస్సుకు నెలకు రూ.69,648 అద్దె
- మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యం

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్

నవంబర్ 22: తెలంగాణలో మహిళల కోసం ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా మహిళా సంఘాలు అభివృద్ధి కోసం చర్యలు చేపట్టింది. వారికి ఇప్పటికే తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తోంది. ఇప్పుడు వారి చేతికి బస్ స్టీరింగ్ అందించబోతోంది. ఇప్పటికే ప్రయోగాత్మకంగా అమలు చేసిన ఈ పథకం విజయవంతమైందని, రాష్ట్రంలో మిగతా మహిళా సంఘాలకు బస్‌లు ఇచ్చే పనికి

..:: మిగతా 2లో

తమిళనాడులో పొత్తుల యత్నాలు

తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల పొత్తులపై చర్చలు మొదలయ్యాయి. ఈ క్రమంలో ఇండియా కూటమి ముందడుగు వేసింది. డీఎంకేతో కలిసి పోటీ చేసేందుకు సిద్ధమైంది.

11

గ్లోబల్ సిటీగా హైదరాబాద్

- అత్యుత్తమ నగరాల జాబితా విడుదల
- అగ్రస్థానంలో బ్రిటన్ రాజధాని లండన్
- బెంగళూరు, ముంబై, ఢిల్లీ నగరాలకు చోటు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

న్యూఢిల్లీ, నవంబర్ 22: ప్రపంచంలోని అత్యుత్తమ నగరాల జాబితా 2025-26 ప్రకారం లండన్ ఈసారి కూడా అగ్రస్థానంలో ఉంది. ఈ జాబితాలో న్యూయార్క్ రెండో స్థానంలో ఉంది. వాస్తవానికి, ప్రతి సంవత్సరం ప్రపంచంలోని అత్యుత్తమ నగరాల జాబితాను

..:: మిగతా 2లో

'ఆకాంక్ష'కు సిద్దిపేట సారథ్యం

- డీసీసీ చీఫ్ గా కీలక నియామకం
- సిద్దిపేట రాజకీయాలలో మార్పులు
- కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి దారులు
- మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డికి గౌరవమే
- 'మైనంపల్లి'కి అధిష్టానం చెక్ పెట్టిందా?

చిటుకుల మైసారెడ్డి, ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, సిద్దిపేట, నవంబర్ 22: సిద్దిపేట జిల్లా రాజకీయ సమీకరణాలను మార్చేసే కీలక నిర్ణయం శనివారం వెలువడింది. గజ్వేల్‌కు చెందిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ తూంకుంట ఆంక్షారెడ్డిని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా నియమిస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. సిద్దిపేట డీసీసీ బాధ్యతలు ఆంక్షారెడ్డికి అప్పగించడం రాష్ట్ర కాంగ్రెస్ వర్గాలలో చర్చనీయాంశంగా మారింది. ఆంక్షారెడ్డి ఇటీవల కాలంలో జిల్లా కోసం చేసిన పోరాటాలు, ప్రజా సమస్యలపై హైదరాబాద్ వరకు పాదయాత్ర చేస్తూ చూపిన నాయకత్వం, పార్టీ పిలుపునిస్తే ముందుండే ధోరణి ఆమె పేరును హైకమాండ్ ముందు

..:: మిగతా 2లో

'తేజస్' కూలిపోవడం దురదృష్టకరం

భారత్‌కు చెందిన తేజస్ యుద్ధ విమానం దుబాయి ఎయిర్ షోలో కూలిపోవడం దురదృష్టకరమని కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అన్నారు. పూర్తి స్థాయి దర్యాప్తు జరిగే వరకూ దీనిపై ఏమీ మాట్లాడలేమని పేర్కొన్నారు.

11

రాజకీయం

ఉప ఎన్నికలు వస్తే కచ్చితంగా పోటీ చేస్తా

- స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్యే కడియం
- మంత్రి శ్రీధర్ బాబును కలిసిన దానం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 22 : ఉప ఎన్నికలే వస్తే కచ్చితంగా మళ్లీ పోటీ చేస్తానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. అనర్హత పిటిషన్ పై ఈ నెల 23లోపు కలవాలని స్పీకర్ నోటీసు ఇచ్చారని తెలిపారు. నోటీసులపై వివరణకు మరింత సమయం కావాలని కోరానన్నారు. స్పీకర్ సానుకూలంగా స్పందించారన్నారు. స్పీకర్ నిర్ణయానికి కట్టుబడి ఉంటామన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌తో కలిసి పని చేస్తున్నామని వివరణ ఇచ్చారు. నియోజకవర్గానికి పెద్ద ఎత్తున అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికిప్పుడు రాజీనామా చేసి ఎన్నికలకు వెళ్లాలనేది మీడియాలో వస్తున్న ప్రచారం మాత్రమేనని, తాను ఎక్కడ కూడా మీడియాకు రాజీనామా చేస్తున్నానని చెప్పలేదని వివరించారు. నా నిర్ణయం నియోజకవర్గం ప్రజలు, కార్యకర్తలకు లోబడి ఉంటుందన్నారు. వ్యక్తిగతంగా ఎలాంటి నిర్ణయం తీసుకోనని కడియం తెలిపారు.

మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన దానం

ఎమ్మెల్యే దానం నాగేందర్ మంత్రి శ్రీధర్‌బాబును కలిశారు. అనర్హత నోటీసుకు సమాధానం కోసం మరికొంత సమయాన్ని దానం కోరనున్నట్లు సమాచారం. ఇప్పటికే ఏఐసీసీ పెద్దలతో దానం సంప్రదింపులు జరిపారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా రాజీనామా, ఇతర అంశాలపై ఏఐసీసీ పెద్దలతో చర్చించారు. తాను రాజీనామా చేస్తే తిరిగి తనకే సీటు ఇవ్వాలని ఏఐసీసీని దానం నాగేందర్ కోరారు. అనర్హత వేటు వేసేందుకు అవకాశం ఉంటే రాజీనామా చేస్తానని సన్నిహితులకు ఆయన చెప్పారు.

విద్యా వ్యవస్థలో సమూల 'మార్పులు'

- టెక్నాలజీస్ లో 'అగ్రగామి'గా తెలంగాణ
- 'జేఎన్టీయూహెచ్ అల్యూమిన్ మీట్' లో మంత్రి శ్రీధర్ బాబు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 22 : విద్యా వ్యవస్థలో సమూల మార్పు తేవాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా తెలంగాణ యువతను అత్యుత్తమ నైపుణ్యమున్న మానవ వనరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్, అప్‌స్కిల్లింగ్‌పై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. కూకట్ పల్లి జేఎన్టీయూ హెచ్ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన 'జేఎన్టీయూహెచ్ గ్లోబల్ అల్యూమ్ని మీట్ 2025'లో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యమిస్తోందని వివరించారు. క్వాంటం కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఏఐ తదితర కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ లో తెలంగాణను అగ్రగామిగా నిలిపేలా 'ఎకో సిస్టం'ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. 'ఏఐ'లో బెంచ్ మార్క్ ను సెట్ చేసేలా అంతర్జాతీయ నిపుణుల భాగస్వామ్యంతో 'తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్' అందుబాటులోకి తెస్తున్నామన్నారు. మనం జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా మూలాలను మరిచిపోవద్దని, సమాజానికి తిరిగి ఇవ్వడం కృతజ్ఞతతో కూడిన బాధ్యత అని అన్నారు. మనం మన విధులను సక్రమంగా నిర్వర్తించినప్పుడే ప్రశ్నించే అవకాశాన్ని పొందగలమన్నారు. కార్యక్రమంలో తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టా రెడ్డి, జేఎన్టీయూహెచ్ వీసీ ప్రొఫెసర్ టి.కిషన్ కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వెంకటేశ్వర రావు, రెక్టార్ డా.కె.విజయ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల రిజర్వేషన్లపై జీఓ విడుదల

- బీసీలకు 23 శాతం రిజర్వేషన్లు ఖరారు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 22 : తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలరిజర్వేషన్లపై జరుగుతున్న చర్చకు రేవంత్ సర్కార్ తెర దింపింది. తాజాగా ఇందుకు సంబంధించిన జీవోను విడుదల చేసింది. సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లు ఖరారు చేసింది. ఈ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతం మించకుండా మార్గదర్శకాలు జారీ చేసింది. రిజర్వేషన్ల ఖరారు కోసం పంచాయతీ రాజ్ శాఖ జీవో విడుదల చేసింది. పంచాయతీరాజ్ జీవో ప్రకారం రిజర్వేషన్లను జిల్లా కలెక్టర్లు ఖరారు చేయనున్నారు. 50శాతం రిజర్వేషన్లు దాటకుండా ఎస్సీ , ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకుంది. తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన ఈ జీవో ప్రకారం బీసీలకు సర్పంచ్, వార్డు స్థానాల్లో 23 శాతం రిజర్వేషన్లు దక్కనున్నాయి.

నవజాత శిశువుల సంరక్షణ చాలా ముఖ్యం

- డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ డా. వి విజయలక్ష్మి, డాక్టర్ విష్ణువర్ధన్

ప్రతిపక్షం, షాద్ నగర్, నవంబర్ 22: జాతీయ నవజాత శిశువుల సంరక్షణ వారం చివరి రోజున రంగారెడ్డి జిల్లా డీఎం అండ్ హెచ్ఓ కె. లలితాదేవి ఆదేశానుసారం, షాద్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో డా. విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ డా. వి విజయలక్ష్మి నవజాత శిశువుల సంరక్షణ గురించి తెలియజేశారు. వెచ్చదనం అందించడం, పొడిగా ఉంచడం, సున్నిత స్పర్శ ఇవ్వడం సరైన నిద్ర పద్ధతులను అనుసరించడం, శిశువును శుభ్రంగా ఉంచడం వంటి ముఖ్యమైన జాగ్రత్తలు వివరించారు. తల్లితండ్రులు తమ బిడ్డతో బంధాన్ని ఏర్పరుచుకోవడానికి, శిశువుకు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు సహాయపడడానికి సరైన సంరక్షణ అవసరమని తెలియజేశారు. శిశువులను ఈ చలికాలంలో వెచ్చగా ఉంచాలని, సరైన దుస్తులు ధరింప చేయాలని చెప్పారు. శిశువును సున్నితంగా నిమరడం లేదా కంగారు కేర్ (చర్మంతో చర్మాని అంటి పెట్టుకొని పెట్టుకోవడం) వంటి పద్ధతులు శిశువును ప్రశాంతంగా ఉంచడానికి, వారి హృదయ స్పందన నియంతించడానికి సహాయపడుతారని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో షాద్నగర్ ఆసుపత్రి సూపరిండెంట్ విష్ణువర్ధన్, సివిల్ సర్జన్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ విజయలక్ష్మి, డిప్యూటీ డీఎం అండ్ హెచ్ ఓ, డాక్టర్ ఎం విజయకుమార్, డాక్టర్ సెమినా నస్రిన్, డాక్టర్ ఆంజనేయులు మరియు ఆస్పత్రి సిబ్బంది స్టాఫ్ నర్సులు మొదలగున్నవారు పాల్గొన్నారు.

ఐ బొమ్మ రవి కేసులో కీలక పరిణామం

- విచారణలో ఎంట్రీ ఇచ్చిన తెలంగాణ సీఐడీ



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 22 : ఐ బొమ్మ రవి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులోకి తెలంగాణ సీఐడీ అధికారులు ఎంట్రీ ఇచ్చారు. ఐబొమ్మ రవి వివరాలను సేకరించే పనిలో పడ్డారు. ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ వైబ్‌సైట్లను ఐబొమ్మలో రవి ప్రమోట్ చేశాడు. అతనికి సంబంధించిన మరిన్ని వివరాలు తమకు కావాలని సైబర్ క్రైమ్ పోలీసులను సీఐడీ అధికారులు కోరారు. బెట్టింగ్ ప్రమోషన్ కేసులను కూడా సీఐడీ అధికారులు దర్యాప్తు చేస్తున్న సంగతి తెలిసిందే. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు రవిని గత రెండు రోజులుగా కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. రెండో రోజు కస్టడీలో భాగంగా ఆరు గంటలకు పైగా విచారించారు. ఈ విచారణలో కీలక అంశాలు రాబట్టినట్లు తెలుస్తోంది. శనివారం మూడో రోజు కూడా రవిని విచారించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఐబొమ్మ రవికి సినిమాలు సరఫరా చేస్తున్న, సహకరిస్తున్న వారి వివరాలను సేకరిస్తున్నారు. ఏజెంట్లు, గేమింగ్ యాప్‌ల నిర్వాహకులతో రవికి ఉన్న లింకులపై ఆరా తీస్తున్నారు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు. అయితే ఈ కేసులోకి ఇప్పుడు తెలంగాణ సీఐడీ అధికారులు ప్రవేశించడంతో మరింత సమగ్రంగా విచారించే అవకాశాలు ఉన్నాయి.



డిసెంబర్ నెలాఖరుకు రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లు దర్శనమివ్వాలి. మంత్రి, స్పెషల్ సీఎస్ రోడ్ల అభివృద్ధి, మరమ్మతులను ప్రత్యక్షంగా తనిఖీ చేయాలి. పనులు చేపట్టని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి. ఏడాదిలోనే రూ.2500 కోట్లతో 5,471కిలోమీటర్ల రోడ్ల అభివృద్ధికి అనుమతులిచ్చాం.

- టెలీకాన్ఫరెన్స్‌లో ఏపీ సీఎం చంద్రబాబు

పెన్నుల మీద మట్టిగప్పుతారా!

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ గీతం స్ఫూర్తి నింపిన కవులు, రచయితలను కించపరిచే విధంగా నాటి పాలకులు చర్యలు ఉన్నాయని సీఎం రేవంత్ ఆక్షేపించారు.

తెలంగాణ ప్రజల ఆకాంక్షల కోసం

తెలంగాణ ప్రజల ఆకాంక్షల కోసం 'జయ జయ హే తెలంగాణ' పాటను ప్రభుత్వం గుర్తించిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన రావాలని అందెశ్రీ, గద్దర్ అన్నలాంటి వాళ్లు కోరుకున్నారన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వారి కుటుంబాలకు అండగా నిలవాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరం తొమ్మిది మంది ఉద్యమ కారులను గుర్తించామని, అంతేకాకుండా రాబోయే రోజులలో ఫ్యూచర్ సిటీలో వారి కుటుంబానికి ఇళ్లను నిర్మించి అండగా నిలుస్తామని అన్నారు. ఎన్నో పోరాటాలు చేసిన చరిత్ర తెలంగాణ ఉద్యమ కారులదని సీఎం కొనియాడారు. దేశంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన చరిత్ర తెలంగాణ రాష్ట్రానిదని సీఎం తెలిపారు. వర్గీకరణ అమలుతో దళితులలో అత్యంత వెనుకబడిన వాళ్లు డాక్టర్లు అవుతున్నారని తెలిపారు. మంత్రి వర్గంలో నలుగురు దళితులు మంత్రులుగా ఉన్నారని తెలిపారు. మంత్రివర్గంలో దళితులకు పెద్ద పీట వేయడం రాహుల్ గాంధీ ఆకాంక్షల మేరకే అన్నారు. అందెశ్రీ కుటుంబాన్ని ఆదుకోవడం తన బాధ్యత అన్నారు. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించామని, అందెశ్రీ స్మృతి వనాన్ని నిర్మిస్తున్నామని ప్రకటించారు. ఆయన పుస్తకం 'నిప్పుల వాగు' ప్రతి గ్రంథాలయంలో ఉండేలా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన తొమ్మిది మంది కవులకు 300 గజాల ఇంటిస్థలం ఇచ్చామని, భారత్ ఫ్యూచర్ సిటీలో వారికి ఇంటిని నిర్మించి ఇస్తామని సీఎం తెలిపారు

అందెశ్రీ కోహినూర్ వజ్రం

'ఎన్ని వజ్రాలు ఉన్నా కోహినూర్ వజ్రానిదే అసలైన గొప్పతనం. కళాకారులు ఎంతమంది ఉన్నా అందె శ్రీ అన్న కోహినూర్ వజ్రంలా నిలుస్తాడు' అని సీఎం రేవంత్ అన్నారు. అందెశ్రీ తనకు అత్యంత అప్తుడని, మనసుకు దగ్గరివాడని అన్నారు. రాచరికం, ఆధిపత్యం హద్దు మీరినప్పుడు కవులు, కళాకారులు గొంగడి దుమ్ము దులిపి పోరాటంలోకి దూకారని వివరించారు. నిజాంకు వ్యతిరేకంగా బండి యాదగిరి 'బండెనక బండి కట్టి' అని గళం విప్పితే సర్కార్ పీఠం కదిలిందన్నారు. నాడు సమైక్యవాదులకు వ్యతిరేకంగా గద్దర్, ,గూడా అంజన్న, అందెశ్రీ, గోరేటి వెంకన్న తెలంగాణ విముక్తి కోసం మలిదశ ఉద్యమానికి పునాదులు వేశారన్నారు. సంస్మరణ సభలో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహా, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, అందెశ్రీ కుటుంబ సభ్యులు, కవులు, కళాకారులు, అందెశ్రీ అభిమానులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

గ్లోబల్ సమ్మిట్ కు భారీ ఏర్పాట్లు

మొదటిపేజీ తరువాయి

ఏర్పాట్లపై శనివారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి సీఎంఓ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సీఎస్ రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రితో పాటు సీఎంఓ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయినందున, రెండేండ్ల విజయోత్సవాలను ప్రతిబింబించేలా ఫ్యూచర్ సిటీలో విశాలమైన ప్రాంగణంలో భారీ వేదిక ఏర్పాటు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 8వ తేదీ, తొలి రోజున ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల విజయాన్ని చాటి చెప్పాలన్నారు. పండుగ వాతావరణాన్ని తలపించేలా ఏర్పాట్లు జరగాలన్నారు. 9వ తేదీన రెండో రోజున తెలంగాణ భవిష్యత్తు దార్శనికతను, భవిష్యత్తు ప్రణాళికలను పొందుపరిచిన తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్ను ఆవిష్కరించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

గ్లోబల్ సిటీగా హైదరాబాద్

మొదటిపేజీ తరువాయి

తయారు చేస్తారు, ఇందులో నివసించడానికి, తిరగడానికి, పని చేయడానికి ఏ నగరం ఉత్తమమో చూస్తారు. ఈ నివేదికను రెజోనెన్స్ కన్సల్టెన్సీ అండ్ ఇప్సోస్ తయారు చేసింది. ఇందులో 10 లక్షలకుపైగా జనాభా కలిగిన 270 కంటే ఎక్కువ నగరాలను మూల్యాంకనం చేస్తారు. దీని తరువాత, ప్లేస్ పవర్ స్కోర్ ఆధారంగా, ప్రపంచంలోని అత్యుత్తమ నగరం ఏంటో తెలుస్తుంది. ఒక నగరాన్ని మంచిది లేదా అత్యుత్తమమైనదిగా ప్రకటించడానికి, దానిని అనేక విధాలుగా పరీక్షిస్తారు. ఈ పాయింట్లలో నగర జీవనశైలి, భద్రత, ఉపాధి అవకాశాలు, విద్య, సంస్కృతి, ఆర్థిక బలం, పర్యావరణం వంటివి ఉన్నాయి. ఈ అన్ని అంశాలను కలిపి ఏ నగరం ఇతరులకన్నా ముందుందో నిర్ణయిస్తారు. ఈ పాయింట్లలో, నగరాన్ని జీవించే సామర్థ్యం ఆధారంగా కూడా చూస్తారు. ఈ పారామీటర్‌లో, నగరం రోజువారీ సౌకర్యాలు, పరిశుభ్రత, ట్రాఫిక్, ఆరోగ్య సేవలు, జీవనశైలి ఖర్చు, మౌలిక సదుపాయాలను కూడా చూస్తారు. ఏదైనా నగరం ఈ అన్ని విషయాల్లో మెరుగ్గా ఉంటే, దాని జీవనయోగ్యత స్కోరు కూడా ఎక్కువగా ఉంటుంది. విద్య స్థాయి, స్టార్టప్‌లు, సంస్కృతి, సాంకేతికత, ఆదాయ మార్గాలు అన్నీ దాని శ్రేయస్సులో భాగం. ఆర్థిక అవకాశాలు ఎక్కువగా ఉన్న నగరాలు ప్రపంచవ్యాప్తంగా మరింత ఆకర్షణీయంగా పరిగణిస్తారు. ఇటీవల విడుదలైన ఈ నివేదికలో లండన్ వరుసగా 11 సార్లు ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా నిలిచింది. దీని తరువాత న్యూయార్క్, పారిస్, టోక్యో, మాడ్రిడ్, సింగపూర్, రోమ్, దుబాయ్ వంటి నగరాలు టాప్ 10లో ఉన్నాయి.

37 మంది మావోయిస్టుల లొంగుబాటు

మొదటిపేజీ తరువాయి

అప్పగించారని చెప్పారు. లొంగిపోయిన 37మంది మావోయిస్టులలో ఎక్కువగా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారే ఉన్నారని తెలిపారు. పార్టీ పరమైన విభేదాలు, భద్రతాపరమైన సమస్యలు, అనారోగ్య కారణాల వల్ల మావోయిస్టులు లొంగిపోయినట్లు పేర్కొన్నారు. ఖమ్మం డివిజనల్ కమిటీకి చెందిన ఏడు మంది వారితోపాటు ఆయుధాలను అప్పగించారని డీజీపీ వెల్లడించారు.

పునరావాస ప్యాకేజీ అందిస్తాం

కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్‌పై రూ.20 లక్షల రివార్డు, అప్పాస్ నారాయణపై రూ.20 లక్షల రివార్డు, లొంగిపోయిన అందరిపై కలిపి రూ.1.41 కోట్ల రివార్డు ఉందని, అది వారికే అందజేస్తామని డీజీపీ తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారికి ప్రభుత్వం ఇస్తున్న పునరావాస ప్యాకేజీ అందిస్తామని ఆయన పేర్కొన్నారు. తెలంగాణకు చెందిన 59 మంది మావోయిస్టులు ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని, వారిలో ఐదుగురు కేంద్ర కమిటీ సభ్యులు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, మల్లరాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, పాక హనుమంతు అలియాస్ గణేశ్, బడె చొక్కారావు అలియాస్ దామోదర్ ఉన్నట్లు డీజీపీ తెలిపారు. అజ్ఞాతంలో ఉన్నవారు ఎంత త్వరగా బయటకు వస్తే అంత మంచిదన్నారు. ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు, రాజకీయ నాయకులు, మీడియా ఇలా ఎవరి ద్వారా అయినా మావోయిస్టులు బయటికి రావచ్చని తెలిపారు. మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలని సీఎం రేవంత్ రెడ్డి కూడా పిలుపునిచ్చారని డీజీపీ గుర్తు చేశారు.

పూర్తి భద్రత కల్పిస్తాం

పోలీసుల ముందుకు వచ్చిన వారికి పూర్తి భద్రత ఉంటుందని, లొంగిపోయిన వారికి ఎలాంటి వేధింపులు ఉండవని డీజీపీ హామీ ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. మావోయిస్టు పార్టీని దేవ్‌జీ లీడ్ చేస్తున్నారని చెప్పేందుకు కచ్చితమైన సమాచారం లేదని, దేవ్‌జీ, గణపతి కూడా లొంగిపోయేందుకు వస్తే సంతోషిస్తామన్నారు. హిడ్మా లొంగిపోయిన తర్వాత పోలీసులు కాల్చి చంపేశారనేది వాస్తవం కాదని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. . గడిచిన 11 నెలల్లో 465 మంది మావోయిస్టులు రాష్ట్ర ప్రభుత్వం ఎదుట లొంగిపోయారని తెలిపారు. మావోయిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి ఎవరనేది తమకు ఇంకా తెలియదని కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్ చెప్పారు. పార్టీకి చెప్పిన తర్వాతే లొంగిపోయామని, మిగతా వారు కూడా లొంగిపోవాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

'ఆకాంక్ష'కు సిద్దిపేట సారథ్యం

మొదటిపేజీ తరువాయి

బలంగా నిలబెట్టాయి. సిద్దిపేట జిల్లా రాజకీయ సామాజిక సమీకరణాలను పరిశీలించాకే, పార్టీ అధిష్టానం ఆంక్షారెడ్డి వైపు మొగ్గు చూపిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో తూంకుంట కుటుంబానికి, ముఖ్యంగా డీసీసీ మాజీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డికి ఇది పెద్ద గౌరవంగా భావిస్తున్నారు.

మైనంపల్లి ప్రభావాన్ని పూర్తిగా తగ్గించే చర్యలు

ఈ నియామకం మరో కారణంతోనూ సంచలనంగా మారింది. అదే జిల్లాలో బలంగా ఉన్నట్టు చెప్పుకునే మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకు ఈ నిర్ణయం స్పష్టమైన చెక్ అని కాంగ్రెస్ సీనియర్ నేతలు అభిప్రాయపడుతున్నారు. నిన్న మొన్నటి వరకు 'నేనే పార్టీ, నేను చెప్పిందే తుదిపరిణామం' అన్నట్టుగా వ్యవహరించిన మైనంపల్లి ఇటీవల మల్కాజిగిరిలో ఓడిపోయినప్పటికీ, సిద్దిపేట జిల్లాలో ముఖ్యమంత్రి దూతగా తిరుగుతూ గ్రూపు రాజకీయాలకు ఊతమిచ్చాడన్న విమర్శలు వచ్చాయి. జిల్లా కాంగ్రెస్‌ను రెండుగా చీల్చేంతవరకు పరిస్థితి వెళ్లిన నేపథ్యంలో హైకమాండ్ ఈ నియామకంతో మైనంపల్లి ప్రభావాన్ని పూర్తిగా తగ్గించే చర్యలు చేపట్టిందనే అభిప్రాయం పార్టీ లోపల బలంగా వినిపిస్తోంది. డీసీసీ మాజీ అధ్యక్షుడు నర్సారెడ్డిపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల వెనుక కూడా మైనంపల్లి వర్గం పరోక్ష ప్రమేయం ఉందన్న ఆరోపణలను కాంగ్రెస్ వర్గాలు ఎన్నాళ్లుగానో చేస్తున్నాయి. పార్టీ కోసం సర్వస్వం ధారబోసిన నర్సారెడ్డిని రాజకీయంగా బలహీనపరచాలన్న ఉద్దేశంతోనే మైనంపల్లి జిల్లాలో రకరకాల గ్రూపులను పెంచాడన్నది కాంగ్రెస్ వర్గాల్లో బహిరంగ రహస్యం. ఇలాంటి పరిస్థితుల్లో నర్సారెడ్డి కూతురు ఆంక్షారెడ్డి డీసీసీ పీఠంపై కూర్చోడం నర్సారెడ్డి శిబిరానికి రాజకీయంగా పెద్ద ఊపిరి అందించినట్లైంది. శనివారం తూంకుంట శిబిరంలో సంబురాలు అంబరాన్ని మిన్నంటడం దీనికి నిదర్శనం.

'మైనంపల్లి'కి ఇక బ్రేక్

ఇక ఆంక్షారెడ్డి బాధ్యతలు చేపట్టడంతో జిల్లాలో విస్తృత మార్పులు చోటుచేసుకోనున్నాయని పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. గత కొంతకాలంగా జిల్లాలో కాంగ్రెస్ పార్టీని భ్రష్టుపట్టించిన మైనంపల్లి ప్రవర్తనకు ఇక బ్రేక్ పడనుందన్న నమ్మకం కార్యకర్తలు, నేతలు వ్యక్తపరుస్తున్నారు. ఇప్పటికైనా మైనంపల్లిని జిల్లాకు రాకుండా కట్టడి చేయాలని అనేక మంది నేతలు పార్టీ అధిష్టానంతో సంప్రదింపులు జరుపుతున్నారని సమాచారం. సిద్దిపేటలో ఆంక్షారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు కావడం జిల్లా కాంగ్రెస్ రాజకీయాల్లో 'గేమ్‌చేంజర్' నిర్ణయమనే అభిప్రాయం బలపడుతోంది. ఆంక్షారెడ్డి నియామకంతో నర్సారెడ్డి బలమైన శక్తిగా మైదానంలోకి వస్తున్నారు. ఇక జిల్లాలో పార్టీ క్రమశిక్షణ, ఐక్యత, గజ్వేల్‌లో కోల్పోయిన బలం పునరుద్ధరణపై ఆమె దృష్టి నిలవనుందని నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇక ఆంక్షారెడ్డి నాయకత్వంలో జిల్లాలో కాంగ్రెస్ ఏలా మలుపుతిరుగుతుందో వేచి చూడాల్సిందే.

మహిళలకే 'బస్సు స్టీరింగ్'

మొదటిపేజీ తరువాయి

శ్రీకారం చుట్టబోతోంది. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి అవుతుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలకు ఈ వరాన్ని అందిస్తున్నారు. వచ్చిన మొదటి రోజే రెండు పథకాలను ప్రారంభించారు. అందులో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతోపాటు ఇప్పుడు వారిని మరింత ఆర్థిక స్థిరత్వం దిశగా తీర్చిదిద్దాలని భావిస్తోంది. అందుకే వారితో బస్‌లు కొనుగోలు చేపించి ఆర్టీసీకి అద్దెకు ఇచ్చేలా కొత్త ఆలోచన చేస్తోంది.

మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు

మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఇందిరా మహిళా శక్తి పథకం పలు కార్యక్రమాలు చేపడుతోంది. స్వయం సహాయక సంఘాలకు విరివిగా రుణాలను అందిస్తోంది. క్రమశిక్షణకు, నమ్మకానికి ప్రతీకలుగా నిలిచిన మహిళా సంఘాలకు ఒకపక్క రుణాలను అందిస్తూ వారి ఆర్థిక స్వావలంబన కోసం పెట్రోల్ బంకులు, సోలార్ పవర్ యూనిట్ల ఏర్పాటు చేయిస్తోంది. మండల మహిళా సమాఖ్యల ఆదాయం పెంపు కోసం ఎస్ ఈ ఆర్ పీ ద్వారా దేశంలోనే మొదటిసారిగా 600 బస్సులు కొనుగోలు చేయాలని ఇప్పుడు ఆలోచన చేస్తోంది. వాటిని టీజీ ఎస్ ఆర్ టీ సి' కి అద్దెకి ఇచ్చేలా పథకాన్ని రూపొందిస్తున్నారు. మహిళా సంఘాలు తీసుకునే రుణాలకు ప్రభుత్వం గ్యారెంటీని అందించనుంది. ఈ పథకం అమలుకు టీజీ ఎస్ ఆర్ టీ సి' సెర్ప్ మధ్య ఒప్పందం కుదిరింది. దేశంలో ఎక్కడాలేని విధంగా ప్రజారవాణాలో స్వయం సహాయక సంఘాలు కీలకపాత్ర పోషించేందుకు అవకాశం దక్కుతోంది. మొదటి దశలో సెర్ప్ ఐడెంటిఫై చేసిన 17 జిల్లాలలోని 151 మండల మహిళా సమాఖ్యలను ఒక్కొక్కటి చొప్పున 151 బస్సులు కొనుగోలుకు ఆర్థిక సహాయం అందిస్తారు. రెండో దశలో 449 బస్సులను కొనుగోలు చేస్తారు. ఒక్కొక్క బస్సుకు 36 లక్షల వ్యయం కాగా అందులో 6లక్షలను మండల మహిళా సమాఖ్య తన సొంత నిధులను ఖర్చు చేస్తుంది. మిగతా 30 లక్షలను కమ్యూనిటీ ఇన్వెస్ట్మెంట్ ఫండ్‌గా అందించారు. టీజీ ఎస్ ఆర్ టీ సి' ప్రతి బస్సుకు నెలకు రూ.69,648 అద్దెని చెల్లిస్తుంది. ఇందులో రూ.19,648 ఆపరేషన్ ఎక్స్పెండీచర్‌గా ఖర్చు చేసుకొంటున్నారు. మిగతా 50 వేలను రుణ వాయిదాగా చెల్లిస్తుంది. ఇప్పటివరకు టీజీఎస్ఆర్టీసి అయిదు వాయిదాలు విడుదల చేసింది.

మహిళా సంఘాల లాభాలు బాట

మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించారు. దీని వల్ల మహిళా సంఘాలు లాభాలు బాటపడుతున్నాయి. ఇప్పటివరకు 151 మహిళా సమాఖ్యలకు అయిదు కోట్లకు పైగా నిధులను విడుదల చేసింది. మహాలక్ష్మి పథకం ద్వారా బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికుల సంఖ్య పెరిగింది. టీజీఎస్ఆర్టీసికి మహిళా సంఘాలు బస్సులను అద్దెకిచ్చే పథకంతో గ్రామీణ ప్రాంతాలకు మరిన్ని బస్సులు అందుబాటులోకి వచ్చాయి. గతంలో ప్రైవేటు వ్యక్తుల బస్సులను ఆర్టీసీ అద్దెకు తీసుకొనేవాళ్లు. నేడు మహిళా సంఘాలు వాటిని అందజేస్తున్నాయి. ఈ పథకం మహిళా సాధికారతకు, సామాజిక భద్రతకు అండగా నిలుస్తుంది. వారికి స్థిరమైన ఆదాయం కూడా లభించనుంది.

ఈ ప్రభుత్వం ప్రజలకే అంకితం

- పైసా పైసా కూడగట్టి అభివృద్ధి చేస్తున్నాం
- దోపిడీదారులను, దళారులను దగ్గరకు రానివ్వం
- వైరా బహిరంగ సభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ప్రతిపక్షం ప్రతినిధి, ఖమ్మం, నవంబర్ 22: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పైసా పైసా పోగు వేసి మరీ, ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్నదని, దోపిడీదారులు, దళారులను దగ్గరకు రానివ్వబోమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం ఆయన వైరా నియోజకవర్గంలో రూ 400 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులకు భూమి పూజ చేసారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడారు. 2047 కల్లా తెలంగాణ రాష్ట్రం ప్రపంచంతో పోటీ పడే స్థాయికి వెళ్లనుందని అన్నారు. ప్రతి నియోజకవర్గంలో కనీసం ఒక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూలు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగానే వైరాలోనూ 20 ఎకరాలలో 200 కోట్లతో స్కూల్ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఈ స్కూలులో విద్యాబోధన చేసే ఉపాధ్యాయులు కూడా అందులోని నివాసం ఉండేలా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పదేండ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన ఆనాటి బీఆర్ఎస్ హయాంలో విద్యార్థులు డైట్, కాస్మొటిక్ చార్జీలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, సరైన పోషకాహారం కూడా అందలేదని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో పెరిగిన ధరల కనుగుణంగా లెక్కలు కట్టి 40 శాతం డైట్ చార్జీలను పెంచామన్నారు. కోటి మంది మహిళలకు ఆత్మగౌరవంతో ఉండేలా నాణ్యమైన చీరలను అందించడానికి ఈ శనివారం నుంచి శ్రీకారం చుట్టామన్నారు.

తెలంగాణ డీసీసీలకు కొత్త సారథులు

- 33 జిల్లాలకు డీసీసీ అధ్యక్షులనునియామాకం
- మూడు కార్పొరేషన్లకు కూడా ప్రత్యేక నియామకం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 22 : తెలంగాణ డీసీసీ లకు కొత్త అధ్యక్షులను ఏఐసీసీ ప్రకటించింది. 33 జిల్లాలకు డీసీసీ అధ్యక్షులను నియమించి వారి పేర్లను విడుదల చేసింది. మూడు కార్పొరేషన్లకు(కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్)లకు డీసీసీ అధ్యక్షులను నియమించి వారి పేర్లను విడుదల చేసింది. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పరిధిలోని జిల్లాల కాంగ్రెస్ కమిటీలకు నూతన అధ్యక్షులను నియమించారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడి ఆమోదం మేరకు ఈ నియామకాలు తక్షణమే అమలులోకి వస్తాయని తెలిపారు.

ఆదిలాబాద్	డాక్టర్ నరేష్ జాదవ్
కొమురంభీమ్ ఆసిఫాబాద్	ఆత్రం సుగుణ
భద్రాద్రి కొత్తగూడెం	దేవి ప్రసన్న
యాదాద్రి భువనగిరి	బీర్ల ఐలయ్య
జోగులాంబ గద్వాల	రాజీవ్ రెడ్డి
హన్మకొండ	ఇనిగాల వెంకట్రామి రెడ్డి
హైదరాబాద్	సయ్యద్ ఖలీద్ సహిపుల్లా
జగిత్యాల	నందయ్య
జనగాం	ధన్వంతి
జయశంకర్ భూపాలపల్లి -	కరుణాకర్
కామారెడ్డి	మల్లికార్జున ఆలె
కరీంనగర్	మేడిపల్లి సత్యం
కరీంనగర్ కార్పొరేషన్	అంజన్ కుమార్
ఖైరతాబాద్	మోహిత్
ఖమ్మం	నూతి సత్యనారాయణ
ఖమ్మం కార్పొరేషన్	దీపక్ చౌదరి
మహబూబాబాద్	భూక్య ఉమ
మహబూబ్ నగర్	సంజీవ్ ముదిరాజ్
మంచిర్యాల	రఘునాథ్ రెడ్డి
మెదక్	అనజనేయులు గౌడ్
మేడ్చల్ మల్కాజిగిరి	వజ్రేష్ యాదవ్
ములుగు	పైదకుల అశోక్
నాగర్ కర్నూల్	చిక్కుడు వంశీ కృష్ణ
నారాయణపేట	ప్రశాంత్ రెడ్డి
నిర్మల్	బొజ్జు
నిజామాబాద్	నాగేష్ రెడ్డి
నిజామాబాద్ కార్పొరేషన్	బొబ్బిలి రామకృష్ణ
పెద్దపల్లి	రాజ్ ఠాకూర్
రాజన్న సిరిసిల్లా	సంగీతం శ్రీనివాస్
సికింద్రాబాద్	దీపక్ జాన్
సిద్ధిపేట	తూంకుంట ఆకాంక్ష రెడ్డి
సూర్యాపేట	గుడిపాటి నర్సయ్య
వికారాబాద్	దారా సింగ్ జాదవ్
వనపర్తి	శివసేన రెడ్డి
వరంగల్	అయూబ్

ఐదుగురు ఎమ్మెల్యేలను జిల్లా అధ్యక్షులుగా ఏఐసీసీ ప్రకటించింది.

హనుమాన్ దేవాలయంలో అయ్యప్ప స్వాములకు బిక్ష

- పాల్గొన్న గురుస్వామి గిరీషన్ నాయర్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ప్రతిపక్షం, షాద్ నగర్, నవంబర్ 22: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని చౌడమ్మ గుట్ట ఆంజనేయ స్వామి దేవాలయం ఆవరణలలో అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. మొదటి రోజు వీర్ల పల్లి గ్రామనికి చెందిన శివకుమార్ అన్నదానం చేశారు. ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు,ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి యేటా దాతలు ముందుకు వచ్చి అయ్యప్పలకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. అంతకుముందు ఆంజనేయ స్వామి దేవాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో నిర్వాహకులు వన్నాడా ప్రకాష్ గౌడ్, గునెల్లి రమేష్ స్వామి, శ్రీశైలం గౌడ్, సికేర రమేష్ స్వామి, బాల్ రెడ్డి స్వామి, రాయికల్ శ్రీనివాస్, వినోద్ స్వామి, ప్యాటా విశ్వేష్ స్వామి, అక్షిత్ స్వామి, రోహిత్ గౌడ్, సింగపాగ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

- సహకరించాలని ప్రొఫెసర్ కోదండరాంకు వినతి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 22 : తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పి. వెంకట్ రాంరెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల సమన్వయ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాంని శనివారం కలిశారు. ఉద్యమకారులకు ప్రభుత్వమిచ్చిన హామీలను అమలు కావడం లేదని ఆయన దృష్టికి తెచ్చారు. ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి కావొస్తుందన్నారు. గ్రామీణ స్థాయిలో ఎందరో ఉద్యమకారులు చాలా ఇబ్బందిలో ఉన్నారని ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు పరచడానికి సహకరించాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో తెలంగాణ తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు విద్యా సాగర్ విద్యావంతుల వేదిక రాష్ట్ర కోశాధికారి టీజీ శ్రీనివాస్, కళ్లెం నరసింహారెడ్డి, ఆంజనేయులు ఆనంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఇండస్ట్రియల్ ల్యాండ్ పాలసీ' భారీ భూ దోపిడీ

- ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 22: 'ఇండస్ట్రియల్ ల్యాండ్ పాలసీ కాదని, భారీ భూముల లూటీ స్కాం' అని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో శనివారం నాడు జరిగిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడారు. తాను రెవెన్యూ రిసోర్స్ మొబిలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్‌గా పని చేసినపుడు వచ్చిన ప్రతిపాదనలను ఉదాహరణగా చూపించారు. ఈ పాలసీని రేవంత్ రెడ్డి ప్రభుత్వం అత్యంత వేగంగా, అనుమానాస్పద పద్ధతిలో అమలు చేస్తున్నదని విమర్శించారు. దాదాపు పది వేల ఎకరాల విలువైన భూములను పప్పుల ధరకు కట్టబెట్టే కుట్ర జరుగుతోందని అన్నారు. మార్కెట్ విలువ ప్రకారం ఈ 9,292 ఎకరాల భూమి విలువ సుమారు ఐదు లక్షల కోట్లున్నా, ప్రభుత్వం మాత్రం ఎస్ఆర్ఓ విలువలో 30 శాతం చెల్లింపుతో ఈ భూములను మార్పిడి చేసేందుకు అవకాశం ఇస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం జరుగుతుందని అన్నారు. ఐదు లక్షల కోట్లు విలువైన భూమిని ఐదు వేల కోట్లకే కట్టబెడితే, మిగతా 4 లక్షల 95 వేల కోట్లు ఎక్కడికి వెళ్తాయని ప్రశ్నించారు. మంత్రి శ్రీధర్ బాబు వివరణలోనూ తప్పులున్నాయని, అసలు భూమి పరిమాణాన్ని సగానికి సగం తగ్గించి చూపే ప్రయత్నం జరిగిందని హరీశ్ రావు అన్నారు. నిజంగా భూమి 4,740 ఎకరాలేనా? బహిరంగ చర్చకు సిద్ధమా?" అని ఆయన సవాల్ చేశారు.

గురువులు భావితరాల నిర్మాతలు

- విద్యా సదస్సులో డా. అట్ల శ్రీనివాస్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 22 : గచ్చిబౌలి శాంతి సరోవర్‌లో శనివారం బ్రహ్మకుమారిస్ విద్యా విభాగం 'గురువులు భవిష్యత్ తరాల నిర్మాతలు' అనే అంశం నిర్వహించిన విద్యా సదస్సులో ప్రముఖ సైకాలజిస్ట్ డా. అట్ల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల మానసిక శ్రేయస్సు, కౌన్సిలింగ్ సేవల ప్రాముఖ్యత, పాఠశాలలలోభావోద్వేగ సాధికారత వంటి అంశాలపై విద్యావ్యవస్థలో విలువలు, మానసిక ఆరోగ్యం, మారుతున్న విద్యా పద్ధతులు, ఆధునిక సాంకేతిక యుగంలో ఉపాధ్యాయుల పాత్ర వంటి కీలక అంశాలపై చర్చ జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, అడిషనల్ సెక్రటరీ బ్రహ్మకుమారిస్ బి.కే. మృత్యుంజయ, శాంతి సరోవర్ డైరెక్టర్ బ్రహ్మకుమారి కుల్ దీప్, సింపోజియం డైరెక్టర్ బ్రహ్మకుమారి అంజలి, సిగ్నేచర్ స్టూడియో సి.ఈ.ఓ. అంజలి మహేందర్, పలువురు విద్యావేత్తలు పాల్గొన్నారు.

సింగూరు డ్యామ్ ను పరిశీలించిన కమిటీ

- మరమ్మతులు జరిపే తీరుపై అధ్యయనం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 22 : సింగూరు ప్రాజెక్టు మరమ్మతుల గురించి ప్రభుత్వం ఇటీవల ఏడుగురు సభ్యులతో కూడిన అధ్యయన కమిటీని ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో కమిటీ శనివారం డ్యామును పరిశీలించింది. డ్యామును పూర్తిగా ఖాళీ చేసి మరమ్మతులు చేపట్టాలా లేక కాపర్ డ్యాం నిర్మించి పనులు చేపట్టాలా అనే విషయంలో ప్రత్యక్షంగా కమిటీ పరిశీలించింది. అధ్యయన కమిటీలో ఓఎంసీ చైర్మెన్ అంజద్ హుస్సేన్, మిషన్ భగీరథ ఈఎన్సీ సి. కృపాకర్ రెడ్డి , హైదరాబాద్ మెట్రోవాటర్ టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్ ఉన్నారు. ప్రాజెక్టు ఖాళీ చేస్తే మూడు జిల్లాలకు తాగు నీటి ఇబ్బందులు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై కమిటీ చర్చించింది. సింగూరు ప్రాజెక్టులో నిల్వ ఉన్న 16 టీఎంసీల నీటిలో 6 టీఎంసీల నీటిని కిందకి వదిలి 10 టీఎంసీల నిల్వతో మరమ్మతులు చేసే యోచనలో నీటి పారుదల శాఖ ఉన్నట్లు తెలుస్తోంది. సాధ్యాసాధ్యాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదికను సమర్పించనుంది. కమిటీ నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. ఈ ప్రాజెక్టు ఆనకట్ట దెబ్బతిన్నదని, వెంటనే మరమ్మతులు చేపట్టకపోతే ప్రమాదమని గతంలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మరమ్మతులకు రూ. 26కోట్లు, ఇతర పనులకు రూ. 61.5 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది.

భవానీమాతకు 33 తులాల వెండితో అలంకరణ

- అమ్మవారికి నగలు అందజేయడం సంతోషంగా ఉందన్న బాలేశ్వరి

ప్రతిపక్షం, షాద్ నగర్, నవంబర్ 22: అమ్మవారి చల్లని చూపు అందరిపై ఉండాలని ఎలికట్ట భవానీమాతకు గాంధీనగర్ కాలనీకి చెందిన బాలేశ్వరి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భవానీమాత మరింత తేజస్సుతో కనిపించేలా 33 తులాల వెండితో (55 వేల రూపాయలు విలువగల) సూర్యుడు, చంద్రుడు, కర్ణాభరణాలు ప్రత్యేకంగా తయారు చేయించి అలంకరించారు. మాతకు వెండితో తయారుచేసిన ఆభరణాలు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం మల్లేష్ పూజారి ఆమెకు, వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో అష్ట ఐశ్వర్యలతో ఉండాలంటూ ఆశీర్వాదం ఇచ్చారు.. ఈ పూజా కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు శ్రీ రాఘవేంద్ర ప్రింటింగ్ ప్రెస్ యజమాని ప్రతాప్, మంజుల, శ్రీకాంత్, పవన్, చరణ్ లతోపాటు శ్రీధర్, లవ్ కుమార్ పాల్గొన్నారు..లు దేవాలయాలకు భారీ విరాళాలను అందజేస్తూ భగవంతుడి సేవలు సేవలుఅనిత్యం పాల్గొంటున్న బాలేశ్వరి , వారి కుటుంబ సభ్యులను కాలనీవాసులు,పట్టణ ప్రజలు ప్రత్యేకంగా అభినందించారు.



సామాజిక రుగ్మతలపై జాక్ అవగాహన

- డ్రగ్స్ కు దూరంగా ఉండాలని యువతకు పిలుపు

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 22 : సమాజంలో నెలకొని ఉన్న అనేక సామాజిక రుగ్మతలపై అవగాహన కల్పిస్తూనే, యువత డ్రగ్స్ కు దూరంగా ఉండాలని హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఏడు మండలాలలో పోరుయాత్ర నిర్వహించారు. ఆన్లైన్ గేమ్స్ కి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. చదువుకుని, జ్ఞానాన్ని పెంచుకోవాలని బుద్ధుడు, మహాత్మ జ్యోతిబాపూలే, సావిత్రి బాయి పూలే, అంబేడ్కర్, బీపీ మండల్ వంటి మహనీయులు చరిత్రను అధ్యయనం చేయాలని సూచించారు. భారతదేశంలో ప్రజాస్వామ్యం రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడిందని ప్రజలకు అవగాహన కల్పించే క్రమంలోసదస్సును నిర్వహించారు. శనివారం రోజున ఏడు మండలాల లో భారత రాజ్యాంగం విశిష్టత అనే అంశంపై వ్యాసరచన పోటీలను ఇంటర్మీడియట్ విద్యార్థులకు నిర్వహించారు. భారత రాజ్యాంగం వర్ధిల్లాలని జేఏసీ హుస్నాబాద్ ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. యువత ,మహిళలు, కార్మికులు, రైతాంగం మద్దతు ఇవ్వాలని కోరారు. వ్యాసరచన పోటీలు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించారు. కేజీబీవీ హుస్నాబాద్, అక్కన్నపేట, హుస్నాబాద్ బాలికల మైనారిటీ, ప్రభుత్వ బాలుర, బాలికల, జిల్లెలగడ్డ సాంఘిక సంక్షేమ, హుస్నాబాద్ మోడల్ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు , హుస్నాబాద్ నియోజకవర్గం కోఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్, ప్రతినిధులు ఇల్లందుల లక్ష్మణ్ గౌడ్, కోడూరి శ్రీదేవి, ఉపన్యాసకులు అస్మా సహీన్, స్వాతి, అంజలి, వెంకన్న, అశోక్, నిర్మల దేవి, వెంకయ్య,సదానందం తదితరులు పాల్గొన్నారు.

పదేండ్లలో బీఆర్ఎస్ అప్పులు 2.80 లక్షల కోట్లు

- 23 నెలలలో కాంగ్రెస్ అప్పులు 2 లక్షల 30 వేల కోట్లు
- ఈ నిధులు ఎవరి జేబులకు పోతున్నాయి?
- ప్రజలకు సమాధానం చెప్పాలన్న కేటీఆర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 22 : బీఆర్ఎస్ ప్రభుత్వం ఆనాడు చేసిన అప్పులు, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అప్పుల మధ్య ఉన్న తేడాను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వివరించారు. గత ప్రభుత్వం తీసుకు వచ్చిన ప్రతి పైసాతో ఆస్తులను సృష్టిస్తే, ఈ ప్రభుత్వం మాత్రం అప్పుల సునామిని సృష్టించి, రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభం వైపు నడిపిస్తోందని మండిపడ్డారు. పార్లమెంట్ లెక్కల ప్రకారం పది సంవత్సరాల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 2.80 లక్షల కోట్ల అప్పులు తీసుకువస్తే, 23 నెలల కాలంలోనే దాదాపు 2 లక్షల 30 వేల కోట్ల అప్పులను కాంగ్రెస్ పార్టీ తీసుకువచ్చిందని అన్నారు. ఆనాడు మిషన్ భగీరథ, కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి మిషన్ కాకతీయ వేల కోట్లతో రోడ్ల నిర్మాణం వంటి అనేక ఉత్పాదక ఆస్తులను సృష్టించిందని తెలిపారు. ఈ ప్రభుత్వం ఎలాంటి కొత్త పథకం లేకుండానే, ఒక్క ప్రాజెక్టు ప్రారంభం కూడా చేయకుండానే, కనీసం మౌలిక వసతుల కోసం ఒక్క ఇటుక పేర్చకుండానే 2 లక్షల 30 వేల కోట్ల రూపాయల అప్పులు తీసుకువచ్చి ఏం చేసిందని ప్రశ్నించారు. అక్టోబర్ నెల కోసం విడుదల చేసిన కాగ్ నివేదికతో వడ్డీల వాదనలో డొల్లతనం బయటపడటంతో, ఇంత భారీ మొత్తంలో చేస్తున్న అప్పులన్నీ ఎవరి జేబుల్లోకి పోతున్నాయో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. వడ్డీల పేరుతో పదేపదే అబద్ధాలు చెబుతూ ప్రజల దృష్టిని మళ్లిస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం, వాస్తవానికి ఈ అప్పులన్నింటినీ తమ అనుచరులు, మధ్యవర్తులు, ఢిల్లీకి మూటలను పంపడానికే ఉపయోగిస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని 'స్కాంగ్రెస్ ఏటీఎం' గా మార్చారని విమర్శించారు. ఇన్ని రోజులు వడ్డీల కోసమే అప్పులు చేస్తున్నామని కాంగ్రెస్ వాళ్ళు చెప్పుకొచ్చినా, కాగ్ నివేదికతో మరోసారి వాదనలోని డొల్లతనం బట్టబయలైనందున, ఈ అప్పులన్నీ దేని కోసం చేశారో వెంటనే ప్రజలకు వివరించాలన్నారు.

"అప్పులపై తప్పుడు ప్రచారం చేస్తున్న సీఎం రేవంత్ క్షమాపణలు చెప్పాలి. నెలకు రూ.2300 కోట్లు కూడా లేని వడ్డీని రూ7వేల కోట్లుగా అబద్ధాలు చెబుతున్నట్లు 'కాగ్' నివేదిక బట్టబయలు చేసింది. బీఆర్ఎస్ పదేళ్లలో రూ2.8 లక్షల కోట్ల రుణం తెస్తే కాంగ్రెస్ 23నెలల్లోనే రూ. 2.30 లక్షల కోట్లు అప్పు చేసింది. కొత్త ప్రాజెక్టులు నిర్మించలేదు. అప్పు తెచ్చిన రూ.లక్షల కోట్లు ఏమయ్యాయో చెప్పాలి.
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ప్రతిపక్షం
Prathipaksham.in
4
హైదరాబాద్
ఆదివారం
23.11.2025
@prathipaksham
prathipakshamtvtelugu

ఓపెన్ వాయిస్

'జనతన సర్కారు' మిథ్యా ప్రపంచమేనా?!

సీదీ బాత్

ఎస్ కే జకీర్
9052631212

'1964 లో సీపీఎం విడిపోవడం వల్లే జనతా ప్రజాతంత్ర ప్రభుత్వం సాధించలేక పోయాం:-- సీపీఐ.1969 లో నక్సలైట్లు చీలిపోవడం వల్ల దేశాన్ని విముక్తి చేయలేక పోయాం: ---సీపీఎం, చారు మజుందార్ ఖతం కార్యక్రమం వల్ల విప్లవ కమ్యూనిస్టులను ఏకం చేయలేక పోయాం: యూసీసీఆర్ఐఎంఎల్, దేశంలో కులాన్ని గుర్తించక పోవడం వల్ల కమ్యూనిస్ట్ ఉద్యమం ఎదగలేదు:- అంబేద్కరిస్టులు, పెట్టుబడిదారీ దేశంగా గుర్తించి సోషలిస్టు విప్లవమనలేదు కనుక సోషలిజం సాధించలేదు:-- నయా సోషలిస్టులు. నాయకత్వ స్థానాలలో అగ్ర కులస్తులతో అణగారినవర్గాల ఆదరణ కరువైంది: సోషల్ మీడియా శోష' అంటూ సోషల్ మీడియాలో ఒక మిత్రుడు ఆసక్తికర పోస్టు పెట్టాడు. లొంగిపోకుండా మూర్ఖంగా చివరి వరకు పోరాడి ప్రాణాలు కోల్పోవడం అవసరమా అనే ప్రశ్న వచ్చింది.

మనమింత కాలం ఒక భ్రమలో బ్రతికామా? దేశంలోని పౌరులు, విప్లవకారులు, విప్లవాభిమానులు, అటు ప్రాణాలర్పించిన విప్లవకారులు, ఇంకా ఆ ప్రాణాలర్పిస్తున్నవాళ్లు, లొంగిపోయినవాళ్లు, లొంగుబాట దారిలో ఉన్నవాళ్లు, లొంగిపోవాలా? లేక సాయుధ పోరాటంలోనే తమ ప్రాణాలు విడిచిపెట్టాలా? అనే మీమాంసలో కొమిట్టాడుతున్నవాళ్లు, ఊగిసలాడుతున్నవాళ్లు, అందరూ ఒక మిథ్యా ప్రపంచంలో ఉన్నట్టు ఒక సూత్రీకరణ జరుగుతోంది.1975 కల్లా దేశంలో అంతర్యుద్ధం జరుగుతుందని, విప్లవం పరిపక్వ స్థితిలోకి వస్తుందని సీపీఐ (ఎంఎల్) నిర్మాత చారుమజుందార్ అన్నారు. ఆరు దశాబ్దాలుగా సాయుధ పోరాటం జరుగుతున్నా విప్లవం పరిపక్వానికి వచ్చిందా? అనే ప్రశ్న తలెత్తుతోంది. 'దున్నేవానికే భూమి' ప్రాతిపదికన వ్యవసాయ విప్లవం ఇరుసుగా గల నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం కావడానికి ఇంకా ఎన్నేండ్లు పడుతుంది? అనే ప్రశ్నకు జవాబు లేదు.

ఎవరి వాదనలు వారివే

'1964 లో సీపీఎం విడిపోవడం వల్లే జనతా ప్రజాతంత్ర ప్రభుత్వం సాధించలేక పోయాం: సీపీఐ.1969 లో నక్సలైట్లు చీలిపోవడం వల్ల దేశాన్ని విముక్తి చేయలేక పోయాం: సీపీఎం, చారు మజుందార్ ఖతం కార్యక్రమం వల్ల విప్లవ కమ్యూనిస్టులను ఏకం చేయలేక పోయాం: యూసీసీఆర్ఐఎంఎల్, దేశంలో కులాన్ని గుర్తించక పోవడం వల్ల కమ్యూనిస్ట్ ఉద్యమం ఎదగలేదు: అంబేద్కరిస్టులు, పెట్టుబడిదారీ దేశంగా గుర్తించి సోషలిస్టు విప్లవమనలేదు కనుక సోషలిజం సాధించలేదు: నయా సోషలిస్టులు. నాయకత్వ స్థానాలలో అగ్ర కులస్తులతో అణగారినవర్గాల ఆదరణ కరువైంది: సోషల్ మీడియా శోష' అంటూ సోషల్ మీడియాలో ఒక మిత్రుడు ఆసక్తికర పోస్టు పెట్టాడు. లొంగిపోకుండా మూర్ఖంగా చివరి వరకు పోరాడి ప్రాణాలు కోల్పోవడం అవసరమా అనే ప్రశ్న వచ్చింది. మార్పు అనేది మార్క్సిస్టు అవగాహనే కదా అనే పోస్టులు వస్తున్నాయి.

వసంత మేఘ గర్జన వారసత్వం

'మావోయిస్టులు ఆయుధాలు వీడడం సరైనదేనా? అని. అట్లెట్ల ఆయుధాలు అప్పగిస్తారు? ఆయుధాలు సాయుధ దళాలకు అప్పజెప్పాలి. సరెండర్ సమయంలో హావభావాలు నాన్ సీరియస్‌గా ఉండకూడదు. మిలిటరీ డ్రెస్‌తో అప్పగించడం కరెక్ట్ కాదు' అని ఇక్కడ నగరాలలో సెల్ ఫోన్ దు పట్టుకొని కంప్యూటర్ ముందు పెట్టుకొని, చెమట పట్టని ఫ్యాన్ గాలి కింద లేదా ఏసీ రూమ్ లో మనకు తోచిన ప్రకారం అభిప్రాయం చెప్పవచ్చు. ఇంతమంది సాయుధ నక్సలైట్లు కుప్పలు కుప్పలుగా లొంగిపోవడం దేశ చరిత్రలో మొదటిసారి అనేది చర్చనీయాంశమే. అనేకానేక ఘటనల తర్వాత తనకంటూ చరిత్ర నిలుపుకున్న మావోయిస్టు పార్టీ భారతదేశ రాజకీయాలలో ఏ పాత్రలో ఇముడుతుంది? ఏ పాత్ర పోషిస్తుంది? ఇంకా ఎన్ని వేల మరణాలకు కేరాఫ్ అడ్రస్ గా ఉంటుంది. వైఫల్యాలను సమీక్షించుకోలేని భౌతిక స్థితిని పునర్ మూల్యాంకనం చేయని మొండి పార్టీగా మరింతగా నష్టపోతుందా? లేచి నిలబడి కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా ప్రకటించిన గడువు 2026 మే తర్వాత కూడా వసంత మేఘ గర్జన వారసత్వాన్ని కొనసాగిస్తుందా? పార్టీ కార్యదర్శి నంబాల కేశవరావు (బసవరాజు)తో పాటు ఇంకా చాలామంది మావోయిస్టు అగ్రనాయకులు గడచిన యేడాది కాలంలో నేలరాలిపోయారు. కాలం కడుపుతో ఉండి కన్న పువర్తి కన్నబిడ్డ, ఆదివాసీ యువకుడు, మావోయిస్టు పార్టీ శిఖర భాగమైన కేంద్ర కమిటీ సభ్యునిదాకా ఎదిగిన హిడ్మాను కోల్పోవడం కన్నా భారీ నష్టమేదీ లేదు.

ఇంకా పోరాటం కొనసాగుతూనే ఉంది

'మొదటి సార్వత్రిక ఎన్నికలు1952 నుంచి జరిగిన ఎన్నికల ప్రక్రియ అంతా కూడా బూటకం. నిజంగా భారతదేశంలో సోషలిస్టు సమాజం నిర్మాణం కావాలంటే సాయుధ పోరాటం తప్ప వేరే మార్గం లేదు. ప్రజలలో సాయిధ పోరాట అవగాహన ఏర్పరచాలంటే ఇదే మంచి సమయం. మోడీ ప్రభుత్వం తమ హిందుత్వ సిద్ధాంతం ప్రకారంగా వాళ్లు నమ్ముతున్న సిద్ధాంతాన్ని వాళ్లు నమ్ముతున్న సిద్ధాంతాన్ని అమలు చేయడానికి మావోయిస్టులను నిర్మూలించడానికి వివిధ మార్గాలలో అమలు చేస్తున్నారు. చివరి యుద్ధమని ప్రకటించారు. అందుకు మనమంతా కూడా యుద్ధంతోనే ప్రతిఘటించాలి తప్ప లొంగుబాటలో కాదు.

ఈ ముగింపు కొత్త ఉదయానికి నాంది!

దోపిడీ వర్గాల పార్లమెంటరీ వ్యవస్థకు, సామ్రాజ్యవాద నిర్దేశిత పరాధీన ఆర్థిక వ్యవస్థకు, 'అభివృద్ధి' నమూనాకు, జీవన విలువల పతనంతో కుళ్లి కంపుకొడుతున్న దోపిడీ వర్గాల సంస్కృతికి జనతన సర్కారే నిజమైన ప్రత్యామ్నాయమని పొగిడిన వారంతా తమ రచనలను,ప్రసంగాలను సమీక్షించుకోవలసి ఉన్నది. మావోయిస్టు పార్టీ అగ్రనేతలు చాలా మంది చనిపోయారు. మిగిలిన కొందరు ఒకరివెంట మరొకరు లొంగిపోతున్నారు. వారి లొంగుబాటుపై అనేక రకాల కామెంట్లు వస్తున్నాయి. లొంగిపోతున్నవారు ఇటీవల ఎన్‌కౌంటర్లు కారణమా? అని కొందరు సందేహిస్తే ఆయుధాలు వీడి శత్రువుతో కరచాలనం చేస్తున్న ద్రోహులని మరికొందరు ఆరోపిస్తున్నారు. ఇవన్నీ నిగ్గు తేలే విషయాలు కావు. ఎందుకంటే అన్ని ఆరోపణలకు ఆధారాలు ఉండవు. కొన్ని చీకటిలో మిగిలిపోతాయి. వాటిని నిరూపించే మార్గం ఉండదు లేదా ఆరోపణే పూర్తిగా అసత్యం కావొచ్చు. కానీ, నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం చేయడం కోసం ప్రాణ త్యాగానికి సిద్ధమై అడవిబాట పట్టినప్పడే వారు వ్యక్తిగత స్వార్థాన్ని వదిలిపెట్టారు. కానీ, కాలం ఎదురుతిరిగింది. అన్ని రంగాలలో బలమైన మార్పులు వచ్చాయి. కానీ, ఇది లొంగుబాటు కాదని, సాయుధ పోరాట విరమణ మాత్రమేనని తక్కెళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న చెప్పారు. ఇకపై తమ పోరు రాజ్యాంగ పరిధిలో ప్రజా సమస్యలపై సాగుతుందని స్పష్టం చేశారు. మన సమాజంలో ఇప్పటికీ జనంలో అసంతృప్తి రగిలితే అన్నలను గుర్తుకు తెచ్చుకునేవారు కోకొల్లలు.

వెచ్చటి నెత్తురు చిందిన వీరులు

రెడ్ కారిడార్, ప్రజా రాజ్యాధికార అంగాలలో ఒకటిగా పాపులర్ అయిన జనతన సర్కార్, ప్రజా విముక్తి సైన్యం (పీఎల్జీఏ), అటు గెరిల్లా జోన్లు, గెరిల్లా బేస్ క్యాంపులు, విముక్తి ప్రాంతాలు, ఇక జ్ఞాపకాలుగా మిగిలిపోనున్నాయా? విప్లవాభిమానులు, మావోయిస్టు రాజకీయాలతో ఏకీభవించే వాళ్లందరినీ ఈ సందేహం వెంటాడుతున్నది. ప్రత్యామ్నాయ రాజకీయాలకు 'లైట్ హౌస్' అంటూ జనతన సర్కార్ ను ఆకాశానికి ఎత్తిన నగరాలలోని 'మావోయిస్టు పార్టీ మేధావుల'ను తాజా పరిణామాలు ఉక్కిరిబిక్కిరి చేస్తుండవచ్చు. దశాబ్దాలుగా 'ఆ చెట్టు' పేరు చెప్పకొని పబ్బం గడుపుకుంటున్నవారికి ఈ పరిణామాలు అంతగా రుచించేవి కావు. 'ముందుగా మనం బతకాలి కదా' అని లొంగిపోయిన తర్వాత ఆశన్న అనడం ప్రస్తుత విషాద సన్నివేశాలకు అద్దం పడుతోంది. ఆశన్న అలా పచ్చి నిజాలు మాట్లాడడం సోకాల్డ్ మేధావులకు మింగుడు పడదు. 'మేము శవాలమై వస్తే ఎర్రజెండా కప్పి మమ్మల్ని అమరవీరులుగా కీర్తించాలని కొందరు మేధావులు భావిస్తున్నారు' అని కూడా ఆశన్న నిందించాడు. అయిదారు దశాబ్దాలుగా వేలాది మంది యువతీ యువకులు ఈ దేశంలో అసమానతలను నిర్మూలించడానికి, దోపిడీ, పీడనల నుంచి పీడితుల పక్షాన పోరాడి తమ వెచ్చటి నెత్తురును ధారపోశారు. వాళ్ల అసాధారణ త్యాగాలకు విలువ లేకుండా పోతోంది.

ఆయుధాలు అప్పగించడం విప్లవ ద్రోహమే. ఇది మనందరికీ సరియైన సమయం. ఈ ప్రభుత్వంతో యుద్ధము తప్ప వేరే మార్గం లేదు' అని అచ్యుత సత్యనారాయణ రావు మాంచర్ల పేరుతో సోషల్ మీడియాలో ఒక పోస్టు దర్శనమిచ్చింది. కాగా 40,50 యేండ్ల నుంచి ఎన్నింటినో తట్టుకుని ఉన్న ఎందరో అటు 'ఆపరేషన్ కగార్' హత్యలకు బలవుతుంటే తట్టుకోలేక లొంగిపోతున్నారు. ఇన్నేండ్లు పోరాటంలో ఉంటూనే, సవాళ్లను నిర్బంధాన్ని రాజ్యహింసను ఎదుర్కొంటూనే బతికి బట్టగట్టిన ఎందరో నేతలు, క్యాడర్ ఇట్లా రాలిపోతుంటే, సెలెక్టెడ్ గా చంపబడుతుంటే బాధగానే ఉంటుంది మరి. ఇవన్నీ ద్రోహాలు కాకపోతే ఇంకేమిటి ? విభేదాలతో ఉద్యమంలోంచి బయటకు రావచ్చు, సైద్ధాంతిక అవగాహన, అభిప్రాయాలు మారవచ్చు, అనారోగ్య కారణాలతో అక్కడే చనిపోకుండా బయటకు రావచ్చు. విప్లవంపై విశ్వాసం సడలినా ఉద్యమానికి నష్టం కలిగిస్తూ ఎవరూ ఉద్యమంలోనే ఉండవలసిన అవసరం లేదు. బయటకు వచ్చి నమ్మిన దారిలో నడవొచ్చు, నచ్చిన జీవితం గడపొచ్చు. వారు కోరుకున్న పద్ధతిలో పని చేయవచ్చు. భిన్నాభిప్రాయాలు స్పష్టంగా పేర్కొనవచ్చు. గతంలో ఎందరో అదే చేశారు. కానీ, ఉద్యమానికి నష్టం కలిగించలేదు. ఉద్యమంలో కొనసాగుతామనుకున్నవాళ్లు క్రూర రాజ్యహింసకు, వేటకు, సహచరుల మోసానికి బలవ్వకూడదు' ఇది ఓ అభిప్రాయం.

మల్లోజుల చేసింది సరైనదేనా!!

'మావోయిస్టు అగ్ర నేత మల్లోజుల వేణుగోపాల్ తన అనుచరగణంతో కలిసి యూనిఫాం, ఆయుధాలతో పాటు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్ సమక్షంలో ప్రభుత్వానికి లొంగిపోయారు. ఇన్నాళ్లపాటూ తాను నమ్మి, ఆచరించి, ప్రబోధించిన సిద్ధాంతం పట్ల అపనకమ్మం ఏర్పడిన పక్షంలో లొంగుబాటు వ్యక్తిగతంగా వుండవలసింది. పార్టీకి చెందిన ఆయుధాలను, సిద్ధాంతానికి చెందిన యూనిఫార్మ్ సరెండర్ చేయవలసింది కాదు' అని ఒక విప్లవాభిమాని పోస్టు చేశారు. 'భారతీయ విప్లవోద్యమంలో విప్లవకారులు లొంగిపోవడమో లేక తమ పోరాటపంథాని మార్చుకోవడమో కొత్త కాదు.ఇప్పటివరకు ఎన్నో వందలమంది లొంగిపోయారు.కానీ ఆయుధాలతోనూ, యూనిఫాం తోనూ ఒక పార్టీ చీలిక వర్గంగా ఎవరూ లొంగిపోలేదు. కేజీ సత్యమూర్తి వంటి అగ్ర నాయకుడు కూడా ప్రధాన స్రవంతిలోకి వచ్చి మారిన పంథాలో చివరి వరకు సామాజిక జీవితంలో వున్నారే కానీ, పార్టీని చీల్చి ఆయుధాలతో లొంగిపోలేదు. లొంగిపోయిన అనేక మంది సైలెంట్ గా తమ మానాన తాము జీవిస్తున్నారు. అంతే తప్ప, మల్లోజుల వేణుగోపాల్ లా ఎవరూ చేయలేదు' అని మరొకరు పోస్టు పెట్టారు.

ఆశన్న మాటల వెనుక అసలు మర్మం

'దీన్ని సరెండర్ అనకండి అని గతంలో ఆశన్న, ఇప్పుడు రూపేశ్ పేరుతో చెలామణి అవుతున్న తక్కళ్లపల్లి వాసుదేవ రావు జర్నలిస్టులకు, యూట్యూబర్లకు చెప్పిన మాట. దీన్ని సరెండర్‌గా చూడబోమని 'విజయ్ శర్మాజీ' కూడా ఈయన హామీ ఇచ్చాడట. ఔను, ఇది సరెండర్ ఎట్లా అవుతుంది? సరెండర్ అంటే ఉద్యమంలో కొంతకాలం పని చేసిన వాళ్లు బతుకు మీద ఆశతోనో, ఏవో విభేదాల వల్లనో, వ్యక్తిగత స్వార్థం పెరగడం వల్లనో, మరే కారణంతోనో పార్టీకి చెప్పి బయటకు వచ్చి ప్రభుత్వం ముందు లొంగిపోవడం. ఇదీ సాధారణంగా అందరికీ తెలిసిన సరెండర్. చాలా అరుదుగా కొందరు వ్యక్తులు ఆయుధాలతో సహా పారిపోయి వచ్చి సరెండర్ అయిన ఘటనలు కూడా ఉన్నాయి. వారిని ద్రోహులుగా, ఉద్యమ శత్రువులుగా ప్రకటించిన చరిత్ర కూడా మనకు తెలుసు. కానీ, వేణుగోపాల్, వాసుదేవరావు పాల్పడ్డది ఈ రెండు కోవలలోకి వచ్చేది కాదు. అందుకే ఇది సరెండర్ కాదు. ఇది విద్రోహం కూడా కాదు. ఇది విప్లవ ప్రతిఘాతుకత్వం. వీళ్లిద్దరూ విప్లవ ప్రతిఘాతకులు' అనేది మరో అభిప్రాయం. వాసుదేవరావు అడవిలోంచి ఇంకా పూర్తిగా బయటకు రాకముందే మీడియా ముఖంగా తన ఫోన్ నెంబర్, ఒకటికి రెండు సార్లు రెట్టించి మరీ ప్రకటించాడు. తన 'శాంతి' మార్గానికి మద్దతు పలికేవాళ్లు తనను కాంటాక్ట్ చేయొచ్చని చెప్పాడు. అది ఆయనకు రాజ్యం ఇచ్చిన ఫోన్ అని,అది ఆయనకు రాజ్యం ఇచ్చిన డైరెక్షన్ అని తెలుసుకోవడానికి పెద్దగా శ్రమ పడనక్కరలేదు. అంటే, పోరాటాన్ని కొనసాగిస్తామంటున్న అగ్ర నేతలతో ఉన్న గెరిల్లా దళ సభ్యులలో బలహీనులు ఎవరైనా ఉంటే, వారు ఈ ఫోన్ నెంబర్‌ను కాంటాక్ట్ చేస్తే చాలు. ఈయనకు ఈ ఫోన్ అందించిన రాజ్యం వారి లొకేషన్‌ను ట్రాక్ చేసి వెంటనే వారిని మట్టుపెట్టేందుకు వేసిన ఎత్తుగడ ఇదని అర్థం చేసుకోవడానికి మనం సైంటిస్టులు కావాల్సిన అవసరం లేదు.

అంతా వారికి తెలిసే జరుగుతున్నా

'దండకారణ్య ఉద్యమానికి 'జల్ జంగల్ జమీన్' నినాదమే కీలకం, పార్టీ అక్కడికి చేరుకోక ముందే అక్కడి ప్రజలలో ఈ నినాదం ఉంది. అంతే కాదు. మా వూళ్లో మా రాజ్యం (మావ నాటే మావ రాజ్) అనే స్వపరిపాలన స్ఫూర్తి కూడా బస్తర్ ఆదివాసీలలో పార్టీ వెళ్లక ముందు నుంచే ఉందనే చరిత్ర నీకు తెలియకపోవచ్చు. ఇంద్రావతి ప్రాంతంలో ఇన్నేసి నెలలుగా అక్కడక్కడే తిరుగుతూ ఉన్నా నీకేం నష్టం జరగలేదు. ఎందుకు? కానీ అదే ప్రాంతంలో ఎక్కడో ఓ మారుముల గ్రామంలో తలదాచుకుంటున్న కార్తీక్, ఆయన గార్డు, ఆ గ్రామస్థులు 'ఎన్‌కౌంటర్'కు బలవుతారు. మరో గ్రామంలో బడిలో టీచరుగా స్థిరపడ్డ సుధీర్‌ను పట్టుకెళ్లి మరో ఇద్దరు గ్రామస్థులతో కలిపి కాల్చి చంపుతారు. మరో ఊళ్లో ఒక ఇంటిలో షెల్టర్ తీసుకుంటున్న రేణుకను, నువ్వే చెప్పినట్టు, నువ్వు కలిసిన మరుసటి రోజే పట్టుకొని చంపేస్తారు. ఆమెతో మీ 'శాంతి' పథకాన్ని కూడా చర్చించానని చెప్పుకున్నావు. నీ పథకంతో విభేదించినందుకే కదా ఆమె ప్రాణాలు పోయింది? బసవరాజుతో రెగ్యులర్ టచ్‌లో ఉన్నానని,మీ శాంతి పథకానికి ఆయనే సూత్రధారి అని కూడా నువ్వన్నావు. ఇది బసవరాజు మొదలుపెట్టిన ప్రక్రియేనని కూడా నువ్వు నొక్కి చెబుతున్నావు. వేణు కూడా అదే అన్నాడు. ఆ పెద్దమనిషి ఇక చితాభస్మంలోంచి లేచి రాడని, మీ తప్పుడు కూతలను ఖండించలేడని ఎంత నమ్మకమో కదా మీకు!? అదే పరిసర ప్రాంతంలో ఉన్న నీకు చీమ కూడా కుట్టలేదు కానీ,వేలాది మంది భద్రతాబలగాలు చుట్టుముట్టి బసవరాజును, ఆయన సహచరులను మట్టుబెడతాయి. ఆయన నిన్ను వ్యతిరేకించినందు వల్లనే, వాళ్ల 'లొకేషన్' శత్రువుకు చేరింది కదా!' ఓ 'అనామకుడి' వేదన ఇది

వారి ప్రాణాలు ఎందుకు పోయాయి!

'మొన్నటికి మొన్న రాజుదాద, కోసదాద ఎవరి వల్లనో పట్టుబడ్డారని నువ్వు చెబితే ఇప్పుడు మేం నమ్మాలి! దానికి కొన్ని నెలల ముందు నుంచే నువ్వు, నీ బాస్ వేణు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులతో మంతనాలు సాగిస్తున్నారని నువ్వే కాదు, వాళ్లు కూడా బాహాటంగానే చెప్పారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి అయితే, తారక్క లొంగుబాటు నుంచే వేణు త కాంటాక్ట్ లో ఉన్నాడని చెప్పాడన్న విషయం బయట అందరికీ తెలుసు. ఓ వైపు రాజుదాద, కోసదాద ప్రాణాలు నీ గుప్పిట ఉంటాయి. ఎందుకంటే పట్టణంలో ఉంటున్న వారిద్దరితో కాంటాక్ట్ లో ఉన్నానని నువ్వే చెప్పుకున్నావు. మరోవైపు,నువ్వు రాజ్యంతో, దాని నిఘా సంస్థలతో లింకుల్లో ఉంటూ, మీ సామూహిక సాయుధ లొంగుబాటు పథకానికి ఏర్పాట్లు చేస్తూ ఉంటావు. రాజుదాద, కోసదాద మీ 'శాంతి' మార్గానికి మద్దతు పలికి ఉంటే వాళ్ల ప్రాణాలు పోయేవి కాదు. ఇలా ప్రాణాలు కోల్పోయిన వాళ్లందరి 'లొకేషన్లు' శత్రువుకు చేరవేసింది ఎవరో చెప్పు! పెద్ద తలకాయలను లేపెయ్యడంలో సిద్ధహస్తుడివి. ఇటువైపు పెద్ద తలలలోంచి చిందిన రక్తం కూడా నీ చేతులకు అంటిందా లేదా చెప్పు''అని 'అనామకుడు' పేరిట ఒక విశ్లేషణ వచ్చింది. మల్లోజుల వేణుగోపాల్, తక్కెళ్లపల్లి వాసుదేవరావు తదితరుల లొంగుబాటును ఆ 'అనామకుడు' గట్టిగా వ్యతిరేకించాడు. పైగా పార్టీ సెక్రెటరీ బస్వరాజు ఎన్ కౌంటర్ కు ఆశన్న సమాచారమే కారణమని నిందించాడు.

తిరుగులేని విజయాలు సాధించి కూడా

'నగ్జల్బరీ వెనుకంజ తరువాత, తిరిగి సంఘటితమైన దేశంలో ఏ విప్లవ పార్టీ సాధించలేని విజయాలను సాధించడమే కాకుండా, గతంలో ముక్కలు చెక్కలైన పార్టీ దేశంలోని నిజమైన విప్లవకారులను సమైక్యం చేయడంలో చాలా వరకు విజయం సాధించింది. దక్షిణాసియా దేశాలలోని విప్లవ పార్టీలను, శక్తులను సమైక్యం చేయడానికి తీవ్రంగా కృషిచేసి సఫలమైంది. పార్టీ సాధిస్తున్న అచీవ్మెంట్స్ ఎంత గొప్పవో, పార్టీ చేస్తున్న తప్పులూ అంతకన్నా తీవ్రమైనవి కావడంతో, దేశంలోని ఏ ప్రాంతంలోనూ సాపేక్షికంగా నిలకడైన, బలమైన సంఘటిత విప్లవోద్యమాన్ని నిర్మించలేకపోయాం. శత్రువు బలాన్ని, విప్లవ శక్తుల బలాన్ని సరిగా అంచనా వేసుకొని తగిన ఎత్తుగడలతో విప్లవోద్యమాన్ని నిర్మించడంలోనూ తప్పులు చేస్తూ వస్తాంది. ఒకప్పుడు విప్లవంలో ప్రజా సంఘాల ఆవశ్యకతనే మా పార్టీ గుర్తించలేదు. ఆ తీవ్ర అతివాద తప్పిదం నుండి బయటపడి, విప్లవ ప్రజలను సంఘటితం చేస్తూ విప్లవ పోరాటాల ద్వారా ప్రజా పంథాలో విప్లవోద్యమాన్ని పురోగమింపచేయడానికి అసమాన త్యాగాలతో పూనుకుంది. గడచిన దాదాపు రెండు దశాబ్దాలకు పైగా కాలంలో అక్కడ తిరిగి పునర్వికాసం జరుగలేదు. ఇటీవలే, ఏఓబీలో మిగిలిన అతికొద్ది మంది కామ్రేడ్స్ నాయకత్వం సహా అమరులయ్యారు. ఆ వరుసన దేశంలోని ఏ ప్రాంతంలోనూ ఎంఎంసీ, ఒడిశా, పశ్చిమ బెంగాల్, పశ్చిమ కనుమలు మున్నగు అటవీ ప్రాంతాలు సహా ఏ రాష్ట్రంలోనూ నిలబడలేకపోయాం' ఇది సోనూ పార్టీలో ఉండగానే రాసిన లేఖలోని అంశాలు

ఇపుడు బతికి బట్టకట్టే పరిస్థితి లేదు

'ఒకనాడు దేశంలోని 16 రాష్ట్రాలలో, దాదాపు 150 జిల్లాలలో విప్లవోద్యమం తన ఉనికిని చాటుకుంది. వీటిలో ప్రధానంగా ఆదివాసీ ప్రాంతాలలో సాపేక్షికంగా ఎక్కువగా కాలమే బలంగా నిలబడగలిగింది. దండకారణ్యం, బిహార్ ఝార్ఖండ్ లో విప్లవ ప్రజా ఉద్యమం విముక్తి ప్రాంతాల లక్ష్యాన్ని చేపట్టి నూతన ఎత్తులకూ ఎదిగింది. ఈ రెండు ప్రాంతాలు సహా గత దశాబ్దన్నర కాలంగా ఎక్కడా విప్లవోద్యమం బతికి బట్టకట్టే పరిస్థితులే లేకుండా పోయాయి. అందుకు ఏకైక కారణం శత్రువుకు అభేద్య రహస్య విప్లవ పార్టీని నిర్మిస్తూ, మారుతున్న పరిస్థితులను సవ్యంగా అర్థం చేసుకొని విప్లవ సిద్ధాంతాన్ని ఆచరణకు అన్వయించడంలో మా పార్టీ ఘోరంగా విఫలమవడం తప్ప మరేం కాదు. ఫలితంగా దశాబ్దాలుగా అనేక త్యాగాలతో నిర్మించుకున్న విప్లవోద్యమాలను శత్రు వర్గాలు పదే పదే ఓటమి పాలు చేయగలుగుతున్నాయి. మా ఓటమికి శత్రువు గొప్పతనం కన్నా మా బలహీనతలు, తప్పులే ప్రధానమైనవని ఒప్పుకుంటున్నాం. దండకారణ్యంలో ఉద్యమం నష్టపోవడానికి సాపేక్షికంగా కొంత ఎక్కువ సమయం తీసుకున్నప్పటికీ, అంతిమంగా ఓటమి పాలే కావలసి వస్తోంది. సకాలంలో తప్పుల నుండి మా పార్టీ తేరుకోలేకపోయింది. 2013నాటికి ఉద్యమం తాత్కాలిక వెనుకంజకు నెట్టబడింది. పీపుల్స్ వార్, ఎంసీసీ విలీనం దేశ ప్రజలలోనూ, అంతర్జాతీయంగా విప్లవ శక్తులలోనూ ఒక నూతన ఉత్సాహకర, ఉత్తేజపూరితమైన సందేశాన్నిచ్చి, ఒక అనుకూల వాతావరణాన్ని సృష్టించినప్పటికీ, దానిని మేం మా బలానికి కొలమానంగానే చూశాం తప్ప, విప్లవోద్యమాన్ని పురోగమింపచేయడానికి, మా తప్పులను అర్థం చేసుకొని, సరిదిద్దుకునే కృషి తగినంతగా చేయకపోవడంతో ఆ పరిస్థితులను సద్వినియోగం చేసుకోలేదు' అని కూడా సోను పేర్కొన్నాడు.

అతివాద ఒంటెత్తుపోకడలతో

'మా పార్టీ స్వయం కృతాపరాధాలకు పాల్పడింది. పార్టీ అనుసరించిన అతివాద ఒంటెత్తుపోకడలతో కూడిన తప్పిదాలు ప్రజలలో వివిధ రూపాలలో ప్రతిబింబిస్తూ ఒక పెద్ద సెక్షన్ విప్లవోద్యమానికి దూరమైంది. దండకారణ్యం, బిహార్, ఝార్ఖండ్ సహా దేశంలో ఎక్కడా మా పార్టీ నాయకత్వంలో ఉద్యమాలు బలపడలేకపోతున్నాయి. మా నాయకత్వ అవగాహనలో, సిద్ధాంత అధ్యయనంలో, మారుతున్న పరిస్థితులకు దానిని అన్వయించడంలో జరుగుతున్న లోపాలుగా అర్థం చేసుకోలేకపోయాం. ప్రజలు, కేడర్ అసమాన త్యాగాల నుండైనా మేం సకాలంలో గుణపాఠాలు తీసుకోని ఫలితంగా, వరుసగా జరుగుతున్న నష్టాలతో పీడిత ప్రజలను తీవ్ర నిరాశ నిస్పృహ, అవిశ్వాసానికి, ఆందోళనకు నెట్టాం. ఇలాంటి పరిస్థితులలో, పార్టీ గత తప్పుల నుండి నేర్చుకుంటూ తిరిగి విప్లవోద్యమాన్ని నిర్మించడానికి తాత్కాలికంగా సాయుధ పోరాట విరమణ చేయకుండా సాధ్యం కాదనేది తేలిపోయింది. ప్రజా సమస్యలపై వారిని పునఃసంఘటితం చేస్తూ గత తప్పులకు తిరిగి నెట్టబడకుండా, విప్లవోద్యమాన్ని నిర్మించడమే పార్టీ ముందు ఏకైక మార్గంగా మిగిలింది. పార్టీ చేసిన తప్పులకు వెలకట్టలేని త్యాగాలతో మూల్యాన్ని చెల్లించాం. దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథా అంటూ, సాయుధ పోరాటం అంటూ, పరిస్థితుల మార్పులతో, స్థల కాలాలతో నిమిత్తం లేకుండా, చైనా పంథా,రష్యా పంథా అనే పిడివాద ఆచరణకు స్వస్తి చెప్పి దేశ స్థల కాల పరిస్థితులకు తగిన పంథాలో భారత విప్లవాన్ని జయప్రదం చేయడానికి పూనుకోవడమే పార్టీ ముందు మిగిలిన ఏకైక కర్తవ్యం'

అర్థం చేసుకోవడంలో చేసిన పొరపాట్లకు

మా మిడిమిడి జ్ఞానంతో, వస్తుగత పరిస్థితులను అర్థం చేసుకోవడంలో చేసిన పొరపాట్లకు, మా ఆచరణలో అవలంబించిన అతివాద ఒంటెత్తువాద తప్పులకు మమ్మలను మన్నించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం. మీ మధ్య ఇక మా పార్టీ గతంలా లేకపోవడంతో, వర్గ సమాజంలో విప్లవ ప్రతిఘాత శక్తులు మిమ్మల్ని ఎంతగా వేధిస్తాయో, ఎలాంటి ప్రతికార చర్యలకు పాల్పడుతాయో మాకు తెలుసు. మేం తాత్కాలికంగా సాయుధ పోరాట విరమణ చేయడాన్ని అర్థం చేసుకోగలరు. ఈ నిర్ణయం తీసుకోకుండా రక్తసిక్తం అవుతున్న అడవులను శాంతి వనాలుగా మార్చలేం. ఈ నిర్ణయం తీసుకోకుండా మిగిలిన విప్లవ శక్తులనైనా కాపాడుకోలేం. ఈ నిర్ణయం తీసుకోకుండా, మీ మీ త్యాగాలకు, అమరుల బలదానాలకు న్యాయాన్ని చేకూర్చలేం. ఈ 'ఓటమి' బాధాకరమైనదే' అని సీపీఐ (మావోయిస్టు) పార్టీ కేంద్రకమిటీ, పొలిట్ బ్యూరో మాజీ సభ్యుడు, లొంగిపోయిన మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ సోను గత ఆగస్టులో ఒక సుదీర్ఘ లేఖ విడుదల చేశాడు.ఈ లేఖపైనా,ఆయన, వాసు ఆయుధాలు సహా లొంగిపోవడంపైనా విమర్శలు,ప్రతి విమర్శలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి.

(వ్యాస రచయిత ఇండిపెండెంట్ సీనియర్ జర్నలిస్ట్)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

ప్రాంతీయం

మదీనా విషాదం: కష్టంలో తోడు నిలిచిన ప్రభుత్వం

- మదీనాలో ముగిసిన మృతుల అంత్యక్రియలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 22 : పవిత్ర ఉమ్రా యాత్రకు వెళ్లిన హైదరాబాద్ యాత్రికులు మదీనా సమీపంలో ఘోర బస్సు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం యావత్ తెలంగాణ సమాజాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. అయితే, ఈ విషాద సమయంలో తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి తీసుకున్న తక్షణ చర్యలు హృదయం గెలిచిన చర్యగా నిలిచాయి.ముఖ్యమంత్రి ఈ ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేయడమే కాక, తక్షణమే రంగంలోకి దిగారు. అమరులకు నివాళిగా, వారి అంత్యక్రియల ఏర్పాట్లను పర్యవేక్షించడం ప్రభుత్వ బాధ్యతగా తీసుకున్నారు. ఈ నెల నవంబర్ 17న జరిగిన ఈ ఘోర ప్రమాదంలో పది మంది చిన్నారులు సహా 45 మంది యాత్రికులు ప్రాణాలు కోల్పోయారు. మృతులలో ఎక్కువ మంది ఆసిఫ్ నగర్, జిర్రా, మెహదీ పట్నం, టోలిచౌకి ప్రాంతాలకు చెందినవారే. ఈ దుర్ఘటన తర్వాత, తెలంగాణ ప్రభుత్వం తరపున ముగ్గురు సభ్యుల అధికారిక బృందాన్ని (మొహమ్మద్ అజారుద్దీన్, డాక్టర్ షఫీవుల్లా, మాజిద్ హుస్సేన్) హుటాహుటిన మదీనాకు పంపారు. ఈ బృందం మూడు రోజులు మదీనాలోనే ఉండి, అక్కడ చట్టపరమైన అనుమతులన్నీ చకచకా తీసుకుని, అమరుల ఖననం పూర్తయ్యే వరకు పర్యవేక్షించడం నిజంగా అభినందనీయం. మృతుల పార్థివ దేహాలకు శనివారం, నవంబర్ 22న ప్రవక్త మసీదులో జుహ్ర్ ప్రార్థనల అనంతరం సలాత్ అల్ జనాజా నిర్వహించబడింది. తర్వాత, యాత్రికులకు దైవ ప్రవక్త సహచరుల సమాధుల పక్కన ఉన్న జన్నతుల్ బఖీలో శాశ్వత నిద్ర కల్పించడం జరిగింది. కష్ట సమయంలో కూడా తమ ప్రియమైన వారికి పవిత్ర స్థలంలో అంత్యక్రియలు జరిగేలా చూడటం బాధిత కుటుంబాలకు గొప్ప ఓదార్పు.

పేదల సొంతింటి కల ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- మేడ్చల్ కాంగ్రెస్ ఇంఛార్జి తోటకూర వజ్రేష్ యాదవ్

ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, నవంబర్ 22: పేద కుటుంబ సొంతింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రజాపాలన లక్ష్యమని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలోని తూంకుంట మున్సిపాలిటీ హకీంపేట్ లో ఉల్లి మంజుల శ్రావణ్ కుమార్ దంపతులకు మంజూరైన 5 లక్షలతో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో శనివారం వజ్రేష్ యాదవ్ ముఖ్య అతిధిగా పాల్గొని ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం పేద ప్రజలకు సొంత గృహం అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఇంచార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారాలతో మేడ్చల్ నియోజకవర్గానికి 3 వేల 5 వందల ఇళ్ళు మంజూరైనందుకు ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటికే కొన్ని ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసి గృహ ప్రవేశాలు నిర్వహించామని, మిగిలిన ఇండ్ల నిర్మాణాల పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. లబ్ధిదారుల బిల్లులు సమయానికి చెల్లించేందుకు అధికారులు కృషి చేస్తున్నారని వెల్లడించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇల్లు కట్టించి అందజేయడమే ప్రజా ప్రభుత్వ బాధ్యతగా కొనసాగుతుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హోసింగ్ డీఈ అశోక్, ఏఈ కమలాకర్, తుంకుంట మున్సిపల్ మేనేజర్ శ్రవణ్ కుమార్, రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటి మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, గుండ్లపోచంపల్లి, అలియాబాద్ కాంగ్రెస్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సున్నంచెరువు నివాసితులతో సమావేశమైన హైడ్రా కమిషనర్

- ఆంజనేయ గుడితో పాటు.. చిల్లా తరలింపునుకు అంగీకారం

ప్రతిపక్షం, సిటీబ్యూరో, నవంబర్ 22: మాదాపూర్, బోరబండ సరిహద్దుల్లోని సున్నం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తున్న ఆంజనేయ గుడితో పాటు.. ముస్లింల ప్రార్థనా స్థలం చిల్లా తరలింపునకు అంగీకారం కుదిరింది. సున్నం చెరువు పరిసర ప్రాంత ప్రజలతో శనివారం హైడ్రా ఏర్పాటు చేసిన సమావేశంలో ఇరు పక్షాలకు చెందిన వారు ఇందుకు సమ్మతి వ్యక్తం చేశారు. హైడ్రా మొదటివిడతలో పునరుద్ధరిస్తున్న ఆరు చెరువుల్లో సున్నం చెరువు కూడా ఉందనే విషయం అందరికీ విదితమే. అయితే ఈ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో చిన్న ఆంజనేయగుడితో పాటు.. ఆ సమీపంలోనే ముస్లింల చిల్లా కూడా ఉంది. ఇవి ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తున్నందున వీటిని చెరువు గట్టువైపు తరలించాలని హైడ్రా భావించింది. వీటి తరలింపునకు సంబంధించిన అంశం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశం అయ్యింది. ఈ నేపథ్యంలో ఇరు పక్షాలకు చెందిన స్థానికులతో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శనివారం హైడ్రా కార్యాలయంలో చర్చించారు. సుప్రింకోర్టు మార్గదర్శకాలను వివరించారు. ఆంజనేయ విగ్రహంతో పాటు, చిల్లాను చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో కాకుండా.. చెరువు గట్టు వైపు తరలించే విషయమై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఇరు పక్షాలకు చెందిన స్థానికులు అంగీకారం చెప్పడంతో ఈ సమస్యకు పరిష్కారం దొరికింది. సున్నం చెరువు చెంత.. వాటిని సురక్షితంగా తరలించడానికి స్థానికులు అంగీకారం వ్యక్తం చేశారు.

డివిజన్ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. డాక్టర్ ఎఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని జమ్మిగడ్డ లో అలాగే ఏపీఐఐసి కాలనీ లో 34 లక్ష రూపాయల నిధులతో ఏర్పాటు చేసిన యుజిడి పనులకు ఎమ్మెల్యే స్థానిక కార్పొరేటర్ శిరీష సోమ శేఖర్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి, డీజీఎం సతీష్ , ఎఈ అలేఖ్య , బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

- ప్రతిపక్షం, సిటీబ్యూరో

సిద్దిపేట డీసీసీ అధ్యక్షురాలిగా

తుంకుంట అంక్షారెడ్డి

ప్రతిపక్షం, సిద్దిపేట ప్రతినిధి, నవంబర్ 22: సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ కొత్త జిల్లా అధ్యక్షురాలిగా గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తుంకుంట నర్సారెడ్డి కూతురు రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు అంక్షారెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ అధిష్టానం ఆమె పేరును ప్రకటించింది. ఈ సందర్భంగా ఆమెకు పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అంక్షారెడ్డి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి, పార్టీ బలోపేతం, గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు కార్యకర్తల ఐక్యతపై దృష్టి సారిస్తానని అంక్షారెడ్డి అన్నారు.

పలువురు నేతల హర్షం

తుంకుంట అంక్షారెడ్డి నియామకంపై కాంగ్రెస్ నేతలు ఆనందం వ్యక్తం చేశారు. గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బుచ్చిరెడ్డి, కౌన్సిలర్ ముత్యాల శ్రీదేవి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మంద పాండు, జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు మంద వనజ, బుస్సాపూర్ గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నేత సదాశివరెడ్డిలు ఆమెకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త బాధ్యతల్లో విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

రూ.5 కోట్లతో హాస్పిటల్ భవనానికి భూమి పూజ

ప్రతిపక్షం, సిటీబ్యూరో, నవంబర్ 22 : రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని శంషాబాద్ మున్సిపాలిటీ ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరింది. శంషాబాద్ మున్సిపాలిటీకి అభివృద్ధి దినం. శంషాబాద్ మున్సిపాలిటీలో హెచ్ఎండిఏ నిధులు రూ. 5 కోట్ల వ్యయంతో నిర్మించనున్న హాస్పిటల్ భవనానికి భూమి పూజ చేసి, పనులను రాజేంద్రనగర్ శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు. ఐజీఆర్ఎస్ నిధులతో ఎయిర్పోర్ట్ కాలనీ నుండి కొత్తవాలగూడ వరకు వేయనున్న కీలకమైన బీటీ రోడ్డు నిర్మాణానికి కూడా ఆయన శంకుస్థాపన చేశారు. హెచ్ఎండిఏ నిధులు రూ. 5 కోట్లతో నిర్మితమవుతున్న 50 పడకల నూతన హాస్పిటల్ భవనం పూర్తయితే, శంషాబాద్ మరియు చుట్టుపక్కల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ "ప్రజల ఆరోగ్యం మా ప్రభుత్వానికి అత్యంత ప్రధానం. ఈ హాస్పిటల్ నిర్మాణం పూర్తయితే, చిన్న చిన్న వైద్య అవసరాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ప్రజలకు తప్పుతుంది. ఐజీఆర్ఎస్ రూ. 1.95 లక్షల నిధులతో నిర్మించనున్న ఎయిర్పోర్ట్ కాలనీ కొత్తవాలగూడ బీటీ రోడ్డు గురించి మాట్లాడుతూ, ఈ రహదారి ప్రజల రాకపోకలను సులభతరం చేస్తుందని, ప్రాంతాల మధ్య అనుసంధానతను పెంచుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్, మాజీ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, అధికారులు, స్థానిక నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ట ఉత్సవాల్లో పాల్గొన్న నేతలు

ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, నవంబర్ 22: మేడ్చల్ మున్సిపాలిటీ అత్వెల్లిలో గల పురాతనమైనా పోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం రెండవ రోజు కొనసాగింది. మూడు రోజుల ఉత్సవాలు జరిగే ఈ కార్యక్రమం శుక్రవారం ప్రారంభం కాగా రెండవ రోజు హోమాలు, విగ్రహ మూర్తులకు అభిషేఖాలు, విగ్రహ ఊరేగింపు వంటి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో అన్ని పార్టీలకు సంభందించిన నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, బీఆర్ఎస్ నాయకులతో కలిసి విగ్రహాలకు అభిషేఖాలు చేశారు. అమ్మవారి ఆలయం కోసం 2 లక్షలు విరాళంగా అందజేశారు. మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్ తమ పార్టీ నేతలతో కలిసి పూజలు నిర్వహించారు.కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి. హనుమంత్ రావు ఆలయంను సందర్శించి ప్రతిష్ట ఉత్చవాల్లో పాలొగొన్నారు. ఈ ఉత్సవాల్లో అన్ని పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ను వెనక్కి తీసుకోవాలి

ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, నవంబర్ 22: కార్మిక హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్ ల అమలు కోసం కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ వెంటనే రద్దు చెయాలని సీఐటియు మేడ్చల్ కార్యదర్శి నరేష్ అన్నారు. మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ కార్పొరేట్ సంస్థలకు, వ్యక్తులకు ఉడిగం చేయడం కోసం తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో డబిల్ పూర్ చౌరస్తా వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దగ్ధం చేశామని తెలిపారు. కార్మిక నిబంధనలను, హక్కులను, సంక్షేమాన్ని తుంగలో తొక్కే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. పెట్టుబడిదారీ ప్రయోజనాల కోసం 29 కార్మిక చట్టాలను కుదించి 4 లేబర్ కోడ్లు తెచ్చిందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మెలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించిన కేంద్ర ప్రభుత్వ పాలకులలో చలనం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం దున్నపోతు మీద వాన పడ్డట్టు చందంగా వ్యవహరిస్తుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి జారీచేసిన నోటిఫికేషన్ ను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక హక్కులను, చట్టాలను సక్రమంగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు నర్సింగ్ రావ్, యాదగిరి, కొమురయ్య, పూజ, కావేరి, దేవమ్మ, ఎం కావేరి, నాగరాణి, నిత్యానాథ్, తస్లింబేగం, సమీనా, లక్ష్మి, ప్రమీలతో పాటు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్, మల్లారెడ్డి ఆసుపత్రి

సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరం

ప్రతిపక్షం, కుత్బుల్లాపూర్, నవంబర్ 22 : లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్, మల్లారెడ్డి ఆసుపత్రిలు సంయుక్తంగా శనివారం జగద్గిరిగుట్టలోని వైష్ణవి టెక్నో పాఠశాలలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ అధ్యక్షులు లయన్ బీరు ఆంజనేయులు, జోనల్ సభ్యులు లయన్ పాషాలు ముఖ్యఅతిథిలుగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో జనరల్, గుండె, కంటి, దంత, మహిళ తదితర విభాగాలలో వైద్య పరీక్షలు చేశారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులకు వివిధ పరీక్షల నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. ఈ సందర్భంగా లైయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ అధ్యక్షులు లయన్ బీరు ఆంజనేయులు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలలో లైయన్స్ క్లబ్ ఎప్పుడు ముందుంటుందని తెలిపారు. వైష్ణవి పాఠశాల యాజమాన్యం ముందుకు వచ్చి వైద్య శిబిరాన్ని పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలతో పాటు, పేద విద్యార్థులకు ఆర్థిక చేయూత, ఆస్పత్రుల వద్ద నిరంతరాయంగా టిఫిన్ ఏర్పాటు లాంటి కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైష్ణవి పాఠశాల చైర్మన్ సిహెచ్ నరసింహులు గౌడ్, డైరెక్టర్ జి. బాలరాజు, పాఠశాల ప్రిన్సిపాల్ సాయిబాబా, లయన్స్ క్లబ్ ప్రతినిధులు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు

స్థలాన్ని పరిశీలించినఎమ్మెల్యే నవీన్ యాదవ్

ప్రతిపక్షం, సిటీబ్యూరో , నవంబర్ 22 : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన వాగ్దానం ఆదేశాల మేరకు జూబ్లీ హిల్స్ శాసనసభ్యులు వల్లాల నవీన్ యాదవ్ సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ రూపంలో అమీర్పేట్ ప్రాంతంలోని మైత్రివనం వద్దకు చేరుకున్నారు. తెలుగు చలనచిత్ర ప్రపంచానికి అపూర్వ సేవలందించిన, ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నెలకొన్న మహానటుడు, నటసార్వభౌముడు, భారత రత్న పురస్కార గ్రహీత స్వర్గీయ డాక్టర్ నందమూరి తారక రామారావు విగ్రహాన్ని స్థాపించడానికి మైత్రివనంలో కేటాయించబోయే స్థలాన్ని ప్రత్యక్షంగా ఎమ్మెల్యే నవీన్ యాదవ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ విగ్రహ స్థాపనకు తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు.ప్రాంతీయ అభివృద్ధి, కళాకు, సాంస్కృతిక విలువలకు నాంది పలికే ఈ విగ్రహం ప్రజల్లో నూతనోత్సాహాన్ని నింపుతుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు యువత, మహిళలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

"



సత్యసాయి బాబా సిద్ధాంతాలు, సూత్రాలే నిజమైన విద్య. ఇతరుల గురించి బతకడమనేది ఉత్తమ విధానం. సత్యసాయి సందేశాలకు ప్రచారకర్తలుగా విద్యార్థులు మారబోతున్నారు. ఆధునిక విధానాలతో పాటు సంప్రదాయాలను పాటించాలి. డ్రగ్స్ ఇప్పుడు అతిపెద్ద సవాలుగా మారింది. నో టూ డ్రగ్స్ అంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టాలి.

- సత్యసాయి విద్యాసంస్థ స్నాతకోత్సవంలో ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్

ప్రాంతీయం

సీనియర్ కార్యకర్తను పరామర్శించిన ఎమ్మెల్యే మల్లారెడ్డి

ప్రతిపక్షం. ప్రతినిధి. మేడ్చల్, నవంబర్ 22: బీఆర్ఎస్ పార్టీ సీనియర్ కార్యకర్త అనారోగ్యంతో బాధ పడుతున్న భద్రారెడ్డిని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి శనివారం ఆయన నివాసంలో నాయకులతో కలిసి పరామర్శించారు. గత కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధ పడుతున్నట్లు తెలుసుకున్న తన నాయకుడు ఇంటికి వచ్చి తన ఆరోగ్యం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నందుకు భద్రారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఏమైనా ముఖ్య సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని మల్లారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో డబిల్ పూర్ మాజీ సర్పంచ్ రాజమల్లారెడ్డి, మాజీ జిల్లా గ్రంధాలయపు ఛైర్మెన్ భాస్కర్ యాదవ్, మాజీ మున్సిపల్ కోఅప్షన్ మెంబర్ అకిటి నవీన్ రెడ్డి, పాటు తదితరులు పాల్గొన్నారు

గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

ప్రతిపక్షం, రంగారెడ్డి జిల్లా, నవంబర్ 22: డిసెంబర్ 8 మరియు 9వ తేదీలలో నిర్వహించే గ్లోబల్ సమ్మిట్ కు సంబంధించి ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం రంగారెడ్డి జిల్లా కందుకూర్ మండలం వైల్కుంట తాండలో డిసెంబర్ 8 మరియు 9వ తేదీలలో గ్లోబల్ సమ్మిట్ నిర్వహించే ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పరిశీలించారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహించేందుకు చేపడుతున్న ఏర్పాట్లను, హెలిప్యాడ్ పనులను పరిశీలించారు. గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లలో ఎక్కడ ఎలాంటి పొరపాట్లుకు తావ్వివకుండా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరూ తమ విధులని బాధ్యతో నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కలెక్టర్ వెంట కందుకూర్ ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, ఏసీపీ కె.వి.రాజు, తహశీల్దార్ గోపాల్, విద్యుత్ శాఖ అధికారులు, సంబంధిత ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సిర్గాపూర్ పోలీసు స్టేషన్ ను తనిఖీ చేసిన ఎస్పీ

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 22 : సిర్గాపూర్ పోలీసు స్టేషన్ ను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ ఆవరణ పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం స్టేషన్ రికార్డ్ లను తనిఖీ చేస్తూ అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రతి గ్రామాన్ని సందర్శించి, మన చుట్టూ జరుగుతున్న వివిధ రకాల నేరాలు, ఆన్లైన్ మోసాల గురించి ప్రజలలో అవగాన కల్పించాలని ఎస్.హెచ్.ఓ కు సూచనలు చేయడం జరిగింది. సరిహద్దు ప్రాంతాల నుండి ప్రభుత్వ నిషేధిత గంజాయి, అక్రమ మద్యం అక్రమ రవాణా జరగకుండా చెక్ పోస్ట్ లను నిర్వహిస్తూ నిఘా కట్టుదిట్టం చేయాలన్నారు. సరిహద్దు ప్రాంతాలలో, ప్రధాన కూడళ్లలో సిసి కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ఆన్లైన్ మోసాలు, బెట్టింగ్ యాప్స్ మరియు రోడ్డు ప్రమాదాల నివారణకై ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, యస్.హెచ్.ఓ కు సూచనలు చేశారు. ఈ తనిఖీలలో ఎస్పీ గారి వెంబడి నారాయణఖేడ్ డియస్పీ వెంకట్ రెడ్డి, కంగ్టి సిఐ వెంకట్ రెడ్డి ఉన్నారు.

విద్యానభ్యసిస్తూనే అసమానతలపై కొట్లాడాలి

- మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయపేట్, నవంబర్ 22: పీడీఎస్ యూ నారాయణ పేట్ జిల్లా మూడవ మహాసభల సందర్భంగా, స్థానిక మెట్రో పంక్షన్ హాల్ నందు జిల్లా అధ్యక్షులు ఎస్. సాయి కుమార్ అధ్యక్షతన జరిగిన, విద్యార్థి బహిరంగ సభకు ముఖ్య వక్తగా హాజరైన గుమ్మడి నర్సయ్య విద్యార్థులు తమ చదువు తో పాటు సమాజంలోని అనేక అంతరాలపై విద్యార్థులు కొట్లాడాలని తల కిందులుగా ఉన్న సమాజాన్ని సరి చేయాలనీ విద్యార్థులకు పిలుపునిచ్చారు. నేడు దేశంలో ఎలాంటి సామాజిక సమస్య లు ఉన్నాయి వాటిని ఎలా పరిష్కరించుకోవాలి అని ఆలోచించాలి. మన ప్రజాస్వామ్య దేశంలో మీరు ఉన్నత ఉద్యోగాలు సంపాదిస్తూనే మన పాలకులు ఎలా పాలన కొనసాగిస్తున్నారు అది ఎవరికి ఉపయోగం గా ఉన్నది అని చూడాలి. మన దేశంలో విద్యను, వైద్యాన్ని ఇలా ప్రతి రంగాన్ని పాలకులు ప్రయివేట్ కు ఆప్పచెపుతున్నారు ఇలా చేస్తే మన లాంటి పేద మధ్యతరగతి విద్యార్థుల కు విద్యా అందకుండా పోతుంది ఫలితంగా మనం ఇంకా వెనకపడి పోతాం ఇది తప్పు అని ప్రతి విద్యార్థి నినదించాలన్నారు. పీడీఎస్ యూ రాష్ట్ర అధ్యక్షులు కె. పృథ్వి మాట్లాడుతూ, నేడు మన తెలంగాణ రాష్ట్రంలో దాదాపు మూడు వేల కోట్లు స్కాలర్షిప్, పీజురింబర్స్మెంట్ పెండింగ్ లో ఉన్నాయి. విడుదల చేయడం లేదు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచడం లేదు. టీచర్, అధ్యాపక, ప్రొపెసర్ పోస్టులు, బర్తిచేయడం లేదు. ఇలా విద్యా రంగాన్ని అన్ని విధాలుగా భ్రష్టు పట్టిస్తు పేదలకు విద్యను దూరం చేస్తున్నాడు అన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం పాఠ్యంశాలలో అశాస్త్రీయ అంశాలను చొప్పించి దేశాన్ని అణాగరికంలోకి తీసుకెళ్లుతున్నాడు అన్నారు. దీనినివ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభ ల సందర్బంగా ఉదయం పదకొండు గంటలకు స్థానిక ప్రెస్ క్లబ్ నుండి విద్యార్థి ప్రదర్శన ప్రారంభం అయి పాత బస్టాండ్ నర్సిరెడ్డి చౌక్, కొత్త బస్టాండ్ అంబేద్కర్ చౌక్ మీదుగా మెట్రో హల్ చేరుకొని సభ నిర్వహించారు. ఈ మహాసభ లో పీడీఎస్ యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. అనిల్. ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ నాగేష్, ప్రముఖ న్యాయవాది ఎం. కాళేశ్వర్. పి డి ఎస్ యూ మాజీ రాష్ట్ర కార్యదర్శి బోయిన్ పల్లి రాము. మాజీ రాష్ట్ర అధ్యక్షులు పి. రామకృష్ణ. మాస్ లైన్ పార్టీ మక్తల్ డివిజన్ కార్యదర్శి ఏ. సలీమ్, నారాయణ పేట్ డివిజన్ కార్యదర్శి కె.కాశీనాథ్, పి డి ఎస్ యూ జిల్లా కార్యదర్శి బి. అజయ్ కుమార్. జిల్లా సహాయ కార్యదర్శి సంధ్య. బి. వెంకటేష్. ఉపాధ్యక్షులు గౌస్. జిల్లా కోశాధికారి బి.మహేష్ తదితరులు ప్రశాంగించారు.

మహిళాభివృద్ధికి పెద్దపీట వేసిన ప్రజా ప్రభుత్వం

- ప్రభుత్వ పథకాలన్నీ మహిళల పేరిటే అమలు
- మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయపేట్, నవంబర్ 22: మహిళలు ఆత్మ గౌరవంతో బ్రతకాలని, మహిళాభివృద్ధి తమ ప్రభుత్వ లక్ష్యమని, అందుకే రాష్ట్రంలో ప్రవేశ పెడుతున్న ప్రతీ సంక్షేమ పథకం మహిళల పేరిట అమలు చేస్తున్నామని రాష్ట్ర పశు సంవర్ధక , పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్య, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సంకల్పం తీసుకుని ముందుకు సాగుతున్నారన్నారు. అందులో భాగంగానే మహిళలకు వడ్డీ లేని రుణాలు, స్కూల్ యూనిఫాంల బాధ్యత, ఉచిత బస్ ప్రయాణం, మహిళలకు పెట్రోల్ పంపులు, సోలార్ ప్లాంట్లు లాంటి పథకాలను అమలు చేస్తున్నారన్నారు. మక్తల్ పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి వాకిటి శ్రీహరి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తో కలిసి నియోజకవర్గంలోని ప్రతి మండలానికి పది మంది చొప్పున మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం తూకం వేసిన నాసిరకం చీరలను పంపిణీ చేస్తే తమ ప్రభుత్వం నాణ్యమైన నేత చీరలను పంపిణీ చేస్తోందన్నారు. ఆడబిడ్డలు చీరలు కడితే చీరకే అందం వచ్చేలా ఉంటుందన్నారు. గతంలో ఇచ్చిన చీరలు పంట పొలాలకు కంచెలుగా మారాయని మంత్రి ఎద్దేవా చేశారు. కానీ తమ ప్రభుత్వం సిరిసిల్లలో నేతన్నలు నేసిన రెండు రకాల డిజైన్ గల చీరలను రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేస్తోందని, మహిళల ఆత్మగౌరవమే తమకు ప్రాధాన్యం అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఆడబిడ్డకు చీరను అందిస్తామన్నారు. చీర సారె తో గౌరవం పెరుగుతుందని, అది తమకు కూడా ఎంతో గౌరవం అని మంత్రి తెలిపారు. జిల్లాలో ఇంకా కొన్ని ప్రాంతాల్లో మహిళలు బహిర్భూమికి వెళ్తున్న సందర్భాలు ఉన్నాయని, ఆ పరిస్థితి పోవాలని, ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉండాలని, లేని వారు దరఖాస్తు చేసుకుంటే వారికి వెంటనే మరుగు దొడ్డి మంజూరు చేసే విధంగా జిల్లా కలెక్టర్ చొరవ తీసుకోవాలని ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. అలాగే జిల్లా కలెక్టర్ వినూత్న ఆలోచనతో పదో తరగతి విద్యార్థుల హాజరు, మార్కుల వివరాలను తెలిపేందుకు చదువుల పండగ పేరిట రూపొందించిన క్యూ ఆర్ కోడ్ తో తల్లిదండ్రులు తమ పిల్లల సామర్థ్యాన్ని తెలుసుకోవచ్చని మంత్రి తెలిపారు. అంతకు ముందు ఆ వాల్ పోస్టర్లను కలెక్టర్ తో కలిసి మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, డీఆర్డీఓ మొగులప్ప, తహసిల్దార్ సతీష్ కుమార్, ఎంపీడీఓ అనిల్, డీ పీ ఎం లు, ఏ పీ ఎం లు, మక్తల్ కు చెందిన స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

చెట్టుకు ఢీకొన్న బైకు... యువకుడు మృతి

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 22: నల్గొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి వద్ద హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. డిగ్రీ చదువుతున్న మిర్యాలగూడకు చెందిన యువకుడు నకిరేకంటి కౌశిక్ (20) హైదరాబాదులోని తన అన్న వద్దకు వెళ్లి తిరిగి మిర్యాలగూడకు వెళుతున్న క్రమంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని, మృతుడి తల్లి సంతోష్ కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో ఆటో బోల్తా... వ్యక్తి మృతి

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 22: నల్గొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పేరేపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి మృతి చెందాడు. రహదారి పక్కన ఉన్న కాల్వలో ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. ప్యాసింజర్ ఆటో నడుపుతున్న దివ్యాంగుడైన అంతటి రవి చిట్యాల లో ప్రయాణికులను దింపి తిరిగి గ్రామానికి వెళుతుండగా ఈ ఘటన జరిగింది. ఎవరు చూడకపోవటంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న చిట్యాల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాభివృద్ధికి సహకారం

- యువ నాయకులు షాపురం రాజు

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 22 : రెడ్డిపల్లి గ్రామాభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని యువ నాయకులు షాపురం రాజు(మాణిక్యం) అన్నారు. మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలోని అన్ని వీధుల్లో సోలార్ లైట్లను వేయించారు. ఈ సందర్భంగా యువ నాయకులు షాపురం రాజు మాట్లాడుతూ... రెడ్డిపల్లి గ్రామ పరిధిలోని ప్రతీ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అభివృద్ధికి ప్రతీకగా రెడ్డిపల్లి గ్రామాన్ని తీర్చిదిద్దుకుందామని తెలిపారు. అనంతరం షాపురం రాజును గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

గృహిణి అదృశ్యం

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 22 : ఓ గృహిణి అదృశ్యమైన సంఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... చిలుకూరు గ్రామానికి చెందిన అంతిగళ్ళ వైశాలి (31) ఉదయం ఏడు గంటల సమయంలో హనుమాన్ టెంపుల్ కి వెళ్లి వస్తానని చెప్పి మళ్లీ ఇంటికి తిరిగి రాలేదు. రాత్రి అయిన ఇంటికి రాకపోవడంతో భర్త అంజయ్య చుట్టుప్రక్కల బంధువుల వద్ద స్నేహితుల వద్ద ఎంత వెతికిన ఆచూకీ లభించలేదు. దీంతో ఆందోళన చెంది మొయినాబాద్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం

- నకిరేకల్ ఎమ్మెల్యే "వేముల"

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 22: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయటమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత విద్యుత్తు, ఉచిత బస్సు ప్రయాణం, వడ్డీ లేని రుణాలను మహిళల కోసం ప్రజా ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు. నల్గొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గ పరిధిలోని చిట్యాల, రామన్నపేట, నార్కట్పల్లి లల్లో శనివారం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులతోపాటు మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్రంలో కోటి మంది మహిళలకు చీరలను రేవంత్ సర్కార్ అందిస్తుందని తెలిపారు. చీరల పంపిణీ ఆలస్యమైన కూడా నేతన్నలకు చేతినిండా పని కల్పించి, నాణ్యమైన చీరలను తెలంగాణ మహిళల కు ప్రజా ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు. జెడ్పీ సీఈవో శ్రీనివాసరావు, ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అలాగే రామన్నపేట మండలంలోని వివిధ గ్రామాల్లో రూ. 72 లక్షల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

డిసెంబర్ 1న మక్తల్ కు సీఎం రేవంత్

- గొల్లపల్లి శివారులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ శంకుస్థాపన
- కాట్రేపల్లి వద్ద మక్తల్ నారాయణ పేట కొడంగల్ ఎత్తిపోతల పథకం పై లాన్ ఏర్పాటు.

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్ నవంబర్ 22: రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి డిసెంబర్ 1 వ తేదిన మక్తల్ కు విచ్చేయుచున్న సందర్బంగామంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరితో కలిసి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ శనివారం మక్తల్ లో సీఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించారు. సీఎం డిసెంబర్ 1వ తేదీన మక్తల్ మండలం గొల్లపల్లి శివారులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ శంకుస్థాపన చేయనున్నారు. ఈ భూమి పూజ జరిగే దాదాపు 20 ఎకరాలలోని స్థలాన్ని మంత్రి, కలెక్టర్ పరిశీలించారు. అలాగే కాట్రేపల్లి వద్ద మక్తల్ నారాయణ పేట కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులకు భూమిపూజ, మక్తల్ నుంచి నారాయణ పేట వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు సీఎం భూమిపూజ చేయనున్నారు. ఆయా పనులకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశించారు. అనంతరం మక్తల్ తహసిల్దార్ కార్యాలయంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఎస్పీ డాక్టర్ వినీత్ తో కలిసి సీఎం మక్తల్ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్ష జరిపారు. గొల్లపల్లి వద్ద సీఎం హెలిప్యాడ్ ఏర్పాట్లను చూసుకోవాలని ఆర్ అండ్ బీ అధికారులకు సూచించారు. అలాగే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భూమి పూజ ఏర్పాట్లు, అక్కడి నుంచి సీఎం బై రోడ్ నుంచి వస్తారని, రహదారి పొడవునా భద్రత, రహదారుల వెంబడి చెట్ల పొదలు తొలగించాలని చెప్పారు. కాట్రేపల్లి వద్ద మక్తల్ నారాయణ పేట కొడంగల్ ఎత్తిపోతల పథకం పై లాన్ ఏర్పాటు, ఆ తర్వాత మక్తల్ నారాయణపేట బీటీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ ఏర్పాట్లపై కలెక్టర్ ఆయా శాఖల అధికారులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఆర్డీవో రామచందర్, ఎస్ డి సి రాజేందర్ గౌడ్, డీఎస్పీ నల్లపు లింగయ్య, డిఆర్డిఏ మొగులప్ప, ఇరిగేషన్ ఎస్ ఈ శ్రీధర్, ఆర్ అండ్ బి ఈ ఈ వెంకట రమణయ్య, పంచాయత్ రాజ్ ఈ ఈ హిర్యా నాయక్, విద్యుత్తు శాఖ ఎస్.ఈ. వెంకటరమణ, డీ. వై.ఎస్.ఓ వెంకటేష్, డీపీఆర్ఓ రషీద్, మక్తల్ తహసిల్దార్ సతీష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీ రాములు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42% రిజర్వేషన్లు ఇస్తామని నమ్మించి చివరికి ప్రభుత్వం నట్టేట ముంచింది. రిజర్వేషన్లపై సర్కార్ ఇవాళ జారీ చేసిన జీవో 46ను వెంటనే వెనక్కి తీసుకోవాలి. సుప్రీంకోర్టు సూచించినట్లుగా ప్రస్తుత సామాజిక-రాజకీయ పరిస్థితులను అధ్యయనం చేయకుండా, గదుల్లో కూర్చొని నివేదికలు సిద్ధం చేయడం బీసీలను రాజకీయంగా దెబ్బతీయడమే.

- ఎంపీ ఆర్. కృష్ణయ్య

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- జిల్లాలో మహిళలకు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు
- కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 22: రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికంగా ఎదిగేందుకు, సామాజిక శ్రేయస్సు కోసం వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, మహిళా సంఘాల సభ్యులకు అందజేస్తున్న వడ్డీ లేని రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కార్మిక గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గ కేంద్రంలో శనివారం ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో మంత్రి వివేక్ వెంకటస్వామి, నర్సాపూర్ శాసనసభ్యులు సునీత లక్ష్మారెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. జిల్లాలో 1,27,000 కుటుంబాలకు ఉచిత కరెంటు ఇచ్చామని,లక్ష 26 వేల కుటుంబాలకు 500 గ్యాస్ కనెక్షన్ అందించామని తెలిపారు. 900 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టామని దానికి 57 వేల కోట్లు లబ్ధిదారుల ఖాతాలో జమ అయినట్లు చెప్పారు. 21 కోట్ల వడ్డీలేని రుణాల అందించామని, రాష్ట్రంలో సమర్థ వంతంగా 6 గ్యారంటీ అమలైతున్నాయని పేర్కొన్నారు. మహిళలు వివిధ వృత్తులు,వ్యాపారాలకు సంబంధించి ప్రావీణ్యం పొందేలా మెదక్ లోత్వరలోనే మహిళలకు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళా సంఘాల సభ్యులందరూ వివిధ సమావేశాలు నిర్వహించుకున్న సందర్భాల్లో ప్రభుత్వం ఉచితంగా అం దజేస్తున్న చీరలను ధరించాలని సూచించారు. నర్సాపూర్ శాసనసభ్యులు సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. చెక్కుల కోసం కోసం చాలామంది మహిళలు ఎదురు చూస్తున్నారని, ప్రతినెల మంత్రి నియోజకవర్గంలో వచ్చి ఇస్తే ఇంకా సంతోషంగా ఉంటుందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ధాన్యం వర్షానికి నానిపోయి నల్లగా మారిందని నల్లగా మారిన ధాన్యాన్ని కొని డబ్బులు రైతుల ఖాతాలో వెయ్యాలన్నారు. సన్నాళ్లకు బోనస్ ఇవ్వాలని, కొంతమంది రైస్ మిల్లర్లు దొడ్డు ధాన్యం కొంటలేరని, పంట నష్టం జరిగిన చోట ఎకరానికి 25 వేల రూపాయలు ఇవ్వాలని, నర్సాపూర్ నియోజకవర్గానికి సాగు జలాల కోసం సింగూరు నీరు అందించాలని, గ్రామాల్లో తండాల్లో ఇటీవల కృష్ణ వర్షాలకు రోడ్లు దెబ్బతిన్నాయని వాటిని మరమ్మతులు చేయించాలని మనం మంత్రి విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే , కలెక్టర్తో కలసి మంత్రి పలువురు మహిళలకు ఇందిరమ్మ చీరలను, కళ్యాణ లక్ష్మి చెక్కులను, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ సుహాసిని రెడ్డి, ఫ్యాక్స్ చైర్మెన్లు, ఆర్డీవో మైపాల్ రెడ్డి, డీఆర్డీఓ శ్రీనివాసరావు, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి, తహసిల్దారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి

- మంత్రి వివేక్ కు ఔట్సోర్సింగ్ జేఏసీ ప్రతినిధుల వినతి

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 22: కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిని రాష్ట్ర ఔట్సోర్సింగ్ జేఏసీ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడం, కంటిన్యూవేషన్ ఆర్డర్లు జారీ చేయడం, ఐఎఫ్ఎంఐఎస్ లో వివరాలు నమోదు చేయడం, పెండింగ్ జీతాలు విడుదల చేయడం వంటి ముఖ్య డిమాండ్లను ప్రతిపాదించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ పులగుల్ల రాజిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ పొన్నమల్ల యాదగిరి, వర్కింగ్ ప్రెసిడెంట్ బిక్షపతి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

'జాగృతి' లో చేరిన రమేశ్ ముదిరాజ్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 22: మెదక్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన పూట్ల రమేశ్ ముదిరాజ్ 30 మందితో కలిసి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమక్షంలో జాగృతి పార్టీలో చేరారు. శనివారం హైదరాబాద్ జూబ్లీహిల్స్లోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కల్వకుంట్ల కవిత వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా పూట్ల రమేశ్ మాట్లాడుతూ పార్టీ సూచనల మేరకు జాగృతి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు చేరువై పనిచేయడం ద్వారా పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా తీసుకెళ్తానని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- మంత్రి వివేక్ వెంకట స్వామి

ప్రతిపక్షం, దుబ్బాక, నవంబర్ 22: రాష్ట్రంలో మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని రాష్ట్ర కార్మిక ఉపాధి శిక్షణ, పరిశ్రమలు, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి అన్నారు. శనివారం దుబ్బాక మండలం లోని చిట్టాపూర్ గ్రామంలోని పెద్ద చెరువులో చేపలను విడుదలను విడుదల చేసారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఫిష్ ప్రొడక్షన్ స్టార్ట్ చెయ్యడానికి మత్స్య అభివృద్ధి స్టేట్ సెక్టార్ పథకం ద్వారా కృషి చేస్తుందని అన్నారు. 100 శాతం రాయితీ పైన చిట్టాపూర్ పెద్ద చెరువులో 2 లక్షల 20వేల పలు రకాల చేపపిల్లలు విడుదల చేసినట్టు తెలిపారు. మల్లన్న సాగర్ వద్ద 53 ఎకరాల ఫిష్ పాండ్ పెట్టేలాగా రాష్ట్ర మత్స్య శాఖ మంత్రితో మాట్లాడి తప్పకుండా మంజూరు చేపిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కే. హైమావతి, జిల్లా మత్స్య శాఖ అధికారి మల్లేశం , ఆత్మ కమిటీ చైర్మెన్ నరేందర్ రెడ్డి, పలు ప్రభుత్వ శాఖల అధికారులు ,దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి తది తరులు పాల్గొన్నారు.

మెరిసిన సిద్దిపేట మైనారిటీ గురుకుల విద్యార్థులు

ప్రతిపక్షం బ్యూరో , సిద్దిపేట, నవంబర్ 22: ప్రముఖ ప్రపంచ స్థాయి కంపెనీ హెచ్సీఎల్ నిర్వహించిన ఎర్లీ కెరీర్ ప్రోగ్రామ్ – టెక్ బీలో పాల్గొని సిద్దిపేట మైనారిటీ గురుకుల కళాశాల విద్యార్థులు తమ సత్తా చాటారు. ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అప్టిట్యూడ్, రాత పరీక్షల్లో విజయవంతంగా ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ పరకాల శ్రీనివాస్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విజయంలో విద్యార్థుల ప్రతిభ, అధ్యాపకుల కృషి ఎనలేనిదని పేర్కొన్నారు. విద్యార్థులను మార్గనిర్దేశం చేసిన అధ్యాపకుల కృషిని, కాలేజీ కెరీర్ కౌన్సిలర్ వి. పూర్ణచందర్, నరేందర్ రెడ్డి, భాను ప్రకాష్లను ప్రిన్సిపల్ పరకాల శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు. ఎంపికైన విద్యార్థులు కే గౌతమ్, దిలీప్ రెడ్డి, మధు, బహదూర్ సింగ్, కార్తీక్, సాగర్ మాట్లాడుతూ ఈ విజయం మా సంస్థకు గౌరవాన్ని తీసుకువచ్చి, ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తోందని తెలిపారు.

మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలి

- కార్మిక గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 22: మత్స్య కార్మికులు ఆర్థికంగా ఎదగాలని కార్మిక గనుల శాఖ మాత్యులు వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని రాయరావ్ చెరువులో ఉచిత చేప పిల్లల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నర్సాపూర్ శాసన సభ నియోజకవర్గ పరిధిలోని 108 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలలో గల 5,668 సభ్యులకు జీవనోపాధి కలగడంతో పాటు వారి యొక్క జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. మత్స్య కార్మికులు ఆర్థికంగా బలోపేతమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ చెరువులో 93,500 ల వేల చేప పిల్లలను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, గ్రంథాలయ చైర్మన్ సుహాసిని రెడ్డి, నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి, ఫ్యాక్స్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

శుభోదయ స్కూల్లో గ్రీన్ డే వేడుక

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 22: శుభోదయ స్కూల్లో ప్రీప్రైమరీ చిన్నారులతో గ్రీన్ డేను ఆనందంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీ ధర్మవరపు బ్రహ్మం, ప్రిన్సిపాల్ శ్రీ పి. నవీన్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొని చిన్నారులను ప్రోత్సహించారు. మొక్కల నాటకం, గ్రీన్థీమ్ క్రాఫ్ట్స్, ఆసక్తికరమైన కార్యకలాపాల ద్వారా ప్రకృతి ప్రాధాన్యం గురించి విద్యార్థులకు తెలియజేశారు. చిన్నారులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

సీఐటీయూ.. కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం

ప్రతిపక్షం, దుబ్బాక, నవంబర్ 22: కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను అమలు చేస్తూ కేంద్రంలోని బీజేపీ మోడీ సర్కార్ నోటిఫికేషన్ జారీ చేసిందని కార్మికుల హక్కులను హరించే ఈ కోడ్లను వెంటనే రద్దు చేయాలని కోరుతూ శనివారం సిద్దిపేట జిల్లా దుబ్బాక మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది. అనంతరం సీఐటీయూ దుబ్బాక పట్టణ కన్వీనర్ కొంపల్లి భాస్కర్ మాట్లాడుతూ కార్మిక హక్కులకు అత్యంత హాని చేసే నాలుగు లేబర్ కోడ్ల అమలు కోసం కేంద్ర బీజేపీ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడం దుర్మార్గమైన చర్య అని వీటిని వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శ్రీనివాస్, ఎల్లం, మల్లేశం, సాజిద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

- కల్యాణలక్ష్మి - షాదీ ముబారక్చెక్కుల పంపిణీ
- పాల్గొన్నఎమ్మెల్యే పల్లా, ఎంపీ చామల

ప్రతిపక్షం, చేర్యాల, నవంబర్ 22: జనగామ నియోజకవర్గం చేర్యాల కొమురవెల్లి, మద్దూర్, దుల్మిట్ట మండలాల స్వయం సహాయక గ్రూపుల మహిళలకు చేర్యాల రేణుక గార్డెన్స్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇంద్రా మహిళా శక్తి పథకం భాగంగా చీరల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, కలెక్టర్ హైమావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గతంలో తెలంగాణలో బీఆర్ఎస్ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు బతుకమ్మ పండుగకు బతుకమ్మ చీరలు సమయానికి అందించబడుతుండేవని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చీరలను కేవలం డ్వాక్రా సంఘాల మహిళలకు మాత్రమే కాకుండా రాష్ట్రంలోని ప్రతి మహిళకు సమానంగా అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శాసనసభ్యులు డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి , పార్లమెంట్ సభ్యులు చామలం కిరణ్ కుమార్ రెడ్డి చేతులమీదుగా మొత్తం 119కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

సిద్దిపేట రూరల్లో సుపారి గ్యాంగ్ అరెస్ట్

- పట్టుబడ్డ ఎనిమిది మంది .. ఇద్దరు పరారీలో
- ఏసీపీ రవీందర్ రెడ్డి వెల్లడి

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 22: సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చిన హత్య సుపారీ కేసులో ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేశామని, పలువురు పరారీలో ఉన్నట్టు ఏసీపీ రవీందర్ రెడ్డి వెల్లడించారు. చిన్నగుండవెల్లి గ్రామానికి చెందిన పుల్లగుర్ల యెల్లారెడ్డిని కారు ప్రమాదంలా చూపించి హత్య చేయాలని పథకం రచించిన గ్యాంగ్ను పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు ఫిర్యాదుదారుడు పుల్లగుర్ల నారాయణరెడ్డి ఇచ్చిన వివరాల ఆధారంగా కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు, గత కొంతకాలంగా మాజీ సైనికుడు అయిన ఏ1 పోలీస్ శ్రీనివాస్ రెడ్డి, యెల్లారెడ్డి మధ్య భూవివాదాల కారణంగా ఉద్రిక్తతలు కొనసాగుతున్నట్లు కనుగొన్నారు. పంచాయితీలు జరిగినా సమస్య పరిష్కారం కాకపోవడంతో, ద్వేషం పెంచుకున్న శ్రీనివాస్ రెడ్డి యెల్లారెడ్డిని హత్య చేయాలని నిర్ణయించినట్టు పోలీసులు తెలిపారు. ఈ హత్య పథకంలో శ్రీనివాస్ రెడ్డి తన బంధువు సాగర్, అతని స్నేహితుడు భరత్లకు విషయం చెప్పగా, వారు పర్శరాములు ఏ2ను పరిచయం చేశారు. హత్యకు పర్శరాములు మొత్తం రూ.10 లక్షలు డిమాండ్ చేయగా, ముందస్తుగా రూ.5 లక్షలు చెల్లించినట్టు పోలీసులు పేర్కొన్నారు. పర్శరాములు తనకు తెలిసిన ఫాజిల్ (ఏ8), నేరచరిత్ర కలిగిన కాస స్వామి (ఏ3)ను హత్యలో భాగస్వాములను చేశాడు. యాక్సిడెంట్లా చూపించి హత్య చేయాలని ప్లాన్ చేసి, స్వామికి అడ్వాన్స్గా రూ.10,000 ఇవ్వగా, తర్వాత నగదు, ఫోన్పే, వాట్సాప్ పే ద్వారా మరో రెండ లక్షల వరకు పంపినట్టు పోలీసులు తెలిపారు. డ్రైవర్లుగా చెంది అనిల్, అంజిబాబు, దుర్గాప్రసాద్, మల్లికార్జున్లను కూడా పర్శరాములు చేరదీసి, వారికి కూడా ముందస్తు డబ్బులు చెల్లించాడు. హత్యకు ఉపయోగించిన మారుతి స్విఫ్ట్ కారు (ఏపీ28 బీవీ 9918) ప్రదీప్ నుంచి అద్దెకు తెప్పించారు. అక్టోబర్ 22 రాత్రి రెండు ప్రయత్నాలు చేసినప్పటికీ, మొదట రద్దీ ఎక్కువగా ఉండడం, రెండోసారి డ్రైవర్ అనిల్ సరిగా డ్రైవ్ చేయలేకపోవడంతో హత్య యత్నం విఫలమైంది. చివరగా దుర్గాప్రసాద్ కారు నడుపుతూ యెల్లారెడ్డి బైకును వెనకనుంచి ఢీకొట్టినప్పటికీ, యెల్లారెడ్డి బ్రతికి బయటపడ్డాడు. అనంతరం కారును అంజిబాబు ఇంట్లో దాచిపెట్టారు.శనివారం ఉదయం సుమారు 9.30 గంటల సమయంలో పర్శరాములు, స్వామి, ఫాజిల్ మరియు శ్రీనివాస్ రెడ్డి మళ్లీ హత్య ప్లాన్ చేస్తుండగా, పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 8 మొబైల్ ఫోన్లను, మారుతి స్విఫ్ట్ కారును స్వాధీనం చేసుకున్నారు. సాగర్ (A9), భరత్ (A10) పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు. ఏసీపీ రవీందర్ రెడ్డి పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన రెండు ప్రత్యేక బృందాలు సిద్దిపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీను, ఎస్ఐ రాజేశ్ ఆధ్వర్యంలో కేసును ఛేదించారు.

మంటల్లో చిక్కుకొని వ్యక్తి మృతి

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 22: పొలం వద్ద మంటల్లో చిక్కుకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మెదక్ జిల్లా పాపన్నపేట్ మండల పరిధి పొడిచన్ పల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన బగుడం నర్సింహులు(47) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం సమయంలో భార్యతో కలిసి గ్రామంలో ఉన్న పొలం వద్దకు వెళ్లి పొలంలో వరి కొయ్యలను కాల్చి వేయడానికి మంట పెట్టారు. ఆ మంట వీరి పొలంతో పాటు పక్క పొలంలోకి వెళ్లడంతో మంటను ఆర్పేందుకు వెళ్లాడు. ఇతనికి కాలు సరిగా లేక నడవలేని పరిస్థితి ఉండడంతో మంటలు ఆర్పుతూ అదే మంటల్లో చిక్కుకున్నాడు. దీంతో మంటలు అంటుకొని తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కాసేపటికి భార్య సులోచన గమనించి స్థానికులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి పంచనామా నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య సులోచన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

"

పైరసీ వల్ల ఎంతో మంది చిన్న సినిమాల నిర్మాతలు నష్టపోతున్నారు. పైరసీ తప్పని, అలాంటి తప్పను కొందరు తమకు లాభం కలిగిందని సమర్థించడం ఎంతవరకు కరెక్ట్. ఏడాదిలో 10––15 సినిమాలకే టికెట్ రేట్స్ పెంచుతున్నారు. కానీ ఆ సినిమాలకే కాకుండా మిగతా చిత్రాలూ పైరసీకి గురవుతున్నాయి. పైకి బాగానే కనిపిస్తున్నా ఆ నిర్మాతలు లోపల బాధ పడుతున్నారు.

- నిర్మాత బన్నీ వాసు

ప్రాంతీయం

ఉమ్మడి జిల్లాలో డీసీసీ అధ్యక్షులు వీరే..

- కరీంనగర్ కు మేడిపల్లి, జగిత్యాలకు గజేంగి
- పెద్దపల్లి'కి మక్కాన్ సింగ్, సిరిసిల్ల'కు సంగీతం

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 22: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ని నాలుగు జిల్లాల డీసీసీ అధ్యక్షులను నియమించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వేణు గోపాల్ ప్రకటించారు. కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను, నియమించగా, అలాగే, కరీంనగర్ టౌన్ ప్రెసిడెంట్ గా అంజన్ కుమార్ ను అధిష్టానం ఖరారు చేసింది. పెద్దపల్లి డీసీసీ అధ్యక్షుడిగా రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూరు మక్కాన్ సింగ్ ను నియమించారు.రాజన్న సిరిసిల్ల జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా సంగీతం శ్రీనివాస్ ను నియమించారు. జగిత్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కొత్త అధ్యక్షుడిగా గజేంగి నందయ్యలను నియమించారు.

మహిళలు ఆర్థికంగా మరింత అభివృద్ధి సాధించాలి

- మంత్రి వివేక్ వెంకటస్వామి
- సిద్దిపేటలో చీరల పంపిణీ

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 22: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా మరింత అభివృద్ధి సాధించాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మహిళా సంఘాల సభ్యులకు సూచించారు. శనివారం సిద్దిపేట కలెక్టరేట్లో సిద్దిపేట శాసనసభ నియోజకవర్గ పరిధిలోని మహిళా సంఘాల మహిళలకు 42487 ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇంటిని చక్కదిద్దడంతో పాటు సమాజంలో కూడా వివిధ పనులను ఎంత ప్రెషర్ ఉన్న సమర్థవంతంగా నిర్వహిస్తూ మహిళలు మల్టీ టాలెంటెడ్ వ్యక్తులుగా రాణిస్తున్నారని అన్నారు. ఈ జిల్లాలో ఉన్న మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వం అప్పజెప్పిన ప్రతి పనిని సమర్థవంతంగా నిర్వహించి మన్ననలను పొందుతున్నారని అన్నారు. రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న పథకాలతో మహిళలు మహిళా శక్తులుగా ఎదుగుతున్నారని అన్నారు. జిల్లాలో వడ్డీ లేని 28 కోట్ల రూపాయల రుణాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నామని, మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. జిల్లాలో 11 వేల ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభించగా ఇప్పటివరకు బేస్మెంట్ లెవెల్ నిర్మాణం పూర్తి చేసుకున్న 9,000 ఇండ్లకు లక్ష రూపాయల చొప్పున చెల్లించడం జరిగిందని అన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్లను చక్కగా నిర్మించుకుంటున్నారు. త్వరగా పూర్తి అయ్యేలా అధికారులు చొరవ తీసుకోవాలని అన్నారు. ఇప్పుడు ఇండ్లు రానివారికి వచ్చే సంవత్సరం సిద్దిపేట నియోజకవర్గంలో మరో 3500 ఇండ్లను ఇస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ. మహిళలు శక్తి స్వరూపులని మహిళల తలుచుకుంటే ఏదైనా సాధించగలరని పథకాలను ఉపయోగించుకుని ఆర్థికంగా ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ అబ్దుల్ హమీద్, సిద్దిపేట ఆర్డీవో సదానందం, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి వడ్డీలేని రుణాలు

ప్రతిపక్షం, దుబ్బాక, నవంబర్ 22: మహిళలకు నాణ్యమైన చీరలను అందించాలని ప్రత్యేకంగా మహిళలచే ఎంపిక చేసిన డిజైన్, కలర్లతో సిరిసిల్లలో 800 రూపాయల విలువగల చీరలను రూపొందించడం జరిగిందని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. శనివారం దుబ్బాక నియోజకవర్గం కేంద్రంలోని ఐటీసీలో దుబ్బాక శాసనసభ నియోజకవర్గ పరిధిలోని మహిళా సంఘాల మహిళలకు 43,800 ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభివృద్ధికి వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం అందజేస్తుందని, ఆ రుణాలను ఉపయోగించుకుని వ్యాపారం చేసి మీ కుటుంబాలకు అండగా నిలవాలన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి
- చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రి నూతన భవనం ప్రారంభం

ప్రతిపక్షం, చేర్యాల, నవంబర్ 22: చేర్యాల మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందే దిశగా ఈ నూతన భవనం మైలురాయిగా నిలుస్తుందని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. చేర్యాల మండల కేంద్రంలో కొత్తగా నిర్మించిన ప్రభుత్వ హాస్పత్రి భవనాన్ని జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి, భోనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల చిరకాల కోరిక నెరవేరిందని, గతంలో ఏ అనారోగ్య సమస్య వచ్చినా వరంగల్ ఎంజీఎంపై లేదా హైదరాబాద్ పెద్ద ఆసుపత్రులపై ఆధారపడాల్సి వచ్చేదని గుర్తుచేశారు. కొత్త హాస్పత్రి భవనం ప్రారంభంతో ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుందని తెలిపారు. కనీసం ఐదు మందికి అయినా డయాలిసిస్ సేవలు అందించే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తే స్థానిక ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే పల్లా సూచించారు.

జనగామ కలెక్టర్ ను సత్కరించిన ఎమ్మెల్యే

ప్రతిపక్షం చేర్యాల, నవంబర్ 22: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "జల్ సంచయ్ - జన్ భాగిదారీ" కార్యక్రమంలో, సైత్ జోన్లలో జనగామ జిల్లా మూడవస్థానాన్ని సాధించింది. జనగామ జిల్లాలో జల సంరక్షణ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసినందుకు జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషాను ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి మర్యాదపూర్వకంగా అభినందనలు తెలుపుతూ పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా అభ్యున్నతికి మొదటి ప్రాధాన్యత

- జిల్లా ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 22: మహిళా అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తూ మహిళలను అన్ని రంగాల్లో బలోపేతం చేయడానికి మహిళా శక్తి పెంచడానికి వారే స్వంతంగా ఆదాయం సంపాదించడం కోసం కుటుంబానికి పోషించడం కోసం అనేక పథకాలు ప్రభుత్వం చేపట్టిందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, పరిశ్రమ,గనుల, భూ గర్భశాస్త్ర శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం తెలంగాణ ప్రగతి ఇందిరా మహిళ శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో భాగంగా గజ్వేల్ ఐఓసి లో నియోజకవర్గం లోని మహిళలకు ఇందిరా మహిళ శక్తి చీరల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి మహిళా అభ్యున్నతికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ మహిళా శక్తి పెంచడానికి వారే స్వంతంగా ఆదాయం సంపాదించడం కోసం, కుటుంబాన్ని పోషించడం కోసం అనేక పథకాలు ప్రభుత్వం మహిళల పేరుపై చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి, మెదక్ ఎమెల్సీ యాదవ రెడ్డి, గజ్వేల్ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, ఆర్డీవో చంద్రకళ, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, నియోజక వర్గంలో పలు మండలాల మార్కెట్ కమిటీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళకు ప్రభుత్వం చీరలు అందించాలి

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

ప్రతిపక్షం, చేర్యాల, నవంబర్ 22: ప్రతి మహిళకు ప్రభుత్వం చీరలు అందించాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ ప్రభుత్వానికి సూచించారు. ఇంద్రా మహిళా శక్తి పథకం భాగంగా స్వయం సహాయక గ్రూపుల మహిళలకు ఏర్పాటు చేసిన చీరల పంపిణీ కార్యక్రమంలో జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు బతుకమ్మ పండుగకు బతుకమ్మ చీరలు సమయానికి అందించబడుతుండేవని గుర్తుచేశారు. ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చీరలను కేవలం డ్వాక్రా సంఘాల మహిళలకే కాకుండా రాష్ట్రంలోని ప్రతి మహిళకు సమానంగా అందించేలా చూడాలని ప్రభుత్వానికి సూచించారు.

ముగిసిన 'షీ-లీడ్స్' శిక్షణ

- ఇక విధుల్లో 'మహిళా బ్లూ కోల్ట్స్'..
- కరాటే, మానసిక ఒత్తిడి, నిరసనల నిర్వహణపై అవగాహన :సీపీ

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 22: పోలీసు శాఖలో మహిళా ఉద్యోగులు కేవలం కార్యాలయ విధులకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించేలా కరీంనగర్ కమిషనరేట్ తీసుకున్న 'షీలీడ్స్' కార్యక్రమం సత్ఫలితాలనిస్తోందని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం పేర్కొన్నారు. కమిషనరేట్ కేంద్రంలో రెండు దశల్లో 102 మంది మహిళా కానిస్టేబుళ్లు, షీటీమ్స్ సభ్యులకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా సీపీ గౌస్ఆలం మాట్లాడుతూ.. "మనల్ని మనం రక్షించుకునే స్థితిలో ఉన్నప్పుడే ప్రజలను సమర్థవంతంగా రక్షించగలం" అని ఉద్ఘాటించారు. శారీరక, మానసిక దృఢత్వమే లక్ష్యంగా ఈ శిక్షణను రూపొందించినట్లు ఆయన తెలిపారు. కేవలం మాటల్లో కాకుండా చేతల్లో 'మేమున్నాం' అనే భరోసాను కల్పించేలా మహిళా బ్లూ కోల్ట్స్ సిద్ధమయ్యారని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

విజిబుల్ పోలీసింగ్‌లో మహిళలే కీలకం

విజిబుల్ పోలీసింగ్'లో భాగంగా మహిళా బ్లూ కోల్ట్స్ వీధుల్లో గస్తీ నిర్వహించడం వల్ల ప్రజల్లో, ముఖ్యంగా మహిళల్లో భద్రతాభావం రెట్టింపు అవుతుందని సీపీ ఆశాభావం వ్యక్తం చేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న సిబ్బంది రెట్టించిన ఉత్సాహంతో విధుల్లోకి చేరారు.ఈ ముగింపు కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ భీంరావు, ఏసీపీలు శ్రీనివాస్ జి, వేణుగోపాల్, మాధవి, కరాటే మాస్టర్ వసంత్ కుమార్, ఇతర ఇన్‌స్పెక్టర్లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న పర్చేస్ డీవైఎస్ఈ కి సన్మానం

ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 22: రామగుండం ఏరియా 1 జియం కార్యాలయంలో డీవైఎస్ఈగా పర్చేజ్ డిపార్ట్ మెంట్ లో విధులు నిర్వహిస్తున్న భీమా శ్రీరాంపూర్ ఏరియా వర్క్ షాప్ కు బదిలీపై వెళుతున్న సందర్భంగా శనివారం జీఎం కార్యాలయంలో ఆయనను అన్ని విభాగాల ఉన్నత అధికారులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జీఎం లలిత్ కుమార్ చేతుల మీదుగా సన్మానించి రిలీవింగ్ ఆర్డర్ అందజేశారు. ఆర్జీ 1 లో కీలకమైన డీవైఎస్ఈగా ఆయన చేసిన పనులను జీఎం లలిత్ కుమార్, ఏరియా అధికారులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జీయం చంద్ర శేఖర్, ఏజీయం ఐఈడీ ఆంజనేయులు, ఏరియా రక్షణ అధికారి సాయి ప్రసాద్, డీజీయం ఫైనాన్స్ ధన లక్ష్మి భాయి, అధికారులు రమేష్, రవీందర్ రెడ్డి, మోహన్ రావు, బ్రహ్మాజీ, సురేష్, లక్ష్మి రాజం, వేణు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఖరిపై దివ్యాంగుల స్వేచ్ఛ సంఘం నిరసన

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 22: సిద్దిపేట కోమటి చెరువు అడ్వెంచర్ పార్క్‌లో శనివారం జరిగిన సమావేశంలో దివ్యాంగుల స్వేచ్ఛ సంఘం నేతలు, ప్రపంచ వికలాంగుల దినోత్సవం (డిసెంబర్ 3) నిర్వహణపై ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల నోటిఫికేషన్లు వరుసగా ఈ రోజుకే వచ్చి దివ్యాంగుల సమస్యలు బయట పెట్టే అవకాశాన్ని ప్రభుత్వం అణిచివేస్తోందని జిల్లా అధ్యక్షుడు కెమ్మసారం అశోక్ తెలిపారు. దివ్యాంగుల ఓటు బ్యాంక్‌ను ఉపయోగించుకోవడమే కాక, వారి సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం ఉపాధ్యక్షులు సంజు, గౌరవ అధ్యక్షులు చెల్లా పద్మరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి చంద్రగిరి రాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

కాకతీయలో ఎల్లోకలర్ డే సెలబ్రేషన్స్

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 22: సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కాకతీయ హైస్కూల్లో చిన్నారి విద్యార్థులు ఎల్లో కలర్ డే సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన బీస్మాట్ స్టేట్ జనరల్ సెక్రెటరీ జగ్గు మల్లారెడ్డి మాట్లాడుతూ.. ప్రకృతిలోని ప్రతి రంగు పవిత్రమైనదని, పసుపురంగు ఎంతో అవసరమైనదని కావున ప్రతి విద్యార్థికి పసుపు రంగులో ఉన్న వస్తువులను వాటి ప్రాముఖ్యతను తెలియజేయడం మన ధర్మం అని తెలిపారు. మన హిందూ సంప్రదాయంలో ప్రతి శుభకార్యంలో పసుపును ముందుగా వాడుతారు అని, అందుకోసం విద్యార్థులకు దాని ప్రాముఖ్యతను తెలుపాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎల్లోకలర్ లో ఉన్న దుస్తులను ధరించి, వివిధ ఆకృతులు కలిగిన వస్తువులను, పూలను, పండ్లను చూపుతూ అబ్బురపరిచారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను మల్లారెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ 5 లక్షలకు పసికందు విక్రయ యత్నం

- పోలీసుల మెరుపు దాడి.. తల్లి సహా మధ్యవర్తుల అరెస్ట్



ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 22: పురిటి వాసన కూడా పోకముందే, కేవలం 7 రోజుల వయసున్న పసికందును విక్రయించడానికి యత్నించిన ముఠాను కరీంనగర్ టూ టౌన్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. పేదరికం, భర్త వదిలేసాడన్న కారణంతో కన్నతల్లే బిడ్డను అమ్మకానికి పెట్టడం, దానికి మధ్యవర్తులు సహకరించిన ఘటన నగరంలో కలకలం రేపింది. వైజాగ్ కు చెందిన శీలం సాయిశ్రీ (22) అనే మహిళకు భర్తతో విబేధాలు రావడంతో గర్భిణిగా ఉన్న ఆమెను హైదరాబాద్ కు చెందిన స్నేహితులు అభినవ్, హీనా ఆశ్రయం కల్పించారు. నవంబర్ 14న సాయిశ్రీ గాంధీ ఆసుపత్రిలో మగబిడ్డకు జన్మనిచ్చింది. అయితే, సాయిశ్రీ ఆర్థిక పరిస్థితిని ఆసరాగా చేసుకున్న అభినవ్, హీనా.. బిడ్డను పోషించడం కష్టమని, ఎవరికైనా అమ్మితే డబ్బులు వస్తాయని ఆమెను నమ్మించారు. ఇందుకు సాయిశ్రీ ఒప్పుకోవడంతో, హీనా తనకు తెలిసిన పల్లవి, భవాని అనే మధ్యవర్తుల ద్వారా కరీంనగర్ లో బేరం కుదుర్చుకున్నారు.

నాటకీయ పరిణామాలు..

రూ. 5 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్న ముఠా, నవంబర్ 20న కారులో (అశోక్ అనే డ్రైవర్ తో) కరీంనగర్ చేరుకున్నారు. స్థానిక పెళ్లిళ్ల బ్రోకర్ భవాని సూచన మేరకు నగరంలోని ఆర్య ఆసుపత్రి వద్దకు వెళ్లి బిడ్డను కొనుగోలుదారులకు చూపించారు. అయితే అక్కడ డబ్బుల విషయంలో గొడవ జరగడం, అనుమానాస్పదంగా వ్యవహరించడాన్ని గమనించిన ఓ ఆటో డ్రైవర్ వెంటనే 'డయల్ 100'కు సమాచారం అందించారు. పోలీసులు అప్రమత్తం కావడంతో భయపడిన ముఠా అక్కడి నుండి పరారయ్యేందుకు ప్రయత్నించింది. నిందితులను కిసాన్ నగర్ పెళ్లిళ్ల బ్రోకర్ భవాని ద్వారా రూ. 5 లక్షలు నగదు తీసుకుంటుండగా, కరీంనగర్ టూ టౌన్ పోలీసులు దాడి చేసి వారిని పట్టుకున్నారు. నిందితుల వద్ద నుండి పసికందును రక్షించి, విక్రయానికి తీసుకున్న నగదును (5 లక్షలను), కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తల్లి సాయిశ్రీ, మధ్యవర్తులు హీనా, అభినవ్, భవాని, కారు డ్రైవర్ అశోక్ తదితరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

“



డ్రగ్స్-ఉగ్రవాద నిర్మూలనకు ప్రపంచ దేశాలు కలిసిరావాలి. మాదకద్రవ్యాల అక్రమ రవాణాను సవాలుగా తీసుకోవాలి. అత్యంత ప్రమాదకరమైన ఫెంటానిల్ వంటి వాటి వ్యాప్తిని అరికట్టడం, డ్రగ్స్-టెర్రర్ సంబంధాలను ఎదుర్కొనేందుకు సహకరించుకోవాలి. ఉగ్రవాద ఆర్థిక మూలాలను బలహీనపర్చేందుకు కృషి చేయాలి.
- జీ20 సమ్మిట్‌లో పీఎం మోదీ

ప్రాంతీయం

సిరిసిల్ల కార్మికులకు ఉపాధి.. మహిళలకు ఆత్మ గౌరవం

- ప్రభుత్వ పథకాల్లో మహిళలకు ప్రాధాన్యత
- అర్హులైన ప్రతి మహిళకు ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేస్తాం
- మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

-ప్రతిపక్షం ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల (ఇల్లంతకుంట) నవంబర్ -22: ఇందిరా మహిళా శక్తి చీరల ఉత్పత్తి పథకంతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ కార్మికులకు ఉపాధి దొరుకుతుందని, మహిళల ఆత్మ గౌరవానికి తోడ్పడు తుందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఇల్లంతకుంట రైతు వేదికలో మహిళా ఉన్నతి.. తెలంగాణ ప్రగతి కింద ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందని వివరించారు. ప్రతి ప్రభుత్వ పథకం అమలులో మహిళలకు ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఎస్ హెచ్ జీ ల నుంచి రుణాలు మంజూరు చేస్తుందని వెల్లడించారు. మహిళల ఆర్థిక ప్రగతికి కోట్లాది రూపాయల లోన్లు ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. జిల్లాలోని సిరిసిల్లలో ఇందిరా మహిళాశక్తి చీరలు తయారై రాష్ట్ర మంతా పంపిణీ చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి మహిళకు ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. 32 జిల్లాల నుంచి ఎస్ హెచ్ జీ ల బాధ్యులు వచ్చి చీరల తయారీ విధానం, దశలు, రంగులు, నాణ్యత చూసి ఆనందం వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పన, మరమ్మత్తుల పనులు అమ్మ ఆదర్శ పాఠశాల కింద మహిళా సంఘాలకు అందించామని తెలిపారు. ఎస్ హెచ్ జీ ల్లో ప్రస్తుతం 18 59 ఏండ్లవారికి అవకాశం ఉందని, ప్రభుత్వం ఇప్పుడు 1518 ఏండ్ల కిశోర బాలికలకు, 60 ఏండ్ల వయసు పైబడిన వారికి కూడా సంఘాలు ఏర్పాటు చేసే అవకాశం కల్పించిందని తెలిపారు. సంఘాల్లోని మహిళలకు రుణ బీమా, ప్రమాద బీమా అమలు చేస్తుందని, రూ. రెండు లక్షల వరకు రుణ బీమా, రూ. 10 లక్షల చొప్పున ప్రమాద బీమా మంజూరు చేసిందని వెల్లడించారు. జిల్లాలో కొత్తగా 5560 మంది ఎస్ హెచ్ జీల్లో చేరారని తెలిపారు. అంగన్వాడీ, ఆశా కార్యకర్తలతోపాటు ఇప్పుడు ఎస్ హెచ్ జీ సభ్యులకు యూనిఫాం చీరలు పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే, ఇంచార్జి కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ చైతన్య, వైస్ చైర్మన్ ప్రసాద్, డీఆర్డీఓ శేషాద్రి, మండల ప్రత్యేక అధికారి, డీసీఓ రామకృష్ణ, తహసీల్దార్ ఫరూక్, ఎంపీడీఓ శశికళ, ఏపీఎం, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

19 కోట్లు నీళ్ల పాలు..

- చెక్ డ్యామ్'కూలిందా? కూలగొట్టారా..!?
- గుంపులలో ఇసుక మాఫియా దారుణం

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 22: పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం గుంపుల గ్రామం వద్ద నిర్మించిన ఒక కీలకమైన చెక్ డ్యామ్‌ను ఇసుక అక్రమ రవాణా మాఫియా సభ్యులు పేల్చివేయడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. తమ అక్రమ వ్యాపారానికి అడ్డుగా ఉందన్న ఏకైక కారణంతో, సుమారు రూ.23 కోట్లకు పైగా ప్రభుత్వ వ్యయంతో మానేరు వాగుపై నిర్మించిన ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును లక్ష్యంగా చేసుకుని ఈ దారుణానికి ఒడిగట్టారు. ఈ అమానుష ఘటన శనివారం తెల్లవారుజామున జరిగింది. చెక్ డ్యామ్ వద్ద నీరు నిల్వ ఉండడం వల్ల,వాగు నుంచి ఇసుక అక్రమ తవ్వకం మరియు రవాణాకు ఆటంకం ఏర్పడుతోందని భావించిన ఇసుక మాఫియా,ఏకంగా బాంబులను ఉపయోగించి ఈ నిర్మాణాన్ని పేల్చివేశారు. ఈ పెను దాడిలో డ్యామ్‌కు చెందిన మూడు కీలక ప్యానెల్స్ పూర్తిగా ధ్వంసమయ్యాయి. నీటిపారుదల శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం,ధ్వంసమైన ఈ మూడు ప్యానెల్స్ విలువ సుమారు రూ.3 కోట్లకు పైగా ఉంటుందని అంచనా వేశారు. ప్రజాధనంతో రైతులకు సాగు నీటి ప్రయోజనం కోసం నిర్మించిన ఒక ముఖ్యమైన ప్రాజెక్టును వ్యక్తిగత లాభాల కోసం ఇలా పేల్చివేయడం ప్రభుత్వ ఆస్తులపై జరిగిన ఉగ్ర చర్యగానే భావించాలని స్థానిక ప్రజలు, అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దాడికి గురైన ఈ చెక్ డ్యామ్ నిర్మాణ పనులు ఇటీవలే దాదాపుగా పూర్తయ్యాయి. అధికారులు ప్రాజెక్టును ప్రారంభోత్సవం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్న తరుణంలోనే ఇసుక అక్రమార్కులు ఈ దారుణానికి పాల్పడ్డారు. ఈ ఘటన ఇసుక మాఫియా యొక్క తెగింపు మరియు చట్ట వ్యతిరేక కార్యకలాపాల తీవ్రతను తెలియజేస్తోంది. సమాచారం అందిన వెంటనే, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో పాటు పెద్దపల్లి జిల్లా పోలీసు ఉన్నతాధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు.పేలుడు జరిగిన తీరు,నష్టం అంచనా మరియు ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిని గుర్తించడానికి నిపుణులతో తనిఖీలు నిర్వహిస్తున్నారు.

గౌరవెల్లి పూర్తికి అడ్డంకులు తొలగుతున్నాయ్

- హుస్నాబాద్ ప్రాంతానికి గోదావరి జలాలు ఇచ్చే బాధ్యత నాదే
- మంత్రి పొన్నం ప్రభాకర్

-ప్రతిపక్షం,హుస్నాబాద్, నవంబర్ 22: హుస్నాబాద్ నియోజకవర్గ రైతాంగానికి శాశ్వత సాగునీరు అందించే గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తికి ఉన్న అడ్డంకులు తొలగుతున్నాయని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శనివారం జలసౌధలో ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో ప్రాజెక్టు పురోగతిపై సమీక్ష నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

నిధులు మంజూరుకు అంగీకారం

గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించి లీగల్ సమస్యను సుప్రీం కోర్టు ఇటీవల పరిష్కరించడంతో కీలక అడ్డంకి తొలగిందని మంత్రి పొన్నం తెలిపారు. ప్రాజెక్టులో నీరు నింపడానికి, కాలువల తవ్వకానికి, భూ సేకరణ ప్రక్రియ పూర్తి చేయడానికి అవసరమైన నిధులు తక్షణమే మంజూరు చేయడానికి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇరిగేషన్ మంత్రి అంగీకరించారని వెల్లడించారు.

55 ఎకరాల ఆర్ అండ్ ఆర్ సమస్యపై హామీ

పనులు వేగవంతం చేసినప్పటికీ, 55 ఎకరాలకు సంబంధించిన పునరావాసం (ఆర్ అండ్ ఆర్) సమస్య పెండింగ్‌లో ఉందని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు పొన్నం ప్రభాకర్ వివరించారు. బాధితులను ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి పరిచయం చేయగా, వారి సమస్యను త్వరగా పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు.

రైతులు సహకరించాలి

గౌరవెల్లికి సంబంధించిన అన్ని అడ్డంకులూ తొలగిపోతున్నాయని, పనులు వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని మంత్రి ప్రకటించారు. కాలువల భూసేకరణ విషయంలో రైతులు మద్దతు ఇవ్వాలని, స్థానికంగా ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు.బండ్ పూర్తయి, కాలువలు తవ్వినట్లయితే గ్రామ గ్రామాన గౌరవెల్లి ద్వారా గోదావరి జలాలు అందే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.లక్ష ఎకరాలకు పైగా ఆయకట్టు ఉన్న ఈ ఎత్తైన పీఠభూమి ప్రాజెక్టును పూర్తిచేసే బాధ్యత తనదేనని మంత్రి పొన్నం ఈ సందర్భంగా ఉద్ఘాటించారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి శంకుస్థాపన చేసినప్పటికీ, పదేళ్లుగా కేసీఆర్ నిర్లక్ష్యం చేశారని పరోక్షంగా విమర్శించారు. ఎవరినీ నిందించకుండా, ఇచ్చిన మాట ప్రకారం ఈ ప్రాంత రైతాంగానికి నీళ్లు ఇచ్చే కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తామని ఆయన భరోసా ఇచ్చారు.

మక్తల్ మైనార్టీ బాలికల పాఠశాల సందర్శన

- జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఎం. ఏ. రషీద్

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, నవంబర్ 22: మక్తల్ పట్టణంలోని తెలంగాణ మైనార్టీ బాలికల పాఠశాల, మరియు కళాశాలను శనివారం జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఎం. ఏ. రషీద్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను, స్టాక్ రిజిస్టర్ లను క్షుణ్ణంగా పరిశీలించారు. వంట గదిలోకి వెళ్లి వంటకు వినియోగించే నిత్యవసర సరకులైన బియ్యం, పప్పు, ఉప్పు, పసుపు, మిరప పొడి, పాలు, నూనె, గుడ్లను పరిశీలించి నాణ్యతను చూశారు. పాఠశాలలో విద్యార్థినులకు నాణ్యమైన, రుచికరమైన అల్పాహారం, భోజనం అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రాణి ఎలిజబెత్, ఉపాధ్యాయునిలు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- బోయినపల్లి కేజీబీవీలో ఆకస్మిక తనిఖీ

ప్రతిపక్షం ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల(బోయినపల్లి), నవంబర్ - 22: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం ఇవ్వాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. బోయినపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)ను ఇంచార్జి కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా స్టోర్ రూమ్ లో ఆహార సామగ్రి, కోడి గుడ్లు, కూరగాయలు పరిశీలించారు. మెనూ ప్రకారం చికెన్, మటన్, కోడి గుడ్లు ఇస్తున్నారా అని ఆరా తీశారు. విద్యార్థులు పోషకాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని వివరించారు. ఈ సందర్భంగా విద్యాలయంలో 6వ, 9 వ తరగతి విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులందరూ చదువుపై శ్రద్ధపెట్టాలని, ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. తాము అనుకున్న ఉద్యోగాలు, ఉన్నత స్థానాలకు ఎదగాలని పిలుపునిచ్చారు. ఆర్థికంగా స్థిరపడాలని ఆకాంక్షించారు. విద్యాలయం ఆవరణ నిత్యం పరిశుభ్రంగా ఉండాలని, ఏమైనా ఇబ్బందులు ఉంటే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం బోయినపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది హాజరు, ఓపీ, మందుల రిజిస్టర్, వ్యాక్సిన్ గది, మందులు ఇచ్చే గదిని పరిశీలించారు. దవాఖానలో అందుతున్న వైద్య సేవలపై రోగుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. గర్భిణీలు అందరూ ప్రభుత్వ దవాఖానల్లో పేర్లు నమోదు చేసుకునేలా చూడాలని, ఇక్కడ అందుతున్న సేవలు, వసతులపై క్షేత్ర స్థాయిలో వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని, నిరంతరం పరీక్షలు చేసి వైద్యం అందించాలని సూచించారు. సర్కార్ దవాఖానల్లోనే ప్రసవాలు చేసుకునేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించి, సీజనల్ వ్యాధులు తదితర అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు.

'గేట్' ర్యాంకర్ శ్రీచందనను అభినందించిన కలెక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 22 : "గేట్" అర్హత పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన జి.శ్రీచందనను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అభినందించారు. భీమ్గల్ మండలం జాగిర్యాల్ గ్రామానికి చెందిన జి. దేవేందర్, స్రవంతి దంపతుల కుమార్తె అయిన శ్రీచందన గేట్ ప్రవేశ పరీక్షలో 81.67శాతం మార్కులతో 302 ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా శనివారం ఆమెను సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అభినందించారు. ఎలాంటి కోచింగ్ లేకుండా సొంతగా ప్రిపేర్ అయి, తొలి ప్రయత్నంలోనే మంచి ర్యాంకు సాధించడం అభినందనీయమని అన్నారు. ఇదే పట్టుదలను కనబరుస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని సూచించారు.

చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి

- జడ్జి శ్రీనివాసరావు

ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 22: విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని చదవాలని, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా అడిషనల్ డిస్ట్రిక్ట్,సెషన్స్ జడ్జి టి. శ్రీనివాస రావు అన్నారు. శనివారం గోదావరిఖని లోని నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రసూన అధ్యక్షతన న్యాయ సేవాధికారసంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి గా జిల్లా అడిషనల్ డిస్టిక్,సెషన్స్ జడ్జి టి.శ్రీనివాసరావు హాజరై మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని చదవాలని, చట్టాలపై అవగాహన పెంచుకోవా లని అన్నారు. యువత చెడుమార్గాల బారిన పడుతున్నారని, వాటి పట్ల జాగ్రత్త వహించాలన్నారు. చట్టాలపై అవగాహన ఉంటే గ్రామాల్లో తెలియని వారికి మీరే అవగాహన కల్పించాలన్నారు. వరకట్న సమస్యలు ఎదురు కాకుండా జాగ్రత్త పడాలని ఎలాంటి సమస్యలు ఉన్న న్యాయ సేవ సంస్థను సంప్రదించా లన్నారు.యుక్త వయసులో చెడు మార్గాలు భయభ్రాంతులకు గురికాకుండా జీవితంలో స్థిర పడేందుకు లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు వెళ్లాలని జడ్జి సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయ సేవాధికారి సంస్థ పానల్ లాయర్ జి.భూమయ్య, న్యాయవాది జె.అమరేశ్వర రావు, నర్సింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అరుణకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్తను కాల్చడం వల్ల పర్యావరణం పై దుష్ప్రభావం

- ప్రజల్లో అవగాహన పోస్టర్ ఆవిష్కరించిన అదనపు కలెక్టర్ అరుణశ్రీ

ప్రతిపక్షం, గోదావరిఖని, నవంబర్ 22: చెత్తను కాల్చడం వలన పర్యవరణంపై దుష్ప్రభవం పడుతుందని ప్రజల్లో అవగాహన కల్పించడానికి జిల్లా నేషనల్ గ్రీన్ క్రాప్స్ ఆధ్వర్యంలోరూపొందించిన పోస్టర్ను అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె.అరుణశ్రీ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్తను తగలబెట్టడం నేరమని, ఇందుకు ఐదు వేల రూపాయల జరిమానాతో పాటు బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ గ్రీన్ కార్ప్స్ కోఆర్డినేటర్, తెలంగాణ పర్యావరణ విద్య బ్రాండ్ అంబాసిడర్ గుల్ల అంజన్ కుమార్, నగర పాలక సంస్థ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ మధుకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షునిగా రఘునాథరెడ్డి

- విధేయతకు పట్టం కట్టిన పార్టీ

ప్రతిపక్షం ప్రతినిధి, మంచిర్యాల, నవంబర్ 22: మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా రామకృష్ణాపూర్ కు చెందిన పిన్నింటి రఘునాథరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనను నియమిస్తూ ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మూడున్నర దశాబ్దాలుగా పార్టీకి అంకితభావంతో నిత్య కార్యకర్తల పనిచేస్తున్న రఘునాథరెడ్డికి ఈ పదవి లభించడం పట్ల జిల్లా వ్యాప్తంగా సంబరాలు అంబరాన్ని అంటాయి. రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకట స్వామితో పాటు ఆయన తనయుడు పెద్దపెల్లి ఎంపీ జి వంశీకృష్ణ ముఖ్య అనుచరుడిగా రఘు నాదరెడ్డి కొనసాగుతూ ఉన్నారు. విద్యార్థి దశ నుండి ఎన్ఎస్ఐ నాయకుడిగా కాంగ్రెస్ పార్టీలో రఘునాథరెడ్డి రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది. పార్టీలో వివిధ హోదాలో ఆయన పని చేశారు. పార్టీ మారకపోవడం కూడా ఆయన అధ్యక్ష పదవి కావడానికి దోహదపడింది అని చెప్పవచ్చు. జిల్లా పార్టీలో రఘునాథ రెడ్డికి మంచి పేరు ఉంది. జిల్లాలో మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ తో సైతం మంచి సంబంధాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతోంది. దీనితో తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలకు పార్టీ జిల్లా అధ్యక్షుల నియామకం చేపట్టడం కూడా స్థానిక సంస్థల ఎన్నికలకు కలిసి వచ్చే అవకాశం ఉంది. జిల్లా అధ్యక్షునిగా నియమితులైన రఘునాథ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ పదవి కట్టబెట్టిన ఆల్ ఇండియా జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మల్లికార్జున ఖర్గే, కేసి వేణుగోపాల్ తో పాటు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అంతే కాకుండా రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తో పాటు మంత్రి వివేక్ వెంకటస్వామి తో పాటు ఎంపీ గడ్డం వంశీ కృష్ణకు సైతం కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు తేదీ ఎప్పుడు వెల్లడైనా పార్టీ విజయమే లక్ష్యంగా పాటుపడతానని పేర్కొన్నారు. జిల్లాలో పార్టీ అభివృద్ధి ఏకైక లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు.

డిసెంబర్ 10న వ్యాపార కమిటీ ఎన్నికలు

ప్రతిపక్షం ప్రతినిధి, మంచిర్యాల, నవంబర్ 22: మందమర్రి పట్టణ వ్యాపార కమిటీ ఎన్నికల నిర్వహణ ప్రక్రియను మొదలు పెట్టామని ఎన్నికల కమిటీ నాయకులు మహేందర్ రెడ్డి, రొడ్డ మోహన్, బి. శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. శనివారం ఎన్నికల కోసం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ డిసెంబర్ 10న ఎన్నికలు నిర్వహిస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 1 నుంచి 4 వరకు నామినేషన్లు, 5న ఉప సంహరణ ఉంటుందని పేర్కొన్నారు. పోటిదారులు 8వ తేదీ వరకు ప్రచారం చేసుకోవచ్చునని తెలిపారు. ఎన్నికల నియమనిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు ఉంటాయని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి వ్యాపారస్తులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో మోహన్ తదితరులు పాల్గొన్నారు.

“

తులం బంగారం, రూ.2,500 ఏమయ్యాయంటున్నారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌తో పాటు బంగారం ఇవ్వాలంటే మరో రూ.లక్ష అవుతుంది. తులం బంగారం అమలుకు రూ.4వేల కోట్లు, మహిళలకు రూ.2,500 ఇవ్వడానికి రూ.10వేల కోట్లు కావాలి. ఏడాదికి రూ.75వేల కోట్ల వడ్డీ కడుతున్నాం. బీఆర్ఎస్ అప్పులు చేయకుండా ఉండి ఉంటే పథకాలన్నీ అమలయ్యేవి.

-పథకాల అమలుపై మంత్రి జూపల్లి

ప్రాంతీయం

స్త్రీనిధితో మహిళలకు స్వయం ఉపాధి: కలెక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, నవంబర్ 22 : స్త్రీనిధి వల్ల మహిళలు స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా ఎదుగుతున్నారని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంఘ్వాన్ పేర్కొన్నారు. శనివారం స్త్రీనిధి ద్వారా ఋణ సహాయం, ఎలక్ట్రిక్ ఆటోలు, బైకులు లబ్ధిదారులకు అందజేశారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఆవరణలో స్త్రీ నిధి ద్వారా ఋణ సహాయం కింద ఎలక్ట్రికల్ ఆటోలు, బైకులను జిల్లా పాలనాధికారి ఆశిష్‌సాంగ్వాన్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్త్రీనిధి తెలంగాణ ప్రభుత్వ ప్రోత్సాహంతో కొనసాగుతున్న అత్యున్నత సహకార క్రెడిట్ సొసైటీ, జిల్లాలోని మహిళా స్వయం సహాయక బృందాలకు రుణాలను అందిస్తూ, పేదరిక నిర్మూలనలో ముఖ్యపాత్ర పోసిస్తోందన్నారు. సహకార సంఘాల కింద నమోదైన స్త్రీనిధి, బ్యాంకింగ్ రంగంలోని క్రెడిట్‌ను సమర్థంగా భర్తీ చేస్తూ, మహిళల జీవనోపాధి అభివృద్ధికి వివిధ ఆదాయ కార్యక్రమాలకు ఆర్థిక మద్దతు అందిస్తోందన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిధిలోని కామారెడ్డి, లింగంపేట్, రాజంపేట, దోమకొండ, బిక్నూర్ మండలాలకు చెందిన మొత్తం 11 మంది లబ్ధిదారులకు 15 లక్షల రూపాయల స్త్రీనిధి బ్యాంకు ఆర్థిక సహకారంతో 2 ఎలక్ట్రిక్ ఆటోలు, 9 ఎలక్ట్రిక్ బైకులు లబ్ధిదారులకు అందజేశారు. గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబన సాధనలో స్త్రీ నిధి బ్యాంకు అందిస్తున్న ఈ సహాయం కీలక పాత్ర పోషిస్తోందని ఈ వాహనాల పంపిణీ తో గ్రామీణమహిళలకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు, వారిలో ఆర్థిక స్థిరత్వం సాధనకు మరింత ప్రోత్సాహం లభించనుందన్నారు . ఈ కార్యక్రమంలో అదనపు డీఆర్డీవో విజయలక్ష్మి, స్త్రీనిధి జోనల్ మేనేజర్ రవికుమార్, స్త్రీనిధి రీజనల్ మేనేజర్ కిరణ్ , అలాగే డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, వీవోఏలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కొత్త తరహాలో మహారాష్ట్రకు ఇసుక అక్రమ రవాణా

- భగ్నం చేసిన మద్నూర్ పోలీసులు
- టిప్పర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణాకు ఆటకం కలగకుండా కార్లతో పైలటింగ్
- 2 టిప్పర్లు2 పైలటింగ్ కార్లు స్వాధీనం.. 6 గురిపై కేసు నమోదు

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, నవంబర్ 22: కొత్త పద్ధతిలో పైలట్ కార్ల సహాయంతో ముందుగా ఉంటూ పోలీస్ చెక్‌పోస్టులను దాటించి మహారాష్ట్రకు ఇసుకను టిప్పర్ ల ద్వారా అక్రమంగా తరలించడానికి ప్రయత్నిస్తున్న వ్యక్తులను పోలీసులను పట్టుకున్నారు. పక్కా సమాచారంతో ముందస్తు నిఘా ఏర్పాటు చేసిన మద్నూర్ పోలీసులు, శుక్రవారం రాత్రి ప్రత్యేక తనిఖీలలో రెండు టిప్పర్లు మరియు వాటి మార్గాన్ని క్లియర్ చేయడానికి వెళ్తున్న రెండు పైలట్ కార్లను ఆపి తనిఖీ చేశారు. తనిఖీలలో టిప్పర్లలో ఇసుక ఉన్నట్లు ధృవీకరించారు. పరిశీలనలో, ఈ ఇసుక పోతంగల్ గ్రామం, నిజామాబాద్ ప్రాంతం నుండి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా రవాణా చేయబడుతున్నట్లు గుర్తించారు. తద్వారా ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నట్లు గుర్తించారు. ఈ ఆపరేషన్‌లో 2 టిప్పర్లు, 2 కార్లు స్వాధీనం చేసుకున్నారు. టిప్పర్ డ్రైవర్లు ఇద్దరు, పైలట్ కార్లలో ఉన్న నలుగురు మొత్తం ఆరుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మద్నూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, విచారణ జరుపుతున్నారు.

బ్యూటీపార్లర్ కోసం అద్దేకిస్తే యజమాని ఇంటికి కన్నం

- రూ.20 లక్షల నగదు, 17 తులాల బంగారం, కిలో వెండి చోరీ
- నిందితురాలి అరెస్టు సొత్తు స్వాధీనం

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 22 : బ్యూటీపార్లర్ కోసం ఇంటిని అద్దెకు ఇస్తే అందులో పని చేసే అక్క యజమాని ఇంటికి కన్నం వేసిన ఘటన నిజామాబాద్ జిల్లా కేంద్రంలో వెలుగు చూసింది. నగరంలోని వన్ టౌన్ పోలీసే స్టేషన్ ఎస్‌ఎచ్‌ఓ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ నగరంలోని కుమార్ గల్లీ చెందిన గంగా విషన్ తన ఇంట్లో ఒక షట్టర్ ను మూడేండ్ల క్రితం బ్యూటీపార్లర్ కు అద్దెకు ఇచ్చాడు. పార్లర్ యజమానురాలి అక్క వినాయకనగర్ చెందిన గాయత్రి అలియాస్ గౌతమి ఇందులో పని చేస్తుంది. ఈ క్రమంలో ఇంటి యజమానులతో గాయత్రి సన్నిహితంగా ఉంటూ వచ్చింది. ఓ రోజు గాయత్రి ఇంటి యజమాని డోర్ తాళం చెవి (సెంట్రల్ లాక్)ను చోరీ చేసి డుబ్లికెట్ కీ చేయించుకుంది. దాంతో యజమానులు ఇంట్లో లేని సమయంలో తన వద్ద ఉన్న తాళం చెవితో ఇంట్లోకి చొరబడి కబోర్డ్ లో ఉన్న బంగారు నగలు, వెండి చోరీ కొద్ది కొద్దిగా చోరీ చేస్తూ వచ్చింది. ఇలా చాలా సార్లు వస్తువులు,డబ్బులు కనిపించకుండా పోవడంతో ఇంట్లో వారిపై అనుమాన పడుతూ వచ్చాడు. దీనికి ఇంట్లోవారు తాము తీయలేదని చెప్పడంతో అనుమానం వచ్చిన యజమాని ఇంట్లో స్పై కెమెరా అమర్చారు. అనంతరం గౌతమి మరోసారి చోరీకి పాల్పడగా, ఈ ఘటన సీసీ కెమెరాలు నమోదు కావడంతో ఇది యజమాని పోలీసులకు శుక్రవారం వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత కొంతకాలంగా గౌతమి దొంగలించిన మొత్తం సొత్తు రూ.20 లక్షల నగదు, 17 తులాల వరకు బంగారు నగలు, కిలో పావు వెండి వస్తువులు చోరీకి గురైనట్లు తేలింది. పోలీసులు గౌతమి పై కేసు నమోదు చేసి అరెస్టు చేసి శనివారం ఆమె నుంచి 80 గ్రాముల బంగారం, 1300 గ్రాముల వెండి, రూ.50 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గౌతమిని కోర్టులో హాజరు పరచగా కోర్టు ఆమెను రిమాండ్కు పంపినట్లు ఎస్ ఎచ్ ఓ రఘుపతి తెలిపారు.

చిన్న కాళేశ్వరం భూసేకరణ పై సమీక్ష

- సమన్వయంతో పనిచేయాలి జిల్లా కలెక్టర్

ప్రతిపక్షం, భూపాలపల్లి ప్రతినిధి, నవంబర్ 22: ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం చేపట్టిన చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పంట కాలువలు నిర్మాణానికి ఎంత భూమి అవసరం ఉంది, ఎంత మంది రైతుల భూములు కోల్పోతున్నారు, ఎన్ని ఎకరాలు అవసరం అవుతుందనే అంశాలపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు ప్రగతిపై ప్రతి వారం సమీక్ష ఉంటుందని గత వారం సమీక్షలో చేసిన సూచనల మేరకు, ఈ వారం వరకు సాధించిన పురోగతిని సమీక్షించారు. సర్వేలో ప్రభావిత గ్రామాలు, సర్వే నంబర్లు, రైతుల వారీగా భూ వివరాలు, పంటల సాగుపై అధికారులు స్పష్టమైన అవగహన కలిగి ఉండాలని సూచించారు. పంట కాలువల నిర్మాణానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా వేగంగా సాగేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఎస్డీసి రమేష్, ఇరిగేషన్, మహదేవపూర్, కాటారం, మల్హార్, మహాముత్తారం మండలాల తహసీల్దార్లు, మెగా కంపెనీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ చీరలతో మహిళల ఆత్మగౌరవం ఇనుమడింపు

- ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 22 : మహిళల ఆత్మగౌరవాన్ని ఇనుమడింపజేసేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి అన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిజామాబాద్ కలెక్టరేట్ లో అట్టహాసంగా ప్రారంభించారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తదితరులు ఈ వేడుకలో భాగస్వాములు కాగా, ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన గావించారు. ముఖ్య అతిథుల చేతుల మీదుగా మహిళలకు లాంచనంగా ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, మహిళల అభ్యున్నతికి తమ ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని గుర్తు చేశారు. ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకుంటూ ఆర్థిక, సామాజిక ప్రగతిని చాటాలని పిలుపునిచ్చారు. మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈసారి నాణ్యమైన చీరలను తయారు చేయించిందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో నాసిరకం చీరలను అందించారని ఆక్షేపించారు.కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ, మహిళా ఉన్నతి తెలంగాణ ప్రగతి పేరిట 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీరలు అందించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో చీరల పంపిణీకి అవసరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంత మహిళలకు తొలి విడతలో చీరలను పంపిణీ చేస్తున్నారని, పట్టణ ప్రాంతాలలో మార్చి 1వ తేదీ నుండి వారం రోజుల పాటు చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు తదితర వాటిని ప్రభుత్వం మహిళల పేరుతోనే మంజూరు చేస్తోందని, మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశ వేణు, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీ.ఆర్.డీ.ఓ సాయాగౌడ్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, మహిళా సమాఖ్య ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ తో ఎమ్మెల్యే పోచారం భేటీ

ప్రతిపక్షం, బాన్స్ వాడ, నవంబర్ 22: బాన్స్ వాడ నియోజకవర్గంలో నిర్మాణం లో ఉన్న సాగునీటి ప్రాజెక్టు లపై హైదరాబాద్ లోని జల సౌధలో భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సలహాదారు,బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యుడు పోచారం శ్రీనివాస్ రెడ్డి శనివారం భేటీ అయ్యారు. శుక్రవారం బాన్సువాడ నియోజకవర్గం వర్ని మండల పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న సిద్దాపూర్ రిజర్వాయర్, జాకోరా, చందూర్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పరిశీలించిన పోచారం, శనివారం నాడు జలసౌధలో భారీ నీటి పారుదల శాఖ మంత్రితో సిద్దాపూర్ రిజర్వాయర్, జాకోరా మరియు చందూర్ లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణ పనుల గురించి చర్చించారు. వెంటనే మంత్రి సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్ కు త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయాలని, నాణ్యత లోపం లేకుండా చూడాలని సూచించారు.

రాష్ట్రంలో మహిళల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 22: మహిళా సంక్షేమానికి, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. శనివారం హనుమకొండ లోని హరిత కాకతీయ కాన్ఫరెన్స్ హాలులో మహిళా ఉన్నతి తెలంగాణ ప్రగతి ఇందిరా మహిళా శక్తి, ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. హనుమకొండ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గం పరిధిలోని హసన్ పర్తి, ఐనవోలు మండలాలకు చెందిన చెందిన మహిళా సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించగా ఎంపీ కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్. నాగరాజు, హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ చేతుల మీదుగా లాంచనంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ ఇందిరా గాంధీ అంటేనే ఉక్కు మహిళా అని పేర్కొన్నారు. ఇందిరమ్మ స్ఫూర్తితో రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే సంకల్పంతో మహిళలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. పెట్రోల్ బంకులు, సోలార్ పవర్ యూనిట్లను మహిళల ద్వారా ఏర్పాటు చేయిస్తున్నారని అన్నారు. మహిళలు వ్యాపార రంగంలోనూ రాణించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మహిళలకు వెన్నంటి ఉందన్నారు. ప్రతి రంగంలోనూ మహిళలను ముందుకు తీసుకువచ్చి ఆర్థిక అభివృద్ధి సాధించే విధంగా ప్రభుత్వ పథకాలను రాష్ట్రంలో అమలు జరుగుతుందన్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందిస్తున్నారని పేర్కొన్నారు. మహిళా సంఘాలను ముందుండి నడిపిస్తే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందనే ఉద్దేశంతో ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని అన్నారు. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగా లేకున్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమ పథకాల రూపకల్పన చేసుకుంటూ ముందుకెళ్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రజా పాలన వచ్చిందన్నారు. ప్రజా ప్రభుత్వం ప్రజల అభివృద్ధి సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. మొక్కవోని ధైర్యం తో ఆరు గ్యారెంటీ లను అమలు చేస్తున్నామన్నారు. ఆకాశ రంగును నేలకు దించుతూ మహిళలకు నీలి రంగు చీరలను ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. హసన్ పర్తి, ఐనవోలు మండలాలకి చెందిన మహిళా సంఘాల ప్రతినిధులు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న చీరలు చాలా బాగున్నాయని, ఇందుకు సీఎం రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్ కో ఆపరేటీవ్ బ్యాంక్ రాష్ట్ర చైర్మన్ మార్నేని రవీందర్ రావు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, డీఆర్డీవో మేన శ్రీను, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, హసన్ పర్తి, ఐనవోలు మండలాల ఎంపీడీవోలు సుమన వాణి, నర్మద, ఇతర అధికారులు, హసన్ పర్తి, ఐనవోలు మండలాల మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 22 : వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. ఏ ఒక్క రైతు కూడా ఇబ్బందికి గురి కాకుండా ధాన్యం సేకరణ ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని హితవు పలికారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శనివారం సహకార సంఘాల ఇంచార్జిలతో కలెక్టర్ కొనుగోలు కేంద్రాల నిర్వహణపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇప్పటికే జిల్లాలో పెద్ద ఎత్తున ధాన్యం సేకరణ జరిపామని అన్నారు. అయితే పలు చోట్ల నాట్లు వేయడంలో ఆలస్యమైనందున ధాన్యం దిగుబడులు కొంత ఆలస్యంగా వస్తున్నాయని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అలాంటి ప్రాంతాలను మినహాయిస్తూ, మిగితా చోట్ల రెండుమూడు రోజులలో ధాన్యం సేకరణను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సేకరించిన ధాన్యాన్ని వెంటదివెంట మిల్లులకు తరలించాలని, రైతులకు సకాలంలో బిల్లుల చెల్లింపులు జరిగేలా చొరవ చూపాలని అన్నారు. కేంద్రాల వద్ద సరిపడా సంఖ్యలో హమాలీలను అందుబాటులో ఉంచాలని, మిల్లుల వద్ద దొడ్డు రకం ధాన్యం సైతం సకాలంలో అన్లోడ్ చేసుకునేలా చర్యలు తీసుకున్నామన్నారు. కాగా, జిల్లాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా ధాన్యం సేకరణ ప్రక్రియ తుది దశకు చేరుకుందని కలెక్టర్ సంఘాల ఇంచార్జిలను, కేంద్రాల నిర్వాహకులను అభినందించారు. మిగతా ధాన్యాన్ని సైతం పూర్తి స్థాయిలో సేకరించాలని అన్నారు. వచ్చే సీజన్ లో కూడా ఎలాంటి అవరోధాలు లేకుండా ఇదే స్ఫూర్తితో ధాన్యం సేకరణ ప్రక్రియను నిర్వహించేలా ఇప్పటి నుండే ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, సివిల్ సప్లైస్ డీ.ఎం శ్రీకాంత్ రెడ్డి, డీ.ఎస్.ఓ అరవింద్ రెడ్డి, డీ.సీ.ఓ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

“

ఈ రోజుల్లో ఫిల్మ్ మేకింగ్ పూర్తిగా సాంకేతికతపైనే ఆధారపడి ఉంది. నా సినిమాలు అసాధారణంగా ఉంటాయి. నా సినిమాల్లో అవసరమైతేనే సాంకేతికతను వాడుతా. ఈ రోజుల్లో ప్రతిదానికి టెక్నాలజీని వాడుతున్నారు. హీరోలు సెట్స్‌కు రాకుండా గ్రీన్ మ్యాట్ వేసుకొని షూట్ చేసేస్తున్నారు. నేను అలా కాదు ఒరిజినల్.

- ఓ ఇంటర్వ్యూలో నందమూరి బాలకృష్ణ

ఢిల్లీ పేలుళ్ల వెనుక పాకిస్తాన్ కుట్ర

- విచారణలో బయటపడుతున్న నిజాలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 22 : దేశ రాజధాని ఢిల్లీ ఎర్రకోట పేలుడు ఘటన విచారణ తర్వాత ఇది ఆత్మాహుతి దాడి అని అధికారులు నిర్ధారించారు. దీంతో భారత్ ఈ కుట్ర వెనుక ఎవరు ఉన్నారనే కూపీ లాగుతోంది. ఈ క్రమంలో పాకిస్తాన్ హస్తం బయటపడింది. 'జైషే మహమ్మద్' సంస్థతో కుట్రదారులకు లింకులు ఉన్నాయని గుర్తించింది. 2021-22 సంవత్సరాలలో షాహిన్ షాహిద్ టర్కీకి వెళ్లి జైషే మహమ్మద్ నాయకులతో సంబంధాలు పెంచుకొని అఫ్ఘానిస్తాన్, పాకిస్తాన్ మార్గాలుగా భారత్‌కు దాడులు సిద్ధం చేసుకున్నారు. ఇది టర్కీ సాయంతో పాకిస్తాన్ కుట్రగా తెలుస్తోంది. పాక్ ఆక్రమిత కశ్మీర్ లో దాడులు తమ పనే అని పీపుల్ డెమొక్రాటిక్ పార్టీ (పీఓకే) చౌరదీ అన్వర్ ఉల్ హాఖ్ తాజాగా ప్రకటించాడు. 'మేము కశ్మీర్ లో ఎక్కడైనా దాడులు చేస్తూనే ఉంటాం' అన్నాడు. ఏప్రిల్ 22న పహల్గామ్ ప్రాంతంలో 26 మంది యాత్రికులు చనిపోవటంతో ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. భారత ప్రభుత్వం ఈ దాడులకు సంబంధించి కఠిన చర్యలు తీసుకునే స్పష్టమైన సంకల్పంతో ఉంది. ఉగ్రవాదులకు మద్దతు ఇచ్చే దేశాలపై కూడా కఠిన పాలన చేపడతామని ప్రకటించింది. తద్వారా ఆపరేషన్ సిందూర్ 2.0 ప్రారంభం అయ్యే అవకాశం ఉన్న ప్రచారాలు జోరుగా ఉన్నాయి.పాక్ రక్షణ మంత్రి క్వాజా ఆసిఫ్ యుద్ధానికి సిద్ధంగా ఉండాలంటూ పిలుపునిస్తూ వర్ధిల్లుతున్న ఉద్రిక్తతల మధ్య, దేశ భద్రతా శాఖలు అప్రమత్తంగా వ్యవహరించుకుంటున్నాయి. ఆపరేషన్ సిందూర్ 2.0 ఎప్పుడైనా ప్రారంభం కావచ్చని పాకిస్తాన్‌కు అర్థమైంది. ప్రస్తుతం ఆపరేషన్ సిందూర్ హోల్డ్‌లో మాత్రమే ఉంది. 2.0 ప్రారంభిస్తే పాకిస్తాన్ భూమిపై లేకుండా పోతుంది.

విశ్వ వీక్షణం

భారత్ లో మిలినీయం సిటీగా గుర్గావ్

- పెరుగుతున్న కంపెనీలు, ఉద్యోగాలు ఉపాధి

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 22 : భారత్ లో గుర్గాం మిలీనియం సిటీగా, కార్పొరేట్ క్యాపిటల్‌గా మారింది. సైబర్ సిటీ, ఉద్యోగ్ విహార్‌లో 500+ ఫార్చ్యూన్ 500 కంపెనీలు, ఐటీ ఫర్మ్‌లు, స్టార్టప్‌లు ఫ్లిప్‌కార్ట్, పేటీఎం వంటివి ఉన్నాయి. 2025లో ఉద్యోగాలు 20 శాతం పెరిగాయి. ఎకానమిక్ బూస్ట్. హౌసింగ్ బూస్ట్ ను పెంచింది. అందుకే గుర్గాం భారతదేశంలో బిలియనీర్లకు ప్రధాన హాట్‌స్పాట్‌గా మారింది. ఇక్కడి లగ్జరీ రియల్ ఎస్టేట్ బూమ్, ఐటీ స్టార్టప్ హబ్ స్థితి, ఢిల్లీకి సమీపత వల్ల హైనెట్‌వర్త్ ఇండివిజువల్స్, బిలియనీర్లు ఇక్కడే స్థిరపడుతున్నారు. గోల్ఫ్ కోర్స్ రోడ్, డీఎల్ఎఫ్ కామెలియాస్, సెక్టార్ 44, డీఎల్ఎఫ్ సైబర్ సిటీ వంటి ప్రాంతాలు 'ఉత్తర భారతదేశం బిలియనీర్ల రోగా పేరుపొందాయి. ముంబై అల్టామౌంట్ రోడ్ లేదా న్యూయార్క్ బిలియనీర్ల రోతో దీనిని పోల్చుతున్నారు. జీఐఎస్ మ్యాపింగ్, రియల్‌టైమ్ వాటర్ మానిటరింగ్ వంటి టెక్ ఇనిషియేటివ్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్‌ను ప్రోత్సహిస్తున్నాయి. ద్వార్కా ఎక్స్‌ప్రెస్‌వే పూర్తి, రాపిడ్ మెట్రో విస్తరణలు, ఢిల్లీజైపూర్ హైవేలు ట్రాఫిక్‌ను 30 వాతం తగ్గించాయి. సెక్టార్ 90 వంటి ఏరియాలు, సస్టైనబుల్ డిజైన్‌తో గ్రీన్ స్పేసెస్, సైక్లింగ్ ట్రాక్‌లు మారుతున్నాయి.గురుగ్రామ్, వేగవంతమైన అర్బనైజేషన్‌తో భవిష్యత్ రియల్ ఎస్టేట్ హబ్‌గా మారుతోంది. దానికి తగ్గ మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు. ఢిల్లీ నుంచి అతి దగ్గర కావడంతో ఎక్కువ మంది అక్కడ స్థిరపడడానికి ఆసక్తి చూపుతున్నారు.

స్కాన్ చేస్తున్నారా? జాగ్రత్త!!

QR కోడ్ స్కాన్ చేసి పేమెంట్ చేస్తున్నారా? దుకాణదారులు, వినియోగదారులు ఇద్దరూ జాగ్రత్తగా ఉండండి. ఎందుకంటే ఇప్పుడు QR కోడ్ మార్చేసి కూడా మోసం చేస్తున్నారా? ప్రస్తుతం సొసైటీలో జరుగుతున్న మోసాలు తెలిస్తే ఇలా కూడా మోసం చేస్తారా అని మీరు ఆశ్చర్యపోతారు. దుకాణాలు, పెట్రోల్ పంపుల్లో QR కోడ్‌లను మార్చి, మోసగాళ్లు డబ్బు ఎలా దోచుకుంటున్నారో ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం రండి.

ఓ పదేళ్ల క్రితం వరకు మోసం చేయడం అంటే డబ్బు తీసుకొని తిరిగి చెల్లించకుండా ఎగ్గొట్టడం. తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వను. ఏం చేసుకుంటావో నీ ఇష్టం అంటూ మోసగాళ్లు బరితెగించి చెప్పేసే వాళ్లు. ఇప్పుడలా కాదు. మన అకౌంట్ లో డబ్బులు ఎప్పుడు ఎంత కట్ అవుతున్నాయో అర్థం కాకుండా ఉంది. అకౌంట్ లో 100, 200 తగ్గితే అవసరానికి ఖర్చుపెట్టి ఉంటాం లే అని సర్దుకుపోతుంటాం కదా.. కాని 100, 200 లను కూడా డిజిటల్ స్కామర్లు మోసం చేసి దొంగిలస్తున్నారు. సాధారణంగా మన అకౌంట్ లో వేలల్లో డబ్బులు తగ్గాయనుకోండి వెంటనే అనుమానం వచ్చి చెక్ చేసుకుంటాం. కాని వందల్లో తగ్గితే ఖర్చులకు వాడేశామని అనుకుంటాం. ఇక్కడే డిజిటల్ మోసగాళ్లు తెలివితేటలుగా ఎక్కువ మంది దగ్గర తక్కువ డబ్బులు దోచేస్తున్నారు. ఈ విషయం చాలా జాగ్రత్తగా పరిశీలిస్తేనే తప్ప బయట పడదు. ఇలాంటి మోసాల్లో భాగమే క్యూఆర్ కోడ్ మోసాలు.

క్యూఆర్ కోడ్ (Quick Response Code) ఆధారిత మోసాలు కూడా సొసైటీలో పెరిగిపోతున్నాయి. సైబర్ నేరగాళ్లు డిజిటల్ పేమెంట్ వ్యవస్థలోకి కూడా చొరబడిపోతున్నారు. క్యూఆర్ కోడ్ మోసాల్లోనూ చాలా రకాలున్నాయి.

నకిలీ క్యూఆర్ కోడ్

క్యూఆర్ కోడ్ తయారీలోనే మోసగాళ్లు చొరబడిపోతారు. నకిలీ క్యూఆర్ కోడ్లను సృష్టించి వాటిని వ్యాపార సంస్థలకు ఇస్తారు. ఈ విషయం తెలియక జరిగిన పేమెంట్స్ నుంచి వచ్చిన డబ్బంతా మోసగాళ్లు తమ అకౌంట్స్ లోకి మార్చుకుంటారు.

క్యూఆర్ కోడ్ మార్పిడి

చాలా షాపుల్లో క్యూఆర్ కోడ్ లను బయట అతికించి ఉంచుతారు. వినియోగదారులకు వాటిని స్కాన్ చేయమని చెబుతారు. ఇలా బహిరంగ ప్రదేశాల్లో ఉన్న అసలు క్యూఆర్ కోడ్లను మార్చి నకిలీ కోడ్ అతికిస్తారు. ఇది తెలియక వినియోగదారులు, దుకాణ యజమానులు ఇద్దరూ డబ్బులు నష్టపోతారు.

పేమెంట్ చేసినట్టు నటించడం

దుకాణంలో వస్తువులు కొని క్యూఆర్ కోడ్ స్కాన్ చేసినట్లుగా నటిస్తారు. కాని చేయరు. అప్పటికే పేమెంట్ చేసినట్టు ఉన్న మెసేజ్ చూపించి కొందరు మోసం చేస్తుంటారు.

మాల్వేర్ బొమ్మలు

నకిలీ కోడ్లను స్కాన్ చేస్తే మీ ఫోన్‌లో మాల్వేర్ లేదా ఫిషింగ్ లింకులు ఇన్‌స్టాల్ అవుతాయి. దీంతో మీ వ్యక్తిగత సమాచారం దొంగిలించి వాటి ద్వారా బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తారు.

ఇలాంటి క్యూఆర్ కోడ్ మోసాలు కేవలం దుకాణాలకే పరిమితం కాలేదు. పెట్రోల్ పంపులను కూడా లక్ష్యంగా చేసుకుని కూడా చేస్తున్నారు. బిర్యానీ పాయింట్లు, టీ దుకాణాలు, జ్యూస్ సెంటర్లు ఇలా చిన్న చిన్న షాపుల్లో ఎక్కువగా క్యూఆర్ కోడ్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని సైబర్ క్రైమ్ అధికారులు చెబుతున్నారు.

ఈ క్యూఆర్ కోడ్ మోసాల నుంచి తప్పించుకోవాలంటే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసే ముందు డీటైల్స్ ధృవీకరించుకోండి. కోడ్ స్కాన్ చేసిన తర్వాత కనిపించే లింక్ URLను పరిశీలించండి. అనుమానంగా ఉంటే పేమెంట్ చేయకండి. డిజిటల్ పేమెంట్ కోసం Google Pay, PhonePe, Paytm వంటి సురక్షిత యాప్‌లను ఉపయోగించడమే ఉత్తమం.

అంతర్జాతీయ ఆయుధ స్మగ్లింగ్ రాకెట్

- ఛేదించిన దేశ రాజధాని ఢిల్లీ పోలీసులు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 22 : దేశ రాజధాని ఢిల్లీ పోలీసులు ఓ అంతర్జాతీయ ఆయుధ స్మగ్లింగ్ రాకెట్‌ను ఛేదించారు. దానికి పాకిస్తాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐతోనూ ప్రత్యక్ష సంబంధాలు ఉన్నాయని కూడా గుర్తించారు. పాక్ డ్రోన్‌ల సాయంతో అత్యాధునిక తుపాకులను మన దేశంలోకి తీసుకొస్తున్న నలుగురిని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు డీసీపీ సంజీవ్ కుమార్ యాదవ్ నేతృత్వంలోని బృందం ఈ ఆపరేషన్‌ను చేపట్టింది. పలు ప్రాంతాలలో నిఘా పెట్టింది. తనిఖీలు చేస్తుండగా రోహిణి ప్రాంతంలో ఈ ఆయుధ గుట్టు బయటపడింది. నిందితులు డ్రోన్లను ఉపయోగించి పాకిస్తాన్ నుంచి ఆయుధాలను అక్రమంగా రవాణా చేస్తున్నారని ప్రాథమిక విచారణలో తేలింది. తుర్కియే, చైనాకు చెందిన అత్యాధునిక తుపాకులను పాకిస్తాన్ మీదుగా భారత్‌కు ఈ ముఠా తరలిస్తోంది. నిందితులను అజయ్, మన్దీప్, దల్వీందర్ , రోహన్‌గా గుర్తించారు. వీరిలో ఇద్దరు పంజాబ్‌కు చెందిన వారు. వారి నుంచి విదేశాలలో తయారైన పది అత్యాధునిక తుపాకులు, 92 బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆయుధాలను ఢిల్లీ, సమీపంలోని రాష్ట్రాలలో గ్యాంగ్‌స్టర్లకు, నేరస్థులకు వీరు ఆయుధాలు విక్రయించినట్టు పోలీసులు తెలిపారు. అయితే, ఈ ఆయుధాలను లారెన్స్ బిష్ణోయ్, బాంబిహా, గోగి వంటి గ్యాంగ్ సభ్యులకు ఇవ్వాలని నిందితులు భావించారని తెలుస్తోంది.

తమిళనాడులో పొత్తుల యత్నాలు ప్రారంభం

- కమిటీని నియమించిన కాంగ్రెస్ పార్టీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, చైన్నై, నవంబర్ 22 : తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల పొత్తులపై చర్చలు మొదలయ్యాయి. ఈ క్రమంలో ఇండియా కూటమి ముందడుగు వేసింది. డీఎంకేతో కలిసి పోటీ చేసేందుకు సిద్ధమైంది. పంపకాలపై చర్చలు జరిపేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఇదే సమయంలో విజయ్ తమిళగ వెట్రి కజగం (టీవీకే) పార్టీతో కాంగ్రెస్ కు పొత్తు ఉండదని స్పష్టం చేసింది. డీఎంకేతో చర్చలు జరపడానికి నియమించిన కమిటీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహా ఐదుగురు సభ్యులు ఉన్నారని తమిళ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కే సెల్వపెరుంతగై తెలిపారు. ఈ బృందానికి తమిళనాడు, పుదుచ్చేరి పార్టీ ఇన్చార్జ్ నాయకత్వం వహిస్తారని చెప్పారు. కాంగ్రెస్ సీనియర్ నాయుకుడు పి చిదంబరం ఈ కమిటీ ఏర్పాటును స్వాగతించారు. ఇది కూటమి ఐక్యతను బలపరుస్తుందన్నారు. విజయ్‌కు చెందిన టీవీకేతో కాంగ్రెస్ పార్టీ పొత్తు పెట్టుకోవచ్చనే వదంతుల నేపథ్యంలో ఇండియా కూటమిలోని డీఎంకే వర్గాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ క్రమంలో డీఎంకేకు స్పష్టత ఇచ్చేందుకు కాంగ్రెస్ యత్నించింది. అయితే ఈ విషయంపై డీఎంకే ఇంతవరకు స్పందించలేదు. ఊహాగానాలకు చెక్ పెట్టేందుకు కాంగ్రెస్ కమిటీని ఏర్పాటు చేసినట్లు సమాచారం. 2014లో తప్ప 2004 నుంచి కాంగ్రెస్ డీఎంకే కలిసి పోటీ చేస్తున్నాయి. 2014లో డీఎంకే ఒంటరిగా పోటీ చేసింది. ప్రస్తుతం కాంగ్రెస్ నుంచి 17 మంది ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

'తేజస్' కూలిపోవడం దురదృష్టకరం

- కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 22 : భారత్‌కు చెందిన తేజస్ యుద్ధ విమానం దుబాయి ఎయిర్ షోలో కూలిపోవడం దురదృష్టకరమని కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అన్నారు. ఈ ప్రమాదంపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిగే వరకూ దీనిపై ఏమీ మాట్లాడలేమని పేర్కొన్నారు. సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందన్నారు. కాగా, ఈ ఘటన మీద భారత వైమానిక దళ మాజీ అధికారులు పలువురు మాట్లాడుతూ తేజస్ విమాన ప్రమాదం పైలట్ నియంత్రణ కోల్పోవడం లేదా గురుత్వాకర్షణ శక్తి ఒత్తిడి తీవ్రం కావడమో కారణం కావచ్చని అంటున్నారు. అప్పుడు పైలట్ స్పృహ కోల్పోయి ఉండవచ్చని కెప్టెన్ అనిల్ గౌర్ అన్నారు. కాక్‌పిట్ నుంచి పూర్తి డేటా సేకరించిన తర్వాత మాత్రమే ప్రమాదానికి సంబంధించిన కచ్చిత కారణాలను తెలుసుకోగలమని పేర్కొన్నారు. పైలట్లు కాళ్లలో రక్తం నిలిచిపోకుండా ఉండటానికి ధరించే జీసూట్ తో కూడా సమస్య అయి ఉండవచ్చని తెలిపారు. ఇటు ప్రమాదం పట్ల బాధిత కుటుంబానికి సానుభూతి తెలుపుతూ భారత వైమానిక దళం ఒక ప్రకటన విడుదల చేసింది. పైలట్ మరణించడం చాలా బాధాకర విషయమని విచారం వ్యక్తం చేసింది. పైలెట్ కుటుంబానికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చింది. పైలట్ మరణానికి గల కారణాలను తెలుసుకోవడానికి విచారణ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది.

తొలి రోజు ఓపికగా ఆడిన సౌతాఫ్రికా

- ఆట ముగిసేసరికి 6 వికెట్లకు 247 పరుగులు

టీమిండియాతో జరుగుతున్న రెండో టెస్టును సౌతాఫ్రికా తొలిరోజు ఆశాజనకంగ ఆరంభించింది. బ్యాటింగ్‌కు సానుకూలంగా ఉండడంతో ఓపికగా ఆడి తొలి రోజు ఆట ముగిసే సమయానికి 81.5 ఓవర్లలో 6 వికెట్లకు 247 పరుగులు చేసింది. ట్రిస్టన్ స్టబ్స్ 49, టెంబా బవుమా 41, ఎయిడెన్ మార్క్‌రమ్ 38, ర్యాన్ రికెల్టన్ 35 పరుగులు చేశారు. తొలి రెండు సెషన్లలో సౌతాఫ్రికా పూర్తి ఆధిపత్యం చెలాయించగా, కుల్దీప్ యాదవ్ (3 వికెట్లు) కారణంగా ఆఖరి సెషన్‌లో భారత్ పైచేయి సాధించింది. బుమ్రా, సిరాజ్, జడేజా తలా ఓ వికెట్ తీసుకున్నారు. వెలుతురు మందగించడంతో మరో 8.1 ఓవర్లు మిగిలి ఉండగానే ఆటను నిలిపేసారు. అంతకు ముందు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికాకు ఓపెనర్లు మార్క్‌రమ్, ర్యాన్ రికెల్టన్ మంచి ఆరంభాన్ని అందించారు. బుమ్రా వేసిన ఇన్నింగ్స్ ఏడో ఓవర్‌లో నాలుగు పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద మార్క్‌రమ్ ఇచ్చిన తేలికైన క్యాచ్‌ను కేఎల్ రాహుల్ వదిలేశాడు. ఈ అవకాశాన్ని అతను చక్కగా ఉపయోగించుకున్నాడు. మరో రెండు రనౌట్ అవకాశాలు కూడా భారత్ వదిలేసుకుంది. చివరకు మార్క్‌రమ్‌ను బుమ్రా బౌల్డ్ చేశాడు. దాంతో సౌతాఫ్రికా 82/1 స్కోర్‌తో టీ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్ ఆరంభంలోనే ర్యాన్ రికెల్టన్‌ను కుల్దీప్ యాదవ్ ఔట్ చేశాడు. అనంతరం ట్రిస్టన్ స్టబ్స్, టెంబా బవుమా జట్టును ఆదుకున్నారు. ఓపికగా ఆడుతూ వీలుచిక్కిన బంతిని బౌండరీకి తరలించారు. దాంతో సౌతాఫ్రికా 156/2 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. బవుమా-స్టబ్స్ జోడీని జడేజా విడదీసాడు. బవుమాను ఔట్ చేశాడు. స్టబ్స్‌ను కుల్దీప్ యాదవ్ వెనుకకు పంపాడు. మల్డర్(13)ను పెవిలియన్ చేర్చాడు.

యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా దూకుడు

- తొలి టెస్టులో ఇంగ్లండ్ ఘోర పరాజయం

ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా దూకుడుగా ఆడుతోంది. పెర్త్ లో జరిగిన తొలి టెస్ట్‌లో ఎనిమిది వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించింది. రెండో ఇన్నింగ్స్ లో 205 పరుగుల లక్ష్యంతో బ్యాటింగుకు దిగిన ఆసీస్, ట్రావిస్ హెడ్ అద్భుత సెంచరీతో 123 పరుగులు చేయడంతో 28.2 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది. రెండు రోజులలోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో హెడ్ అసాధారణ బ్యాటింగ్ చేశాడు. టీ20 తరహాలో విరుచుకుపడ్డాడు. దీంతో హోరాహోరీ తప్పదనుకున్న మ్యాచ్ ఏకపక్షంగా ముగిసింది. అతనికి తోడుగా మార్నస్ లబుషేన్ 51 (నాటౌట్) పరుగులతో రాణించాడు. ఇంగ్లండ్ బౌలర్లలో బ్రైడన్ కార్స్ రెండు వికెట్లు తీయగా, మిగతా బౌలర్లు ఎవ్వరు రాణించలేదు. ఈ విజయంతో ఐదు టెస్ట్‌ల యాషెస్ సిరీస్‌లో ఆసీస్ 1-0తో ఆధిక్యంలో నిలిచింది. రెండో టెస్ట్ 29 నుంచి కాన్‌బెర్రాలో ప్రారంభం అవుతుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 172 పరుగులే చేయగలిగింది. హ్యారీ బ్రూక్ 52 పరుగులతో రాణించగా, ఓలీ పోప్ 46, జెమీ స్మిత్ 33 పరుగులు చేశారు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్ ఏడు వికెట్లు తీశాడు. బ్రెండన్ డొగ్గెట్,రెండు, కామెరూన్ గ్రీన్‌కు ఓ వికెట్ తీశారు. అనంతరం ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 132 పరుగులు చేసి ఆలౌటైంది. అలెక్స్ క్యారీ (26), కామెరూన్ గ్రీన్ (24) ట్రావిస్ హెడ్(21) పరుగులు చేశారు. బెన్ స్టోక్స్ ఐదు వికెట్లు తీయగా, బ్రైడన్ కార్స్ మూడు వికెట్లు పడగొట్టాడు. జోఫ్రా ఆర్చర్ రెండు వికెట్లు దక్కాయి. 40 పరుగుల స్వల్ప ఆధిక్యంతో రెండో రోజు రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ 164 పరుగులకు ఆలౌటైంది. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్ మూడు, స్కాట్ బోలాండ్ నాలుగు వికెట్లు పడగొట్టారు. బ్రెండన్ డొగ్గెట్మూడు వికెట్లు తీసాడు. దాంతో ఆసీస్ ముందు 205 పరుగుల లక్ష్యం నమోదైంది.

సూర్యవంశీ అందుకే బ్యాటింగుకు రాలేదు

- నిర్ణయం తనదేనన్న భారత్ 'ఎ' కెప్టెన్ జితేష్ శర్మ

ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీ నుంచి టీమిండియా వైదొలగింది. బంగ్లాదేశ్‌తో జరిగిన సెమీఫైనల్ సూపర్ ఓవర్‌లో ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఆసాంతం హోరాహోరీగా సాగిన ఈ మ్యాచులో ఆఖరికి బంగ్లాదేశ్ గెలిచింది. ఓటమికి పూర్తి బాధ్యత తనదేనని కెప్టెన్ జితేష్ శర్మ తెలిపాడు. తన బ్యాటింగ్ వైఫల్యంతో పాటు తప్పుడు నిర్ణయాల కారణంగానే ఫైనల్ చేరలేకపోయామని అంగీకరించాడు. ముందుగా బ్యాటింగ్ చేసిన బంగ్లా 'ఎ' జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 194 పరుగులు చేసింది. అనంతరం భారత్ 'ఎ' కూడా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 194 పరుగులే చేసింది. దాంతో సూపర్ ఓవర్ ఆడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సూపర్ ఓవర్‌లో సూర్యవంశీని బ్యాటింగ్ పంపించకుండా జితేష్ శర్మ, రమణ్‌దీప్ సింగ్, అషుతోష్ శర్మ బ్యాటింగుకు వచ్చారు. జితేష్ శర్మ, అషుతోష్ శర్మ వరుసగా ఔటవ్వడంతో భారత్ 'ఎ' ఒక్క పరుగు చేయకుండానే ఆలౌటైంది. సూపర్ ఓవర్‌లో రెండు వికెట్లు కోల్పోతే నిబంధనల ప్రకారం ఆలౌటైనట్లు ప్రకటిస్తారు. అనంతరం బంగ్లాదేశ్, తొలి బంతికే వికెట్ కోల్పోయింది. కానీ, రెండో బంతిని సుయాష్ శర్మ వైడ్ వేయడంతో గెలిచింది. టోర్నీలో అసాధారణ బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చిన వైభవ్ సూర్యవంశీ, ప్రియాన్ష్ ఆర్యను సూపర్ ఓవర్‌లో ఆడించకపోవడంపై విమర్శలు వచ్చాయి. తనతో పాటు అషుతోష్ శర్మ, రమణ్‌దీప్ భారీ షాట్లు ఆడగలమని అనుకున్నామనీ, తుది నిర్ణయం మాత్రం తానే తీసుకున్నానని చెప్పాడు.



గిల్, అయ్యర్ లేకపోతే వన్డే సారథి ఎవరు?!

- రోహిత్ శర్మకు తిరిగి అవకాశం ఉంటుందా!

భారత టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఇంకా గాయం నుంచి పూర్తిగా కోలుకోలేదు. అందుకే గౌహతిలో సౌతాఫ్రికాతో శనివారం ప్రారంభమైన రెండో టెస్టుకు దూరమయ్యాడు. దీంతో వైస్‌కెప్టెన్ రిషభ్ పంత్ కెప్టెన్ బాధ్యతలు స్వీకరించాడు. టెస్టు సిరీస్ ముగిశాక సౌతాఫ్రికా వన్డే, టీ20 సిరీస్ ఆడాల్సి ఉంది. వన్డే సిరీస్ ఈ నెల 30న మొదలవుతుంది. ప్రస్తుతం సౌతాఫ్రికాతో టెస్టు సిరీస్ ఆడుతున్న టీమిండియా వారం రోజులలోనే వైట్ బాల్ సిరీస్ ఆడాల్సి ఉంటుంది. వన్డే జట్టుకు కూడా శుభ్‌మన్ గిల్‌నే కెప్టెన్. దీంతో ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షనలో ఉన్న గిల్ ఈ వారం రోజులలో కోలుకుంటాడా? అనే సందేహాలు మొదలయ్యాయి. కొంత కాలంగా గిల్ విశ్రాంతి లేకుండా క్రికెట్ ఆడడం, టీమిండియాకు ముందు ముందు కీలక సిరీస్‌లు ఉన్న నేపథ్యంలో బీసీసీఐ తగు జాగ్రత్తలు తీసుకుంటున్నది. గిల్ పూర్తిగా కోలుకుంటే తప్ప, జట్టులోకి రావడం అసాధ్యం. వన్డే వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కూడా గాయం నుంచి కోలుకుంటున్నాడు. అయ్యర్ కూడా వన్డే సిరీస్‌లో బరిలోకి దిగడం అనుమానమే. కెప్టెన్, వైస్ కెప్టెన్ ఇద్దరూ గాయాలతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో వన్డే సిరీస్‌లో జట్టుకు ఎవరు సారథ్యం వహిస్తారనేది ఆసక్తిగా మారింది. సీనియర్ బ్యాటర్ రోహిత్ శర్మకు కెప్టెన్ బాధ్యతలు అప్పగిస్తారా? అని అభిమానులు ఎదురుచూస్తున్నారు. రోహిత్‌కు కెప్టెన్సీ ఇస్తే బాగుంటుందని అంటున్నారు. కానీ, ఇది దాదాపు అసాధ్యం! ఎందుకంటే ఒకసారి కెప్టెన్సీ నుంచి తప్పించిన తర్వాత మళ్లీ ఇచ్చే అవకాశాలు తక్కువేనని చెబుతున్నారు.



'స్వయంభూ' రిలీజ్ డేట్ ఫిక్స్

హ్యాపీ డేస్, యువత, ఎక్కడికి పోతావు చిన్నవాడా సినిమాలతో నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు టాలీవుడ్ యాక్టర్ నిఖిల్ సిద్దార్థ. కార్తికేయ ఫ్రాంచైజీతో పాన్ ఇండియా స్థాయిలోమంచి ఫేం సంపాదించాడు. ఈ టాలెంటెడ్ యాక్టర్ కాంపౌండ్ నుంచి వస్తోన్న తాజా చిత్రం స్వయంభు. ఈ చిత్రానికి భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్నాడు. Nikhil 20గా నిఖిల్ తొలి పాన్ ఇండియా ప్రాజెక్టుగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మలయాళ భామ సంయుక్తామీనన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఉత్తేజాన్ని అందించే, జ్ఞానోదయాన్ని కలిగించే నిఖిల్ స్వయంభు ప్రయాణం.. మోస్ట్ ఎక్జయిటింగ్ అనౌన్స్‌మెంట్ అంటూ మూవీ లవర్స్‌లో ఎక్జయిట్‌మెంట్ క్రియేట్ చేశారు మేకర్స్. ఈ చిత్రాన్ని ఎప్పుడు విడుదల చేసేది నవంబర్ 24న ఉదయం 11 గంటలకు వీడియో ద్వారా ప్రకటించబోతున్నట్టు తెలియజేస్తూ కొత్త లుక్ రిలీజ్ చేశారు. ఈ లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. ఠాగూర్ మధు సమర్పణలో పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నారు. స్వయంభులో నిఖిల్ యుద్ధ వీరుడిగా ఇదివరకెన్నడూ కనిపించని సర్‌ప్రైజింగ్ లుక్‌లో మెరువబోతున్నట్టు ఇప్పటివరకు షేర్ చేసిన పోస్టర్లు చెబుతున్నాయి. ఈ చిత్రానికి కేజీఎఫ్ ఫేం రవిబస్రూర్ స్వయంభు చిత్రానికి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి.

'ఛాంపియన్' చంద్రకళ

యంగ్ హీరో రోషన్ పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామా 'ఛాంపియన్'తో అలరించబోతున్నారు. జాతీయ అవార్డు గ్రహీత ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహిస్తున్నారు. జీ స్టూడియోస్ సమర్పణలో స్వప్న సినిమాస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. కథల ఎంపికలో, ప్రతిసారీ బ్లాక్‌బస్టర్‌లను అందించడంలో స్వప్న సినిమాస్ వెరీ స్పెషల్. ఫస్ట్‌లుక్ పోస్టర్లు, టీజర్‌తో సంచలనం సృష్టించిన తర్వాత, మేకర్స్ ఇప్పుడు క్యారెక్టర్ బేస్డ్ గ్లింప్స్ ద్వారా సినిమా ప్రపంచాన్ని పరిచయం చేస్తున్నారు. టీజర్ ప్రేక్షకులను మైఖేల్ సి విలియమ్స్ వరల్డ్ ని పరిచయం చేయగా, ఫస్ట్ సింగిల్ గిర గిర గింగిరాగిరే ప్రోమో అనస్వర రాజన్ పోషించిన చంద్రకళని అద్భుతంగా ప్రజెంట్ చేసింది. గ్లింప్స్‌లో చంద్రకళని ఓ ధైర్యసాహసాలున్న పల్లెటూరి అమ్మాయిగా పరిచయం చేశారు. తన చుట్టూ ఉన్న చిన్న ప్రపంచం కంటే పెద్ద కలలు కంటూ, మంచి నాటక కళాకారిణిగా ఎదిగి, ఒక రోజు తనకంటూ స్వంత నాటక బృందాన్ని స్థాపించాలనే ఆశతో ముందుకు సాగే అమ్మాయి చంద్రకళ . అనస్వర రాజన్ పాత్రను ఎంతో అందంగా మలిచారు. ఆమె పాత్ర ఎంత కీలకమో సన్నివేశాలు స్పష్టంగా చూపిస్తున్నాయి. రోషన్-అనస్వరల కెమిస్ట్రీ ఈ గ్లింప్స్ లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వీరి ప్రేమకథ 'చాంపియన్'లో మనసుని తాకేలా ఉండబోతుంది. మిక్కీ జె మేయర్ కంపోజ్ చేసిన ఆహ్లాదకరమైన మెలోడీ కట్టిపడేసింది. రామ్ మిరియాల వాయిస్ మెస్మరైజింగ్ గా వుంది. పూర్తి లిరికల్ సాంగ్ నవంబర్ 25న విడుదల కానుంది. ప్రొడక్షన్ డిజైనర్ తోట తరణి ప్రీఇండిపెండెన్స్ కాలాన్ని అద్భుతంగా రీక్రియేట్ చేశారు. సినిమాటోగ్రాఫర్ ఆర్. మధీ వండర్ ఫుల్ విజువల్ క్యాప్చర్ చేశారు. కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటర్. ఛాంపియన్ డిసెంబర్ 25న క్రిస్మస్‌కు విడుదల కానుంది.

ఓపెనింగ్ అదిరింది

చాలామంది హీరోల సినిమాలు లైన్ లో ఉన్నా, 'రాజు వెడ్స్ రాంబాయి' అనే చిన్న సినిమా మాత్రం సర్ప్రైజింగ్ ఓపెనింగ్స్ అందుకుని అందరి దృష్టిని ఆకర్షించింది. పూర్తిగా కొత్త నటీనటులు నటించిన ఈ చిత్రం, తొలి రోజునే సాలిడ్ ఎంట్రీ ఇచ్చి, ఇతర నోటెడ్ హీరోల సినిమాలకు గట్టి పోటీనిచ్చింది. ఈ చిన్న సినిమా ఓపెనింగ్స్ ఏకంగా 1.47 కోట్ల గ్రాస్ వసూలు చేయడం విశేషం. ఇది చిన్నసినిమాల కేటగిరీలో ఆశ్చర్యకరమైన నెంబర్ అని చెప్పాలి. కేవలం కలెక్షన్ మాత్రమే కాదు, సినిమాకి ఒక మంచి స్టార్ట్ ఇచ్చినట్లు అయింది. ఈ సక్సెస్ వెనుక మేకర్స్ ప్రమోషన్ అలాగే తీసుకున్న జాగ్రత్తలు కూడా చాలా హెల్ప్ అయ్యాయని అర్థమవుతోంది. దర్శకుడు సాయిలు కంపాటి విసిరిన ఓపెన్ ఛాలెంజ్ బాగా వైరల్ అయిన విషయం తెలిసిందే. నెగెటివ్ టాక్ వస్తే అమీర్‌పేట్ సెంటర్‌లో అర్ధనగ్నంగా తిరుగుతానని ఆయన చేసిన సంచలన ప్రకటన, సినిమాకి కావాల్సినంత హైప్ క్రియేట్ చేసింది. ఈ బోల్డ్ స్టంట్ ద్వారానే ఈ సినిమాకు మీడియా బజ్ దొరికింది. ఈ విధంగా హైప్ క్రియేట్ చేయడంలో సాయిలు కంపాటి సక్సెస్ అయ్యారు. అలాగే తక్కువ టికెట్ ధరలు. ఈ వారం రిలీజ్ అయిన సినిమాల్లోకెల్లా దీని ధరలు చాలా తక్కువ. సింగిల్ స్క్రీన్లలో కేవలం 99, మల్టీప్లెక్స్‌లలో 105 రూపాయలకే టికెట్ ధరలు ఉండటంతో, ఆడియన్స్ ఇది ఒక వాల్యూ ఫర్ మనీ సినిమాగా భావించారు. ఈ స్మార్ట్ ప్రైసింగ్ వల్ల జనం టికెట్లు కొని థియేటర్లకు రావడానికి పెద్ద సానుకూల అంశంగా మారింది. చిన్న సినిమాకు వాల్యూమ్ ముఖ్యం కాబట్టి, ఈ నిర్ణయం అద్భుతంగా పనిచేసింది.

'పాంచ్ మినార్' థియేటర్స్‌లో మిస్ అవ్వొద్దు

- ఫ్యామిలీ, ఫ్రెండ్స్ కలసి ఎంజాయ్ చేసే సినిమా ఇది
- సక్సెస్ మీట్ లో హీరో రాజ్ తరుణ్

యంగ్ ట్యాలెంటెడ్ రాజ్ తరుణ్ హీరో ఫన్ టాస్టిక్ బ్లాక్ బస్టర్ 'పాంచ్ మినార్'. రామ్ కడుముల దర్శకత్వంలో రూపొందిన క్రైమ్ కామెడీ ఎంటర్ టైనర్ లో రాశి సింగ్ హీరోయిన్ గా నటించింది. గోవింద రాజు ప్రజెంట్ చేసిన ఈ చిత్రాన్ని కనెక్ట్ మూవీస్ ఎల్ఎల్‌పీ బ్యానర్ పై మాధవి, ఎంఎస్ఎం రెడ్డి నిర్మించారు. నవంబర్ 21న విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ రెస్పాన్స్ తో సక్సెస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ సక్సెస్ మీట్ నిర్వహించారు. సక్సెస్ మీట్ లో హీరో రాజ్ తరుణ్ మాట్లాడుతూ.. ''శ్రీనివాస్ రెడ్డికి నేను ఫ్యాన్ బాయ్. ఆయనతో కలిసి పనిచేసిన అవకాశం రావడం చాలా ఆనందంగా ఉంది. ఆయన వెంకీ సినిమాకి ఇప్పటికీ ఒకేలా ఉన్నారు. శేఖర్ చంద్ర అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. ఆర్ఆర్ అదిరిపోయింది. థియేటర్స్‌కి వెళ్ళాము. అందరూ కూడా విపరీతంగా ఎంజాయ్ చేస్తున్నారు. నా సినిమా థియేటర్స్ విజిట్ కి వెళ్ళినప్పుడు జనాలు అంతా ఎంజాయ్ చేస్తూ చూడడం నిజంగా చాలా రోజులైంది. ఈ విషయంలో చాలా ఆనందంగా ఉంది. మా ప్రొడ్యూసర్ మాధవి గారికి మంచి సినిమా చేయాలని తపన కథ మీద ఉన్న నమ్మకం, మా డైరెక్టర్ పడ్డ కష్టం, ఈ సినిమాకి ఏదైనా తెచ్చి పెట్టాలని మా గోవిందరాజు గారు ఆయనపై వేసుకున్న భారం.. ఇవన్నీ కలిసి నాకు దొరికిన అదృష్టం పాంచ్ మినార్. చూసిన ప్రేక్షకులందరికీ థాంక్యూ వెరీ మచ్. రేపు థియేటర్స్ లో చూసి ఎంజాయ్ చేయబోతున్నవారికి అడ్వాన్స్ థాంక్యూ వెరీ మచ్. ఒక రెండు గంటలు ఫ్యామిలీతో కలిసి హాయిగా ఎంజాయ్ చేయాలనుకుంటే పాంచ్ మినార్ కి వెళ్ళండి. కచ్చితంగా మిమ్మల్ని ఎంటర్టైన్ చేస్తుంది. అందరూ ఈ సినిమాని థియేటర్స్ లో చూడాలని కోరుకుంటున్నాను''అన్నారు.

'మోహన రాగ మ్యూజిక్'

సంగీత ప్రపంచంలోకి మంచు మనోజ్ ఎంట్రీ

వైవిధ్యమైన సినిమాలతో హీరోగా తనదైన గుర్తింపు దక్కించుకున్న రాకింగ్ స్టార్ మంచు మనోజ్ కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు. సంగీత పరిశ్రమలోకి అడుగు పెడుతున్నారాయన. అందులో భాగంగా మంచు మనోజ్ తన కొత్త మ్యూజిక్ ప్రాజెక్ట్ 'మోహన రాగ మ్యూజిక్'ను ప్రారంభించబోతున్నట్లు ప్రకటించారు. ఈ అనౌన్స్‌మెంట్ ఆయనకు, ఆయన కుటుంబ సభ్యులకు ఓ ఎమోషనల్ మైల్ స్టోన్ అనే చెప్పాలి. ప్రారంభం నుంచి మంచు మనోజ్ జీవితంలో సంగీతం అనేది ఓ అంతర్భాగంగా ఉంటోంది. ఎందుకంటే 'పోటుగాడు' సినిమాలో 'ప్యార్ మే పడిపోయానే..' పాటను పాడి ప్రేక్షకులను మెప్పించారు. కోవిడ్ సమయంలో అందరినీ ఉత్తేజరపరిచేలా 'అంతా బాగుంటాంరా' పాటను విడుదల చేశారు. 'మిస్టర్ నూకయ్య' చిత్రంలో 'పిస్తా పిస్తా..' పాటతో పాటు 'నేను మీకు తెలుసా' సినిమాలో 'ఎన్నో ఎన్నో..', 'మిస్టర్ నూకయ్య' సినిమాలో 'ప్రాణం పోయే బాధ..' పాటలకు సాహిత్యాన్ని అందించారు. ఆయన హృదయానికి హత్తుకునేలా, భావోద్వేగంతో కూడుకున్న, విలక్షణమైన గాత్రం ఆయనలోని సహజమైన సంగీత ప్రతిభను తెలియజేస్తోంది. 'మోహన రాగ మ్యూజిక్' అనేది కొత్త ఆలోచనలు, భావోద్వేగాలను కలిపే వేదిక. ఈ కంపెనీతో మంచు మనోజ్ ఒక కొత్త సృజనాత్మక అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నారు. కొత్తటాలెంట్‌ను ఎంకరేజ్ చేయటం, ప్రయోగాత్మక సంగీతాన్ని ప్రోత్సహించటం..భారతీయ, అంతర్జాతీయ ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా సరికొత్త సంగీతాన్ని రూపొందించటమే దీని ప్రధాన లక్ష్యం. ఈ పేరుకీ ప్రత్యేకత ఉంది. అదేంటంటే.. తండ్రీ కొడుకులిద్దరికీ అత్యంత ఇష్టమైన రాగం మోహన రాగం. ఒరిజినల్ సింగిల్స్, కొలాబ్రేషన్స్, కొత్తరకమైన మ్యూజిక్ ప్రాజెక్ట్స్ ఈ లేబల్ నుంచి రాబోతున్నాయి. మోహన రాగ మ్యూజిక్ కంపెనీతో జరగబోయే అతి పెద్ద ఇంటర్నేషనల్ కొలాబ్రేషన్ గురించి వివరాలు త్వరలోనే వెల్లడి కానున్నాయి. ఇది తెలుగు సంగీతాన్ని ప్రపంచ వేదిక పైకి తీసుకెళ్లే కీలకమైన పరిణామంగా నిలుస్తుంది.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at H.No. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200